1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 7
సంచిక : 3
పుటలు : 52
రు. 25 లు

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INDIA

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఆగస్టు 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in



## ఆగస్టు 29
## గిడుగు రామమూర్తి 158వ జయంతి
## తెలుగుభాషాదినోత్సవం
## తెలుగు స్వాభిమాన దినోత్సవం

గిడుగు రామమూర్తిగారు శాస్త్రవేత్త, హేతువాది. మూఢాచారాలను పాటించని మేరునగధీరుడు. మంచి సంప్రదాయాలను విడిచిపెట్టని మానవతావాది.

తెలుగువారు రామమూర్తిగారిని వ్యావహారిక భాషావాదిగానే చూస్తున్నారు. ఆయన అంతరంగాన్ని చూడలేకపోయారు. వచన రచన మార్గంలో పండితులు వేసిన ముళ్ళకంపలను తొలగించి దారిని సరిచేశారు.

విద్యను ప్రజాపరం చేసిన యోధుడు. బోధన, పాలన ప్రజలభాషలోనే- అమ్మనుడిలోనే జరగాలన్న మేధావి నేటి తెలుగు భాషోద్యమానికి ఆయనే స్ఫూర్తి ....

- గిడుగు అంతరంగం
- గిడుగు అవసరం నేటికీ ఉందా
- అమ్మనుడిలో చదివి అత్యున్నత పదవికి ...
- తెలుగు అకాడమీ పై సంస్కృతాన్ని రుద్దవద్దు

**తెలుగులో ఇంజనీరింగ్ సరే., పాఠశాలల్లో తెలుగు సంగతేమిటి?**




(సామాజిక మాధ్యమాల నుండి...)

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




ఆగస్టు 2021

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| పిలుపు: | తెలుగు స్వాభిమాన ఉద్యమానికై పిలుపు | | 05 |
| సంపాదక హృదయం: | తెలుగులోనే ఇంజనీరింగ్ సరే.,పాఠశాలల సంగతేమిటి? | | 07 |
| ఉద్యమం: | తెలుగు అకాడమీని తెలుగు– సంస్కృత అకాడమీగా | | 09 |
| 'గిడుగు' ప్రత్యేకం: | గిడుగు అంతరంగం | డా॥అల్లంశెట్టి చంద్రశేఖరరావు | 11 |
| 'గిడుగు' ప్రత్యేకం: | గిడుగు అవసరం... | ఆచార్య పరిమి రామనరసింహం | 17 |
| 'గిడుగు' ప్రత్యేకం: | సూర్యరాయాంధ్రనిఘంటు విమర్శ.. | ప్రొ.వెలమల సిమ్మన్న | 20 |
| 'గిడుగు' ప్రత్యేకం: | తెలుగు భాషాభివృద్ధికి 'తానా'... | డా॥జంపాల చౌదరి | 24 |
| భారత ప్రధాన న్యాయమూర్తి: | అమ్మనుడిలో... | ప్రొ. గారపాటి ఉమామహేశ్వరరావు | 26 |
| అమ్మనుడి: | తెలుగు భాషాబోధన–ఒక పరిశీలన | సి.వి.కుమార్ | 29 |
| అమ్మనుడి: | సమసమాజ స్థాపనకు ఎటువంటి విద్య... | జె.డి.ప్రభాకర్ | 31 |
| వారసత్వ సంపద: | అమృత సంతానం | డా॥పి.శివరామకృష్ణ'శక్తి' | 34 |
| పీవీ శతజయంతి: | ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే కదా | డా॥గంధం సుబ్బారావు | 37 |
| శ్రద్ధాంజలి: | రాయంగల క్రిష్ణ రామానుజ....(కీరా) | స.వెం.రమేశ్ | 45 |
| సాహిత్య రంగం: | మరో మరువకూడని మనిషి | మధురాంతకం నరేంద్ర | 48 |
| శ్రద్ధాంజలి: | కణుగుల వేంకటరావు... | డా॥అల్లంసెట్టి చంద్రశేఖరరావు | 50 |
| ధారావాహిక: | అడుగుజాడలూ ఆనవాళ్లు–9 | ఈమని శివనాగిరెడ్డి | 41 |
| కవిత: | మట్టిదుఃఖం | డా॥ సి. భవానీదేవి | 16 |



కార్టూన్లు **సరసి**

కంప్యూటర్ **బండారు రఘురాం**


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com


రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

## చందా వివరాలు

జీవిత చందా : రూ.5000

4 సం॥ చందా : రూ.1000

1 సం॥ చందా : రూ. 300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

**గూగుల్ పే/ ఫోన్ పే**

ద్వారా కూడా చందాను చెల్లించవచ్చును

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

<u>చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా</u>

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ



# 2021 ఆగస్టు 29:
## గిడుగు రామమూర్తి 158వ జయంతి
# తెలుగు భాషాదినోత్సవం
# తెలుగు స్వాభిమాన ఉద్యమానికై పిలుపు



**గిడుగు** రామమూర్తి గారు చూపిన దారి ఇప్పటికీ, తెలుగు వారికి దారిదీపంగా నిలిచివుంది. ఆయన నడిపిన ఉద్యమాన్ని వాడుక భాషోద్యమం/వ్యావహారిక భాషోద్యమం అనడం నాటికి సరిపోయింది. ఆనాడు ఆ మహనీయుని పోరాటం అంతా- పండితుల చాదస్తం వల్ల ప్రజలకు దూరమైపోతున్న తెలుగు భాషను ప్రజాస్వామీకరించడం కోసం. ఆవిధంగా ఆయనది గొప్ప సంస్కరణోద్యమం. ఆ ఉద్యమం అన్ని రంగాల్లో భాషను ఉపయోగించుకోవాలనే ఉత్సాహాన్నీ ధైర్యాన్నీ తెలుగువారిలో నింపింది. ఆయన 1940లో కన్నుమూశారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భాషా రాష్ట్రాల ఏర్పాటు జరగడంతో పాలనలో, బోధనలో ప్రజల భాష పూర్తిగా ఎదుగుతుందనీ 'తెలుగు' ప్రజలం ఉన్నతంగా వికసించగలమని పెట్టుకొన్న ఆశలన్నిటినీ మన పాలకులు వమ్ముచేశారు. పి.వి. నరసింహారావు, ఎన్.టి.రామారావు వంటి అతికొద్దిమంది ముఖ్యమంత్రులు తప్ప తక్కినవారు తెలుగుపట్ల పట్టనితనంతో వ్యవహరించారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడ్డ తరువాత ఈ పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. పరిపాలనలో రెండురాష్ట్రాల్లోనూ తెలుగు వినియోగం అడుగంటింది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే నేటి ముఖ్యమంత్రి గారి తెలుగు వ్యతిరేక విధానాలవల్ల అధికారులు తెలుగు వాడకాన్ని పూర్తిగా మానేశారు. భాషారాష్ట్రాల ఏర్పాటు యొక్క మౌలిక లక్ష్యమైన 'ప్రజలభాషలో పాలించాలి అనే' సూత్రానికే ఇది గొడ్డలిపెట్టు. ఇక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని తొలగించారు. పై చదువుల్లో తెలుగు వాడకాన్ని రద్దు చేశారు. అంతంత మాత్రంగానైనా మాతృభాషలకు విలువ ఇస్తున్న నూతన జాతీయ విద్యావిధానాన్ని కూడా పట్టించుకోవడం లేదు. రాజ్యాంగానికి, విద్యాహక్కు చట్టానికి, ఇతర అన్ని సూత్రాలకు పూర్తి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తెలుగు అణిచివేత విధానాన్ని అమలు చేస్తున్నది. పైగా తెలుగు అకాడమీని 'తెలుగు- సంస్కృత అకాడమీ' గా మార్పుచేస్తూ దేశంలోనే ఎక్కడా లేని ఒక విచిత్రమైన ప్రభుత్వ ఉత్తర్వును ఇచ్చారు. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రజలు సిద్ధపడాలి. పరిపాలనలోనూ పాఠశాలల్లోనూ తెలుగును తొలగించడమంటే మన తెలుగుజాతి ప్రాణమైన తెలుగుభాషను కోల్పోవడమే. భాష నశిస్తే జాతినశిస్తుందని మనకు తెలిసిందే. కనుక మన భాషను మనం కాపాడుకోవడానికి స్వాభిమాన ఉద్యమానికి మనం పూనుకోవాలి. ఇందుకు తగిన సమయం ఇది. గిడుగు జయంతి- తెలుగుభాషాదినోత్సవ సందర్భాన్ని ఈ ఉద్యమానికి అవకాశంగా తీసుకోవాలి అని కోరుతున్నాం. ఇందుకు తెలుగు భాషోద్యమకారులు, రచయితలు, కళాకారులు, ప్రజాసంఘాలు, ప్రజలు అందరూ పూనుకొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**ఇప్పుడు మనం ముందుకు తేవలసిన నిక్కచ్చులు(డిమాండ్లు) మూడు:**

**1. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలన తెలుగులో జరగాలి. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ తెలుగులో ఉండాలి. .**

**2. జాతీయ విద్యావిధానం ప్రకారం పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగును వినియోగించాలి.**

**3. తెలుగు అకాడమీని తెలుగు కోసమే నడపాలి. సంస్కృతాన్ని గానీ మరొక భాషను గానీ తెలుగు అకాడమీపై రుద్దకూడదు.**

**ఇందుకు సంబంధించిన జి.ఒ.నెం: 31/10.7.2021ను రద్దు చెయ్యాలి. జి.ఒ.నెం. 21/16.6.2020ను సవరించాలి.**

'కరోనా' వ్యాప్తి వల్ల నిబంధనలను పాటిస్తూ కొద్దిమందితో తగు కార్యక్రమాల్ని నిర్వహించండి. జాలవేదిక (వెబినార్) సహాయంతో సమావేశాలను నిర్వహించండి. పెద్ద, చిన్న పత్రికల్లోనూ, యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర అన్ని సామాజిక మాధ్యమాల్లోనూ పాలు పంచుకోండి. కరపత్రాలను పంపిణీ చేయండి.జిల్లా, స్థానిక స్థాయిలలో ప్రభుత్వ అధికారులను జిల్లా కలెక్టర్, ఆర్.డి.ఒ. కమిషనర్ మొ॥వారిని కలిసి వినతి పత్రాలను అందచేయండి. పై మూడు డిమాండ్‌ల సాధన పైనే మనం శ్రద్ధ వహించాలి.

అన్ని కార్యక్రమాల్లోనూ గిడుగు స్ఫూర్తిని ముందుకు తేవడం, ఆయన ఆదర్శంతో ముందుకు సాగడం ముఖ్యం. ఆగస్టు 29 నుండి సరికొత్త చైతన్యంతో ముందుకు సాగుదాం. తెలుగు భాషోద్యమ సమాఖ్య శాఖలు, మిత్రసంఘాలు, రచయితలు, కళాకారులు, ఇతర ప్రజాసంఘాలు అందరూ ముందడుగు వెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

సామల రమేష్‌బాబు, జాతీయ అధ్యక్షుడు
**తెలుగు భాషోద్యమ సమాఖ్య**
98480 16136


TELUGU-SANSKRT ACADEMY
వైనాట్ సంస్కృతం? తెలుగుకి తద్దినం పెట్టడానికి రేపు సంస్కృతం మంత్రాలు అవసరం కదా!
సరసి


దేవుడా! ఈ మూడంకె నించి మమ్మల్ని రక్షించు!!
మూడు భాషలు
ఇంగ్లీషు-తెలుగు-సంస్కృతం
మూడు రాజధానులు
థర్డ్ వేవ్
3వ ప్రమాద హెచ్చరిక
మూడే కాళ్లు
సరసి

సంపుటి : 7 సంచిక : 3
అమ్మనుడి
ఆగస్టు 2021

సంపాదక హృదయం

# తెలుగులో ఇంజనీరింగ్ సరే., పాఠశాలలో తెలుగు సంగతేమిటి?

**నూ**తన జాతీయ విద్యావిధానాన్ని ఆమోదించి ఏడాదైన సందర్భంగా భారత ప్రధానమంత్రి నిన్న ప్రత్యేకంగా ప్రసంగించారు. దానిని బాగా ప్రచారం చేశారు కూడా. ప్రపంచంలో బాగా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి మన విద్యార్థులను తయారు చేయడం లక్ష్యంగా ఈ విధానాన్ని చేపట్టామని చెప్పారు. ఇంకా అఖిల భారత వైద్యవిద్యలో ఒ.బి.సి.లకు, అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్‌లు తదితర నిర్ణయాలతో సామాజిక న్యాయం వంటి అంశాలతోపాటు, 11 భాషల్లో ఇంజనీరింగ్ కోర్సులు, అందరికీ కృత్రిమమేథ వంటి వాటిని ముఖ్యంగా ప్రస్తావించారు. అంతకు రెండురోజులముందే అఖిలభారత సాంకేతిక విద్యాసంస్థకు అనుబంధించి ఉన్న 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో దేశీయ భాషలలో బోధన జరగబోతోందని ప్రకటించారు. వీటిలో తెలుగు మాధ్యమంలో బోధనకై గుంటూరు జిల్లాలోని ఎన్‌ఆర్‌ఐ ఇంజనీరింగ్ కళాశాలను ప్రకటించారు. కొత్త జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయడం మొదలు పెట్టిన తర్వాత ఇదొక మంచి పరిణామం. ఈ నిర్ణయానికి వచ్చేముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో అఖిల భారత సాంకేతిక విద్యాసంస్థ ఒక సర్వేను నిర్వహించింది. అందులో 40 శాతం మంది విద్యార్థులు తెలుగులో ఇంజనీరింగ్ విద్య కావాలని కోరిన సంగతి తెలిసిందే. (ఈ పూర్తి గణాంక వివరాలను 'అమ్మనుడి' ఏప్రిల్ 2021 సంచిక 10వ పుటలో ప్రచురించాము.)

సరిగ్గా ఏడాది క్రితం కొత్త జాతీయ విద్యావిధానానికి కేంద్ర ఆమోదం ప్రకటించిన తరువాత అమ్మనుడి ఆగస్టు 2020 సంచిక నుండి దీనిపై వరసుగా వివరమైన వ్యాసాలను, సంపాదకీయాలను అమ్మనుడిలో ప్రచురించాం. మొత్తంమీద విద్యావిధానంలో అంతకుముందున్న స్థితి నుండి అనేక మార్పులను కొ.జా.వి.వి. ప్రకటించినప్పటికీ అది కార్పొరేట్ శక్తుల కౌగిలిలోకి మరింత బలంగా హత్తుకుపోయిన మాట నిజం. ఐనా, దేశహితాన్ని కోరుతూ, భారత సంస్కృతి సంప్రదాయాలు, చరిత్ర, భారతీయ విజ్ఞాన సంపదల వారసత్వాన్ని కొనసాగించడానికీ, అభివృద్ధి చేయడానికీ, విశ్వవ్యాప్తం చేయడానికీ పెద్ద పీట వేస్తున్నట్లు ప్రకటించారు.

భారతీయ భాషల పట్ల ఎన్నో మంచి ప్రస్తావనలనందులో చేశారు. ఐనా, సంస్కృతం పట్ల వారికి గల ప్రగాఢమైన, పవిత్రమైన అంకితభావాన్ని మాత్రం బాగా ప్రదర్శించారు, నిజంగా దేశంలో మాతృభాషల పట్ల కూడా వారికి అంకిత భావం ఉంటే రాజ్యాంగంలో 8వ షెడ్యూల్ లోని 22 భాషలను అధికార భాషలుగా, జాతీయ భాషలుగా గుర్తించి వాటిని కేంద్ర స్థాయిలో అమలులో పెట్టాలి. అన్నిటినీ సమానదృష్టితో ఆదరించాలి. హిందీ ఆధిపత్యవాదానికీ, భారతీయ భాషల సంస్కృతీకరణ విధానానికీ స్వస్తి పలకాలి. ఆగస్టు 2020 సంచిక 'సంపాదకహృదయం'లో మేము హెచ్చరించినట్లు- 'మాతృభాషలతో దోబూచులాట- సంస్కృతం, హిందీలకు మురిపాల మూట' అన్న విధానాన్ని కొనసాగిస్తే అది ఎంతో ప్రాచీన చరిత్ర, బలమైన మూలాలు కలిగిన తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం తదితరభాషల వారిని రెచ్చగొట్టే పరిణామాలకు దారితీస్తుంది. అది భారతదేశ ఐక్యతకు మంచిది కాదు.

భారత ప్రభుత్వం, పాలకవర్గాలు దేశప్రజల శ్రేయస్సును కోరి, భారతీయ భాషల, ప్రజల హితాన్ని కోరి వెంటనే పూనుకొని చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి. అవి:

1. మాతృభాషలో విద్యను పొందే హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలి.
2. కనీసం పాఠశాల విద్యను మాతృభాషా మాధ్యమంలో తప్పనిసరి చెయ్యాలి.
3. మాతృభాషలలో చదువును ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక అర్హతగా తప్పనిసరి చెయ్యాలి.
4. షెడ్యూల్ 8 లోని 22 భాషలనూ జాతీయ భాషలుగా, అధికార భాషలుగా గుర్తించాలి. కేంద్ర ప్రభుత్వ

స్థాయిలో వాటికి పరిగణన రావాలి. చట్టసభల్లోనూ, ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ అమలులోకి రావాలి.

ఈ విధమైన మౌలిక నిర్ణయాలను తీసుకోవడం ఇప్పుడున్న బలమైన కేంద్ర ప్రభుత్వానికి కష్టమేమీ కాదు. కాశ్మీర్, పౌరసత్వం, ఉమ్మడి శిక్షాస్మృతి వంటి కఠినమైన సమస్యలను పరిష్కరించుకొంటూ, దేశ రక్షణకు, ఐకమత్యానికీ మొదటి ప్రాధాన్యతనిస్తున్న నేటిపాలకులు తలచుకొంటే ఇది సాధ్యం కానిదేమీ కాదు. ప్రతిపక్షాలను కూడా కలుపుకుపోయే అవకాశాలున్న అంశం ఇది. భారతదేశపు ఫెడరల్ లక్షణాన్ని కాపాడుకొంటూనే కేంద్రప్రభుత్వాన్ని శక్తిమంతం చేసుకోవచ్చు. భాషా సమస్యకూడా పరిష్కారమవుతుంది. ఇప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానం, కృత్రిమమేధ వికాస దశలో సాగుతున్న మనకు బహు భాషల సహజీవనం సమస్య కానేకాదు. రాజ్యాంగాన్ని ఏర్పరచుకొన్ననాటికి ఈ సౌకర్యాలు లేవు.

ఇక మన రాష్ట్ర ప్రభుత్వాల సంగతి. అనేక సందర్భాల్లో తెలుగు భాషోద్యమ సమాఖ్య, ‘నడుస్తున్న చరిత్ర’, ‘అమ్మనుడి’ పత్రికలు ప్రజల దృష్టికి తెచ్చిన, తెస్తున్న అంశాలు: 1. మాతృభాషలో చదువులు 2.ప్రజల భాషలో పరిపాలన. 25 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో నలుగుతున్న సమస్యలివి. భాషారాష్ట్రాలు ఏర్పడడానికి మూలమైన భాషాజాతి స్పృహను, ఆశలను తొలిపాలకులు కొంత నిబద్ధతతో బలిష్ఠం చేసేందుకు శ్రద్ధ వహించారు. అవసరమైన వ్యవస్థలను నిర్మాణం చేశారు. కానీ 1990 తర్వాత తెలుగు రాష్ట్రపాలకులు ఈ మౌలిక అంశాన్ని విస్మరించారు. ఆత్మ విస్మృతిలో పడిపోయి, బానిస భావనలకు లొంగిపోయారు. ప్రజల పట్ల నిబద్ధత లోపించినప్పుడు, రాజకీయ ఆర్థిక స్వార్థాలు విలయతాండవం చేస్తాయి. తెలుగు నాట జరిగిందీ జరుగుతున్నదీ ఇదే. ఆ పార్టీ, ఈ పార్టీ అని కాకుండా పాలకవర్గాల నైతిక పతనం సాగుతూనే ఉంది.

రెండు తెలుగు రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత – తెలంగాణ పాలకులు ప్రపంచ తెలుగు మహాసభలను జరిపి, పెద్ద పెద్ద వాగ్దానాలు, ఆశలను కురిపించారు. కాని ఆచరణలో పటిష్టంగా ముందడుగు వేయలేకపోయారు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, ప్రజల భాషలో పాలన, బోధన అంశాల పైన నిర్లక్ష్యం ప్రదర్శించిన మొదటి పాలకులు అధికారాన్ని కోల్పోగా ఇప్పుడు అధికారంలోకి వచ్చినవారు ప్రజల భాష తెలుగు మీద కత్తి కట్టినట్లు ప్రవర్తిస్తున్నారు. పాఠశాలల్లోను, పై చదువుల్లోనూ తెలుగు మాధ్యమానికి గోరీ కడుతున్నారు. ఇందుకోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. పాలనలో తెలుగును పూర్తిగా తొలగించారు. కాని ఓట్లు అడిగేందుకు, చట్టసభల్లో వెకిలిగా పోట్లాడుకొనేందుకు వీరికి తెలుగే కావాలి. దీని మర్మమేమిటో ఎవరికి వారే అర్థం చేసుకోవాలి !

రెండు తెలుగు రాష్ట్రాల పాలకులూ నూతన జాతీయ విద్యావిధానాన్ని సమర్థిస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. మరి పైన మేము వివరంగా పేర్కొన్న వైరుధ్యాల సంగతి ఏమిటి? ఈ అంశాలపైన రాష్ట్రాలకూ కేంద్రానికీ మధ్య సమన్వయం గానీ, ఏకాభిప్రాయ ప్రయత్నం గానీ ఉన్నదా? రాజ్యాంగం ప్రకారం విద్య అనేది ఉమ్మడి అంశమైనందున ఈ సమస్యలకు పరిష్కారం కోసం ప్రజలు ఉద్యమాలు చెయ్యవలసిందేనా?

ఉన్నత సాంకేతిక విద్యలో ముఖ్యంగా ఇంజనీరింగ్‌లో భారతీయ భాషలలో విద్యకు వాకిలి తెరచిన అ.భా.సాంకేతిక విద్యా సంస్థకూ, భారత ప్రభుత్వానికీ మా అభినందనలు. ఈ ప్రయోగం విజయవంతం కావడానికి అందరూ సహకరించాలి. ఇదే విధంగా మాతృభాషలను విద్యారంగంలో బలిష్ఠం చేయడం కోసం ఇంకా అనేక చర్యలను తీసుకోవాలి. మంచి కాలానికి దారులు తెరచుకొంటున్నాయని ఆశిద్దాం. ఉద్యమిస్తూ ముందుకు సాగుదాం.

తేదీ : 30-07-2021

సామల రమేష్‌బాబు

## అమ్మనుడి చదువరులకు.....

ఏప్రిల్ సంచికలో విన్నవించినట్లే– మూడు నెలల విరామం తర్వాత ఈ ఆగస్టు సంచిక – తెలుగు భాషాదినోత్సవ సంచికగా– గిడుగు రామమూర్తి 158వ పుట్టినరోజు సందర్భంగా వెలువడుతున్నది. ఇందులో మంచి వ్యాసాలను మీకందివ్వడానికి ప్రయత్నించాము. పుటలను పెంచే అవకాశం లేనందున ప్రతినెలా ధారావాహికగా ప్రచురిస్తున్న కొన్నిటిని ఈ నెలలో ఇవ్వలేకపోయాము – కొత్తమాటల పుట్టింపు, పడమటిగాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద, మావూరు(నవల), కొయ్యబొమ్మల కళాకారుడు గొంబే గౌడర రామనగౌడ ఆత్మకథ, మున్నగువాటిని సెప్టెంబరు సంచిక నుండి ఇవ్వగలం. చదువరులకు ఇబ్బంది కలిగించినందుకు మన్నించగోరుతున్నాము. – సంపాదకుడు

# తెలుగు-సంస్కృత అకాడమీ !
# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'తెలుగు సేవ'కు ఇది పరాకాష్ఠ !!

సొంత అమ్మభాషలో చదువులను హాయిగా నేర్చుకోవడానికి వీల్లేకుండా అన్ని దారులనూ మూసివేసి, కళాశాలల్లో కూడా తెలుగు మాధ్యమానికి స్వస్తి పలికిన జగన్మోహన రెడ్డి గారి ప్రభుత్వం ఇప్పుడు తెలుగు అకాడమీని ఏర్పర్చుతూ, దానికొక పవిత్రబాధ్యతగా సంస్కృతాన్ని కూడా అప్పజెప్పారు. ఇది ఎక్కడా లేని వింత ! ఇంగ్లీషులో చదివితేనే తెలుగువారికి భవిష్యత్తుంటుందంటూ అమాయక ప్రజల్ని మోసం చేస్తున్న ఘనతతో పాటు, సంస్కృతాన్ని ఉద్ధరించాల్సిన బాధ్యతను కూడా ఆయన ప్రభుత్వం నెత్తికెత్తుకున్నట్లు భ్రమపెడుతోంది. లక్ష్మీపార్వతి గారి వంటి ఒక రాజకీయ నిరుద్యోగికి గౌరవ పీఠం వేసి కీ.శే. ఎన్టీరామారావు గారి ఆశీస్సుల్ని పొందవచ్చు అనుకొంటున్నారేమో ! ఇకపై ఆయన తెలుగులో మాట్లాడటం మానివేసి ప్రజలతో కూడా ఇంగ్లీషులో మాట్లాడతారేమోనని జనం భయపడుతున్నారట! ఆయన చర్యల్ని ఖండిస్తూ తెలుగు భాషోద్యమ సమాఖ్య పత్రికా ప్రకటనను, అధికార బాషా సంఘం, పూర్వపు అధ్యక్షుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ ముఖ్యమంత్రి కి వ్రాసిన జాబును ఈ క్రింద ఇస్తున్నాము. సమైక్య రాష్ట్రంలో తెలుగు అకాడమీని తొలిత స్థాపించి ఒక ఉత్తమ చరిత్రకు కారకుడైన నాటి ముఖ్యమంత్రి కీ.శే. పి.వి.నరసింహారావు గారు అకాడమీ పత్రికకు పంపిన సందేశాన్ని కూడా క్రింద ఇస్తున్నాము.

# 'తెలుగు అకాడమీని తెలుగు-సంస్కృత అకాడమీగా మారుస్తున్న ఉత్తర్వులను రద్దు చెయ్యాలి'
# తెలుగు భాషోద్యమ సమాఖ్య డిమాండ్

సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రెండుగా విభజించిన సందర్భంలో కొన్ని సంస్థల విభజన జరగకపోవడం తెలిసిందే. ఇంత వరకు విభజనకు నోచుకోని సంస్థలలో కోట్లాది రూపాయల సొమ్ము, ఆస్తులతో కూడిన 'తెలుగు అకాడమీ' ఒకటి. ఈ నేపథ్యంలో నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 16-6-2020న జి.ఒ.ఎం.ఎస్.నెం: 21 ద్వారా తెలుగు అకాడమీని స్థాపించింది. అప్పటి నుండీ సరైన రూపురేఖలు ఏర్పడలేదు. మరి, ఏమయిందో ఏమో హఠాత్తుగా ఈ నెల 10వ తేదీన తెలుగు అకాడమీని 'తెలుగు-సంస్కృత అకాడమీ'గా మార్చుతూ, జి.ఒ.ఎం.ఎస్ 31ని విడుదల చేసింది ప్రభుత్వం.

1968 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి కీ.శే. పి.వి. నరసింహారావు తెలుగును పాలన, బోధనా భాషగా పూర్తిగా అమలులోకి తేవడంకోసం నిర్ణయించి ఎన్నో చర్యలను చేపట్టారు. అందులో ముఖ్యమైనది 'తెలుగు అకాడమీ' స్థాపన. పరిశోధన, భాషాభివృద్ధి, పాఠ్య గ్రంథాల రూపకల్పన, ప్రచురణ వంటి ఉన్నత లక్ష్యాలతో తెలుగు అకాడమీని స్థాపించారు. 50 ఏళ్లకు పైబడిన ఘన చరిత్రను అది సంతరించుకొంది. రాష్ట్రవిభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన వాటాను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి తెచ్చుకోవలసిన రాష్ట్రప్రభుత్వం అందుకోసం సరైన చర్యలను చేపట్టడంలో విఫలమైంది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రెండు రాష్ట్రాలనూ పరిపాలించిన, పరిపాలిస్తున్న పాలకవర్గాలు ఇందుకు బాధ్యులు. పాలకులకు రాష్ట్ర అధికార భాష అమలుపై ఎటువంటి ఆసక్తి లేకపోగా, ఇందుకు సంబంధించిన రాజ్యాంగబద్ధ అధికార పీఠాలను పదవుల పంపిణీలో భాగంగా వాడుకొంటున్నారు. ఈ క్రమంలో 'తెలుగు అకాడమీ'ని కూడా చేర్చి పదవుల వితరణ మొదలుపెట్టి, అందుకోసం అనాలోచితంగా ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేస్తున్నారు. ఈ మొత్తం చర్యలను తెలుగు భాషోద్యమ సమాఖ్య ఖండిస్తున్నది. ప్రభుత్వ చర్యల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన వందల కోట్ల రూపాయల నిధులను, ఆస్తులను మనం కోల్పోవడమే గాక, తెలుగు భాషాభివృద్ధికి చేపట్టవలసిన చర్యలు మరుగున పడిపోతున్నాయి. ఈ తొందరపాటు చర్యలను ఖండిస్తూ, వెంటనే జి.ఒ.ఎం.ఎస్.నెం. : 31/10-7-2021ని ఉపసంహరించుకోవాలని, జి.ఒ.నెం. 21/16.6.2020 లోని 3 వ అంశంలో పేర్కొన్న ఆశయాలలో చివరిదైన XXXIVని (తెలుగు అకాడమీ- తెలుగుతో పాటు సంస్కృతభాష అభివృద్ధి కోసం కూడా పాటుపడుతుంది అనే అంశాన్ని) పూర్తిగా తొలగించాలి అనీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతున్నాం.

డా॥ సామల రమేష్‌బాబు, జాతీయ అధ్యక్షుడు
డా॥ వెన్నిసెట్టి సింగారావు, ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రధాన కార్యదర్శి
**తెలుగు భాషోద్యమ సమాఖ్య**

10వ పుట చూడండి...

## ముఖ్యమంత్రి గారికి శ్రీ మండలి బుద్ధప్రసాద్ లేఖ

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, గౌ.శ్రీ వై.ఎస్.జగన్మోహనరెడ్డి గారికి, నమస్కారములు,**

తెలుగు అకాడమీ పేరు తెలుగు–సంస్కృత అకాడమీగా మార్పు చేయడాన్ని యావత్తు తెలుగుజాతి వ్యతిరేకిస్తున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకునిరావడానికి ఈ లేఖ రాస్తున్నాను.

తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షులు, అధికార భాషా సంఘం అధ్యక్షులు మినహా దీనిని సమర్ధించిన వారెవరు లేరు. అన్ని రాజకీయ పార్టీలు నిరసన తెలిపాయి. సామాజిక మాధ్యమాలలో ప్రజలు పెద్దఎత్తున తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. పత్రికలు, ప్రసార మాధ్యమాలలో నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజాభిప్రాయం గమనించడానికి ఇంతకంటే వేరే మార్గం ఏముంది..??

తమ మాటలు ఇతరులు అలకించాలనే కోరేవారు, ఇతరుల మాటలు తాము అలకించాలన్నది ప్రజాస్వామ్య మూలసూత్రం. అలా వ్యతిరేకించకపోతే నిరంకుశ, నియంతృత్వ పాలన అవుతుందే తప్ప ప్రజాస్వామ్య పాలన అనిపించుకోదు.

ప్రభుత్వాలు అనేక నిర్ణయాలు తీసుకుంటాయి. ఆ నిర్ణయాలకు ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా ఉంటే వెనక్కు తీసుకుంటాయి. దాని వలన ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. ఇటీవల కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించి ప్రధాని శ్రీ నరేంద్రమోడీ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని ఉచితంగా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నప్పుడు ఆయన ప్రతిష్టకు భంగం ఏమి కలగలేదు. వ్యాక్సిన్ పంపిణీ విషయంలో మీరు కూడా అభ్యతరం వ్యక్తం చేశారు. ప్రధాని పునరాలోచన చేసి నిర్ణయం వెనక్కు తీసుకున్నారు.

తెలుగు సంస్కృత అకాడమీ విషయంలో ప్రజాభిప్రాయాన్ని గమనంలోకి తీసుకుని పునఃపరిశీలన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగుజాతి ఆత్మాభిమానం అంశంగా అందరూ భావిస్తున్నారు.

తెలుగు బాషాభివృద్ధికి 50 ఏళ్ల క్రితం ఏర్పడిన మొట్టమొదటి సంస్థ తెలుగు అకాడమీ. దానిని యధాతధంగా కొనసాగించి, నిధులిచ్చి పటిష్టంగా పనిచేసేలా చేయాలని ప్రజాభిప్రాయం వ్యక్తం అయింది. అలాగే దానిని విభజన ప్రక్రియ పూర్తి చేయించి, మనకు రావాల్సిన దాదాపు రూ.200 కోట్లు రప్పించేవిధంగా చర్యలు చేపట్టాలి. సంస్కృత భాషను ఎవరూ వ్యతిరేకించడం లేదు. సంస్కృత భాషకు ప్రత్యేక అకాడమీ ఏర్పాటుచేయమని అందరూ కోరుతున్నారు.

కావున తెలుగు అకాడమీని యధాతధంగా కొనసాగించి, సంస్కృతానికి ప్రత్యేక అకాడమీ ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టి ప్రజాభిప్రాయాన్ని గౌరవించ ప్రార్ధన... అభినందనలతో....

**డా.మండలి బుద్ధప్రసాద్,** పూర్వపు ఉపసభాపతి, అధికార భాషా సంఘము పూర్వపు అధ్యక్షులు

## తెలుగు అకాడెమీ హైదరాబాదు – జనవరి 1972లో 'తెలుగు' పత్రిక ప్రచురణ మొదలు పెట్టినప్పుడు ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు గారి సందేశం

**మ**నది ప్రజాస్వామ్యము, ప్రజలే పాలకులు, పరిపాలన ప్రజా ప్రతినిధుల ద్వారా జరుగుతున్నది ఈ పరిస్థితులలో ప్రజల భాషకు ఒక విశిష్ట స్థానమున్నది. ఇందుచేత మన తెలుగును ఉన్నత స్థాయిలో విద్యా బోధనకు, రాష్ట్రపరిపాలనకు తగినట్లు తీర్చిదిద్ది, పటిష్ఠం చేయవలసిన ఆవశ్యకమెంతైనా ఉన్నది. అంతేకాదు, మనం మన సోదరులను ఇతోధికంగా విజ్ఞానవంతులను చేయవలె. ఇది మన పవిత్రకర్తవ్యము ఈ కర్తవ్య పాలనలో మనం ప్రమత్తులమైతిమా, భావితరాలు మనలను క్షమించవు.

ప్రజలు విజ్ఞానవంతులైతే మన నిర్మాణకార్యక్రమాలలో సోత్సాహంగా పాల్గొని దేశపురోగతికి ఎక్కువగా తోడ్పడగలరు. మన సభ్యతా సంస్కృతులలో ఉన్న మంచిని, ఇతర నాగరికతా సంస్కృతులతో ఉన్న మంచిని తులనాత్మకంగా పరిశీలించి గ్రహించి తమ జీవితాలను ఫలవంతం చేసుకోగలరు. ప్రజల భాషలో పరిపాలన, విద్యాబోధన జరిగిననాడే ఇది సాధ్యము. ఇందుచేతనే మన ప్రభుత్వము తెలుగును అధికార భాషగా నిర్ణయించింది ఈ నిర్ణయాలకు ప్రజల కోరికయే పునాది, దీనికి ప్రజల సమ్మతి ఉన్నది.

విద్యావిధానము ప్రజల మానసికవికాసానికి తోడ్పడేదిగా ఉండవలె, బోధనభాష ప్రజలభాష అయినసప్పుడే ఇది సాధ్యము. దీనిని సాధించడానికి మంచి పుస్తకాలుండవలె. ఈ కార్యక్రమాన్ని తెలుగు అకాడమి చేపట్టినది. ఇంటర్మీడియట్ తరగతులవారికోసం మౌలికమైన పాఠ్యపుస్తకాలను, డిగ్రీతరగతులవారికోసం మౌలికమైన పఠనీయ గ్రంథాలను వ్రాయించి ప్రకటించడం ద్వారా తెలుగు విద్యావంతులకు పరిచితమై సేవచేస్తూ ఉన్న తెలుగుఅకాడమి ఇప్పుడు ఈ వైజ్ఞానిక పత్రిక ద్వారా తెలుగు ప్రజలకు సేవచేయవలెనని సంకల్పించినది. ఇది ముదావహము.

ఈ ఆధునికయుగంలో ప్రజలలో విజ్ఞానవ్యాప్తి జరగడానికి పత్రికలు మంచిసాధనాలు. గ్రంథపఠనావకాశము, గ్రంథరచనావకాశము సర్వులకు లభించకపోవచ్చు కాని, ఈ అవకాశాలు సాధ్యమైనంత ఎక్కువమంది పత్రికలద్వారా కల్పించవచ్చు. కళాశాలలలో తెలుగులో పఠన పాఠనాదులు జరుగుతున్న ఈ రోజులలో విద్యార్థులు, అధ్యాపకులు కూడా క్లాసుపుస్తకాల పరిధిని దాటి అధికంగా విజ్ఞానవిషయాలను గురించి చదివే అవకాశము తెలుగులో కల్పించవలెననే దృష్టిలో ఈ పత్రిక బయలుదేరినది. దీని ద్వారా తెలుగు అకాడమి తెలుగువారితో వైజ్ఞానిక విషయాల, ప్రసారాన్ని ఇతోధికంగా చేస్తుందని ఆశిస్తూ – ఈ కృషి విజయవంతంకావలెనని వాంఛిస్తూ దీనిని తలపెట్టిన 'అకాడమి'ని అభినందిస్తున్నాను.

డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు
99496 05141



తెలుగువారు రామమూర్తిగారిని వ్యావహారిక భాషావాదిగానే చూస్తున్నారు గాని ఆయన అంతరంగాన్ని చూడలేకపోయారు. స్టరోస్టా అన్నట్టు రామమూర్తిగారు గురువు. సవరలకు వారి భాషలోనే విద్య నేర్పాలని వాచకాలు నిఘంటువులు రాసి, సొంత దబ్బుతో సవర పాఠశాలలు నడిపిన మానవతావాది. పేదవాళ్ళనీ, పిల్లలనీ, స్త్రీలనీ విద్యావంతులను చెయ్యాలంటే వారికి అర్థమయే భాషలోనే రాయాలన్నది రామమూర్తిగారి అభిప్రాయం. అందుకే ఆయన వ్యావహారిక భాషావాది అయ్యారు. తెలుగు యువరచయితలకు వెన్నుదన్నుగా బాలకవి శరణ్యం రచించారు. వ్యావహారిక భాషలో రాయడాన్ని అడ్డుకొంటున్న పండిత భిషక్కుల భాషాభేషజాన్ని బట్టబయలు చేశారు. వచన రచనా మార్గంలో పండితులు వేసిన ముళ్ళ కంపలను తొలిగించి మార్గాన్ని సుగమం చేశారు. గిడుగు రామమూర్తి విద్యను ప్రజాపరం చేసిన సమరయోధుడు.

రామమూర్తి గారు తాను హేతువాదినని ఎక్కడా చెప్పుకోలేదు. తాను మానవతావాదినని వేదికలెక్కి ఉపన్యాసాలివ్వలేదు. అతను మూర్తిభవించిన మానవత్వం.

# గిడుగు అంతరంగం

సవర భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రాసి ఆంధ్ర విశ్వకళా పరిషత్ నుండి 1998లో పి.హెచ్.డి. డిగ్రీ పొందిన తరవాత కొంత కాలానికి తొలి సవర భాషాశాస్త్రవేత్త గిడుగు రామమూర్తిగారు రాసిన సవర వాచకాల సేకరణ నిమిత్తం నేను పర్లాకిమిడి వెళ్ళి ఆ ప్రయత్నంలో ఉండగా రామమూర్తిగారితో పరిచయమున్న బండారు సుబ్రహ్మణ్యంగారిని కలవడం జరిగింది. రామమూర్తిగారి పుస్తకాలు లభించలేదు గాని వారి జీవితంలోని ఒక గొప్ప సంఘటన గురించి తెలుసుకోగలిగాను. నా శ్రమ ఫలించిందనుకొన్నాను.

బండారు సుబ్రహ్మణ్యంగారు 1923 లో పర్లాకిమిడిలో పుట్టారు. మూడు తరాలనుండి వారు అదే గ్రామంలో వుంటున్నారు. రామమూర్తిగారిని గురించి తమకు తెలిసినది చెప్పమని కోరగా వారు తన చిన్ననాటి విషయాలను నెమరు వేసుకొంటూ ఇలా చెప్పారు: "రామమూర్తిగారు సమాజంలో సమూలమైన మార్పు రావాలని కోరుకొనే మనిషి. పర్లాకిమిడి జమీందారు(రాజు) చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ఎదుర్కొన్నారు. వారి దోపిడీ విధానాలకి వ్యతిరేకంగా నిలిచారు. 1930 సంవత్సరంలో తాలూకా బోర్డు ఎన్నికలలో జమీందారుకి వ్యతిరేకంగా తమ కుమారుడు సీతాపతిని నిలబెట్టారు. సీతాపతిగారి పార్టీ గెలిచింది. రాజావారి పార్టీ ఓడిపోయింది.

ఇప్పటి ఒరిస్సాలోని గజపతి జిల్లా, నేటి శ్రీకాకుళం జిల్లాలోని హీరమండలం, కొత్తూరు, బత్తిలి, గొప్పిలి, టెక్కలిపట్నం, పోలూరు, పర్లాకిమిడి జమీందారీలో ఉండేవి. ఈ ప్రాంతాలలో పర్లాకిమిడి రాజు శిస్తులు వసూలు చేస్తూ, బ్రిటిష్ ప్రభుత్వానికి మూడు లక్షల రూపాయిలు పేష్కత్ కట్టేవారు. రాజావారు పది లక్షలు వసూలు చేసి, దానిలో ఏడు లక్షలు తాను ఉంచుకొనేవారో, లేదా, ఏడు లక్షలు వసూలు చేసి, నాలుగు లక్షలు ఉంచుకొనేవారో, తనకు సరిగా గుర్తు లేదని సుబ్రహ్మణ్యంగారు చెప్పారు. ఏమైనాగాని వసూలు అధికంగానే వుండేది.

1930-32 ప్రాంతాలలో పర్లాకిమిడి రాజు రూపాయికి ఆరు అణాలు (అణా అంటే రూపాయిలో 16 వ వంతు) అదనపు శిస్తు వసూలు చేయడం ప్రారంభించారు. దీనిని వ్యతిరేకిస్తూ గిడుగు రామమూర్తిగారి అధ్యక్షతన జమిందారీ వ్యతిరేక సంఘం ఏర్పడింది. దీనిలో పర్లాకిమిడి వాస్తవ్యులు సంకు సోమన్న(రైతు), ఘంటికోట సత్యనారాయణ(అడ్వకేటు), డాక్టర్ డి. వైకుంఠం, కన్నేపల్లి సత్యనారాయణ, ప్రవా యజ్ఞేశ్వర శాస్త్రి, సారవకోట వాస్తవ్యుడు బోయిన అప్పలస్వామి(రైతు) సభ్యులు.

అదనపు సదుపాయం కల్పించకుండా శిస్తు అధికం చేసే అధికారం లేదన్నది వీరి వాదన. రాజావారు చేస్తున్న అక్రమ వసూళ్ళను వీరు వ్యతిరేకించారు. రైతులు శిస్తు కట్టడం మానివేశారు. వీరిలో సుబ్రహ్మణ్యంగారి తండ్రి సీతారామచంద్రరావుగారు ఒకరు.

1931సంవత్సరంలో జమీందారు మనుషులు మందీ మార్బలంతో సీతారామచంద్రరావుగారి ఇంటిపైకి వచ్చి, భయపెట్టి బలవంతంగా శిస్తు వసూలుకు సిద్ధపడ్డారు. డబ్బు లేదంటే కొండవాళ్ళను తెప్పించి ధాన్యం కొలిపించుకొని తీసుకొనిపోయిన సంఘటన తన కళ్ళముందు ఈనాటికీ కనిపిస్తుందని, ఈ దురంతానికి ప్రత్యక్షసాక్షి, నాటి బాలుడు, నేటి వృద్ధుడు ఐన సుబ్రహ్మణ్యంగారు చెప్పారు.

పర్లాకిమిడి రాజు వసూలుచేస్తున్న అక్రమ శిస్తులకు వ్యతిరేకంగా కమిటీ వారు హైకోర్టులో దావా వేశారు. కమిటీ ఓడిపోయింది. ఫెడరల్ కోర్టుకు వెళ్ళారు. అక్కడ గూడ జమీందారుకే అనుకూలమైన తీర్పు వచ్చింది. అప్పుడు ప్రీవీ కౌన్సిలుకు అపీలు చేశారు. కమిటీ తరుపున వాదించడానికి సీతాపతిగారు లండను వెళ్ళారు. కాని అక్కడగూడా పేదరైతులకు న్యాయం జరగలేదు.

రామమూర్తిగారు చట్టపరిధిలో న్యాయం జరుగుతుందని ఆశించారు. పర్లాకిమిడి రాజుకు వ్యతిరేకంగా ఒక ఉద్యమాన్ని లేవనెత్తకపోయినా, ఒక పోరాటాన్ని సాగించకపోయినా , అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదుర్కొనే హక్కు తమకు ఉందనే అవగాహనను ప్రజలలో కలిగించారు."

**వారి ఈ మాటలు విన్న తరవాత గిడుగు రామమూర్తిగారి వ్యక్తిత్వం గురించి ఆలోచించడం మొదలు పెట్టాను. శిష్యులకు అతను చరిత్ర పాఠాలు బాగా చెప్పిన గురువుగా కనిపిస్తారు. ప్రపంచ భాషాశాస్త్రవేత్తలకు గొప్ప భాషాశాస్త్రవేత్తగా కనిపిస్తారు. వారిలో స్టాన్లీ స్టరోస్టాకు మానవతావాదిగా గూడ కనిపిస్తారు. తెలుగు వారికి వ్యావహారిక భాషావాదిగా కనిపిస్తారు. నాకు మాత్రం అతనిలోని మానవత్వం కనిపించింది.**

గిడుగు రామమూర్తిగారు సంకలనం చేసిన 32 సవర పాటలున్న సవర సాంగ్స్ అన్న పుస్తకంలో రెండు పాటలు రామమూర్తిగారు స్వయంగా రాశారు. ఈ పాటలలో కవిత్వం లేదు. ఉపమలు ఉత్ప్రేక్షలు లేవు. వీటిలో ఒకటి సవర జానపద కథనాధారంగా చేసుకొని రాసిన పాట. రెండవది "గు'అర్ నేబంజి" అన్న పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పాట. ప్రబోధాత్మకమైనది. చెట్లు తమను నరకవద్దని మనిషిని వేడుకొందాం అని తమలో తాము అనుకొంటున్నాయి అన్నట్లు రాసిన పాట. అవి విలపించడం లేదు. తమను నరికితే కలిగే అనర్థం గురించి మనిషిని హెచ్చరిస్తున్నాయి. మనిషి ఆరోగ్యంగా వుండాలని రామమూర్తిగారి కోరిక. చెట్లు నరికితే కలిగే అనర్థం గురించి 120 సంవత్సరాల క్రితమే రామమూర్తిగారు జాగ్రత పడమని ముందుగా హెచ్చరించారు. మనిషి పెడచెవిని పెట్టాడు. నేడు కష్టాలు అనుభవిస్తున్నాడు.

రామమూర్తిగారి సవర పాటల అనువాదం చదివిన కొందరు పర్యావరణ పరిరక్షణ గురించి ఉపన్యసిస్తున్నప్పుడు ఈ పాటను చదువుతుంటారు.

గిడుగు రామమూర్తిగారు విజయనగరంలో గురజాడ అప్పారావుగారితో కలిసి చదువుకొన్నారు. అప్పారావుగారు గిడుగు రామమూర్తిగారు ఒకేసారి మెట్రిక్ పరీక్ష పాసయారు. ఆర్థికమైన ఇబ్బందుల వల్ల గిడుగు రామమూర్తిగారు ఉద్యోగం చేయవలసి వచ్చింది. విజయనగరానికి దగ్గరలో ఉన్న కోనాడలో ఐతే నెలకు 25 రూపాయిలు జీతం, పర్లాకిమిడిలో ఐతే 30 రూపాయిలు. 5 రూపాయిలు ఎక్కువ ఇస్తారనే ఆశతో తల్లి కాదన్నా మన్య ప్రదేశం అయిన పర్లాకిమిడిలో పనిచేయడానికి వచ్చిన పద్దెనిమిదేళ్ళ యువకుడు గిడుగు రామమూర్తి. రామమూర్తిగారి ఈ నిర్ణయమే అటు సవరజాతికీ, ఇటు తెలుగుజాతికీ ఉపకారం చేసింది. రామమూర్తిగారు 1880లో పర్లాకిమిడి మహారాజావారి హైస్కూలులో ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో ప్రవేశించారు.

గిడుగు రామమూర్తిగారు పర్లాకిమిడి శనివారం సంతలో అమాయకులైన సవరలను వ్యాపారులు మోసంతో ఆర్థికంగా దోచుకోవడాన్ని చూసి కలత చెందారు. అపురూపమైన కొండ సరుకులు అమ్మి వారికి కావలసిన పూసలు, కంచుపాత్రలు, ముతక నూలు బట్టలు కొనుక్కోవడానికి కొండదిగి వచ్చేవారు. రెండు పొగాకు రెమ్మలకు బుట్టెడు చింతపండు ఇచ్చేవారు. కుంచెడు పెద్దకందులుఇచ్చి సోలడు ఉప్పు తీసుకొని తృప్తిపడేవారు. సంతలో కొనుగోలు చేసినపుడూ, సరుకులు అమ్మకాలు జరిపినపుడూ వస్తుమార్పిడికే అలవాటు పడి రూపాయిలూ, అణాలూ, పైసల విలువలు తెలియక గడసరి స్థానిక వర్తకుల వద్ద నష్టపోయేవారు. వీరు చదువుకొంటే లెక్కా డొక్కా తెలుసుకొని వర్తకుల చేతిలో ఇట్లా మోసపోరుకదా అని రామమూర్తిగారు భావించారు. రామమూర్తిగారు పర్లాకిమిడి వెళ్ళక ముందుగూడ శనివారం సంత ఉంది. సవరలు మోసపోవడమూ ఉంది. గాని ఎవరూ స్పందించలేదు.

**రామమూర్తిగారి మానవత్వం అతనిని మేలుకొలిపింది. సవరల జీవనస్థితి మెరుగుపడాలంటే వారిని విద్యావంతులను చెయ్యాలి. వారికోసం బడులు పెట్టాలి అనుకొన్నారు. సవరలకు చదువు చెప్పాలంటే ఆ భాషలో పుస్తకాలు కావాలి. సవరభాషకు సాంప్రదాయకంగా వస్తున్న లిపి లేదు. తెలుగు లిపిలోనే సవరభాషను రాసుకొనే పరిస్థితి ఏర్పడింది. సవర భాషలో వాచకాలూ నిఘంటువులూ, పాటలూ రచించాలి. అందుకోసం ముందుగా తాను సవరభాష నేర్చుకోవడం ప్రారంభించారు. 1884 నాటికి సవరలతో సంభాషించ గలిగే నేర్పు సంపాదించారు.**

1908 లో వెల్ష్‌మన్ అటవీశాఖ అధికారిగా పర్లాకిమిడి వచ్చాడు. సవరభాష నేర్చుకొని మధ్యవర్తులు లేకుండా వారితో నేరుగా మాట్లాడితే వారి కష్టసుఖాలు తెలుసుకోవచ్చు అనే అభిప్రాయం అతనికి కలిగింది. అందుచేత సవరభాష నేర్చుకోవాలి అనుకొన్నాడు.

రామమూర్తిగారు సవర భాష నేర్పగలరని తెలుసుకొని తన బంగళాకు వచ్చి సవర భాష నేర్పాలని, దానికి తగిన పారితోషికం ఇస్తానని అన్నాడు. "నాకు పారితోషికం అక్కరలేదు. శ్రద్ధగా నేర్చుకోవడమే పారితోషికంగా భావిస్తాను. మధ్యాహ్న విరామ సమయంలో కాలేజీకి వస్తే నేర్పుతాను" అన్నారు రామమూర్తిగారు.

**సవరభాషకు లిపి లేదు. సవరభాషలో వాచకాలు రాయడానికి రామమూర్తిగారు తెలుగు లిపినే వాడుకొన్నారు. వెల్ష్‌మన్‌కు తెలుగు రాదు. భాషా బోధనకు అంతర్జాతీయ ధ్వనిలిపి శ్రేష్ఠమైనదని ఆ లిపిలోనే వెల్ష్‌మన్‌కు సవరభాష నేర్పేరు. (ఇంగ్లీషు భాషలో స్పెలింగ్‌కు ఉచ్చారణకూ సంబంధం లేదు. ధ్వని లిపిలో ఇంగ్లీషు అక్షరాలు వాడినా ఒక అక్షరం ఒకే ధ్వని పలుకుతుంది. మన తెలుగులాగ.**



రామమూర్తిగారు బసచేసిన బెతాని బంగళా–పాతభవనం



భవనం వద్ద(ఎడమ) వై.యస్.ప్రకాశం,పర్లాకిమిడి (కుడి)ఈ వ్యాస రచయిత డా.అల్లంశెట్టి చంద్రశేఖరరావు

**మన తెలుగువారు మెసేజులను ఇంగ్లీషు అక్షరాలలో పంపుతున్నారు కదా. (kaaki = కాకి) వెల్షమన్ అంతర్జాతీయ ధ్వనిలిపి ద్వారా అతి తక్కువ కాలంలోనే సవరభాష నేర్చుకొన్నాడు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు తెలియని ఒక విదేశీయునికి కేవలం వాగ్వ్యవహారంలో, నాగరికతకు దూరంగా కొండలలో తమలో తాము మాట్లాడుకొనే గిరిజనభాషను నేర్వగలిగే ప్రావీణ్యం రామమూర్తిగారికి వుంది కాబట్టే అతను వ్యావహారిక భాషావాదంలో నెగ్గగలిగాడు.** వెల్షమన్ సవర నాలుగవ వాచకంలో రెండు పాఠాలు రాశాడు. ఇవి బ్రిటిష్ ప్రభుత్వ అధికారికీ సవరలకు మధ్య జరిగిన సంభాషణల రూపంలో వున్నాయి. ఈ సంభాషణలు చదివితే బ్రిటిష్ ఆఫీసర్లు సవరలతో ఎంత సన్నిహితంగా వుండేవారో అర్థం అవుతుంది.

వెల్షమన్ అంటే రామమూర్తిగారికి ఎనలేని వాత్సల్యం. ఎందుకు? వెల్షమన్ సవరల అభివృద్ధికి కృషి చేశాడు గనుక. 1929 లో సెరంగోలో సవరభాష బోధనకు ఒక విద్యాసంస్థను అప్పటి మద్రాసు ప్రభుత్వం స్థాపించిన సందర్భంగా ఆ సంస్థకు రామమూర్తిగారి పేరు పెట్టడం ఉచితమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వార్త రామమూర్తిగారి చెవిని పడింది. అప్పుడు తన పేరు వద్దని వారించి తన శిష్యుడు వెల్షమన్ పేరు ప్రతిపాదించారు రామమూర్తిగారు. వెల్షమన్ మొదటి ప్రపంచ యుద్ధంలో 1914 లో మరణించాడు.

పర్లాకిమిడికి 40 కిలోమీటర్ల దూరంలో కొండలపై 2500 అడుగుల ఎత్తున గిరిజన గ్రామం సెరంగో ఉంది. సెరంగోలోని సవర బాప్టిస్ట్ క్రిష్టియన్ మండలి సమ్మిలోన్‌లో పనిచేస్తున్న మిస్. మన్రో రామమూర్తిగారి వద్ద 1928లో సవరభాష నేర్చుకొంది. ఆమె అరణ్యాలకే పరిమితమైన సవరలకు బాహ్య ప్రపంచాన్ని చూపించారు. వారితో స్నేహం చేశారు. వారికి విద్య నేర్పేరు. రామమూర్తిగారు అప్పుడప్పుడు సెరంగో వెళ్తుండేవారు. బెతానీ బంగళాలో బసచేస్తుండేవారు. తన శిష్యురాలంటే రామమూర్తిగారికి గొప్ప అభిమానం. మిస్ మన్రో తన సవరభాషా జ్ఞానాన్ని తనతో పనిచేస్తున్నవారికి అందజేయగలదని రామమూర్తిగారి విశ్వాసం. అందుకే “మలేరియా దోమలతో నిండిన కొండలలో ఆదివాసీలైన సవరలకు అలుపెరుగని ఉత్సాహంతో సేవచేస్తున్న క్రైస్తవ మహిళ, నా స్నేహితురాలు మిస్ ఎ.సి.మెక్ మన్రోకు” అంటూ రామమూర్తి గారు తాను రాసిన సవర మాన్యుయల్‌ని అంకితం ఇచ్చారు...

సెరంగోలో నేటికీ సవర బాప్టిస్టు క్రిస్టియన్ మండలి సమ్మిలోన్ వుంది. వారు క్రైస్తవ మత గ్రంథాలను సవర భాషలో రాయడానికి రోమన్ లిపినే (ఇంగ్లీష్) వాడుతున్నారు.

రోమన్ లిపిలో రాసిన సవర బైబిల్ ఉంది. పర్లాకిమిడి నుండి సెరంగో వెళ్ళే మార్గంలో రోమన్ లిపిలో రాసిన సవర బోర్డులు కనిపిస్తాయి. గిడుగు వారిని అక్కడ అమరులుగా చూడవచ్చు. బెతాని బంగ్లా (మిస్. మన్రో నివసించిన బంగ్లా) తోటలో “GIJ GIJ BA DO MOTHNABABINDO TARBAN ARUR DONG”. (చూసి ఆనందించండి కాని పువ్వులు తెంపొద్దు) అని సవరభాషలో రాసిన బోర్డు వుండేది. ( ప్రస్తుతం పాత బంగ్లాని పడగొట్టి కొత్త బంగ్లా కడుతున్నారు.)

**రామమూర్తిగారు ధనంకోసం గాని పేరు ప్రఖ్యాతులకోసం గాని పనిచెయ్యలేదు. “మీరు సంపాదించిన విషయాన్ని మీ దగ్గరనుండి తీసుకెళ్ళిన మీ ప్రియ శిష్యుడు తన పేర ప్రచురించుకొంటున్నాడు” అని ఒక శిష్యుడు రామమూర్తి గారితో అంటే ఆయన “ ఒరే అబ్బాయ్! మనం రాస్తున్న అక్షరాలు ఎవరు కనిపెట్టారో తెలుసా? ఎవరు రాశారో అన్నది ముఖ్యం కాదు. అది ప్రజలకు చేరిందా? లేదా? అన్నది ముఖ్యం” అన్నారు.**

1911–1914 మధ్యకాలంలో సవర సాంగ్స్, సవర తెలుగు నిఘంటువు, నాలుగు సవర రీడరులు వెలువడ్డాయి. వీటిని మద్రాసు ప్రభుత్వం ప్రచురించింది. ఇవి తెలుగు లిపిలో ఉన్నాయి. ఈ పుస్తకాలు నీవు రచించినందుకు నీకేమి ప్రతిఫలం కావలెనని ప్రభుత్వమువారు అడిగితే “చదువు రాక, లోకజ్ఞానం లేక అడవి మృగాలవలె కొండలమీద తిరుగుతున్న సవరలకోసం నా సొంత డబ్బుతో, కొద్దిపాటి గవర్నమెంటు గ్రాంటుతో నాకు అందుబాటులో ఉన్న గ్రామాలలో పాఠశాలలు నడుపుతున్నాను. వారి అభివృద్ధికి ప్రభుత్వమువారు కొండల మీదనే పాఠశాలలు నడిపి విద్యాభివృద్ధికి సాయపడండి” అని తెలియజేశారు. **రామమూర్తిగారిని గౌరవించడం తమ విధి అని ప్రభుత్వమువారు 1911 లో జార్జి చక్రవర్తి పట్టాభిషేక సంబంధమైన ఉత్సవం జరిగినప్పుడు సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్‌ను, తరవాత 1913 జనవరి ఒకటవ తేదీని రావుసాహెబ్ బిరుదును ఇచ్చారు.**

రామమూర్తి గారి వ్యక్తిత్వం, నిస్వార్థ సేవాభావం మానవతా

దృష్టి గురించి 1913 సెప్టెంబర్ 15 నాటి దర్బారు ప్రసంగ పాఠంలో గంజాం కలక్టర్ మెక్ మైకేల్ ఇలా వివరించారు.

"With singleness of purpose and without thought of reward Mr. Ramamurti has worked and laboured in the spirit of philanthrophy for the betterment of Savaras....

With his own money and unassisted by any, he opened a pure Savara school.. His labours have seemed so valuable that the Government undertook to print his Savara works at their own cost and offered an honororium to the learned author that he declined the latter on the ground that his work was a labour of love, and not done for payment is typical of his great humanity."

1903లో వైస్రాయి కర్జన్ , విశ్వవిద్యాలయాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఇంగ్లీషులో తాము సంపాదించిన విజ్ఞానాన్ని దేశ ప్రజలకు అందజేయాలని భావించారు. విద్యావ్యాప్తికి దోహదపడే సూచనలు చేయవలసినదిగా ప్రభుత్వం విద్యావేత్తలను కోరింది. అందుకోసం ఒక కమిటీ వేశారు. వైస్రాయి కర్జన్ ఆదేశానుసారంగా దేశమంతటా విద్యావ్యాప్తికి సంబంధించిన ఒక నివేదికను ప్రభుత్వం 1905 లో ప్రకటించింది. దేశంలో అక్షరాస్యులు పది శాతమే అనీ, ఆధునిక విద్యలు అభ్యసించిన యువకులు తమ మాతృభాషలు నేర్చుకోవడంలో శ్రద్ధ చూపడం లేదనీ, ఆంగ్లభాష ద్వారా నేర్చుకొన్న శాస్త్రాలను పట్టభద్రులు కూడ మాతృభాషలోనికి అనువదించలేకపోతున్నారు అనీ ఆ నివేదిక పేర్కొంది. అందుచేత విద్యాశాఖవారు విద్యార్థులకు మాతృభాషలోకి అనువాదాన్నీ, మాతృభాషలో వ్యాసరచననూ నిర్బంధంగా నేర్పవలసివచ్చింది.

1911తరవాత విద్యావిధానంలో ఒక మార్పు వచ్చింది. మెట్రిక్ (S.S.L.C. (స్కూలు ఫైనల్ ) వచ్చింది. స్కూలు ఫైనల్ స్థాయిలోను, ఇంటర్మీడియట్ స్థాయిలోను విద్యార్థులు మాతృభాషలో వ్యాసరచన చేయడం, మాతృభాషలోకి అనువాదం చేయడం నిర్బంధ పాఠ్యాంశంగా విద్యాశాఖ ప్రవేశ పెట్టింది. స్కూలు ఫైనల్ విద్యార్థులు వ్యావహారిక భాషలో గాని గ్రాంథిక భాషలో గాని పరీక్ష రాసుకోవచ్చు అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డువారు ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

**1906లో ఏట్సుదొరతో పరిచయం అయినంత వరకు పాఠశాలలో తెలుగు భాషాబోధన గురించి రామమూర్తిగారికి తెలియదు. "విద్యావంతులు ఉన్నత వర్గాలవారు మాట్లాడుతున్న భాషను విద్యాబోధనకు ఉపయోగించవచ్చు కదా'' అని ఏట్సుదొరగారు రామమూర్తిగారిని అడిగారు ఈ మాటలు ఆయన హృదయాన్ని తాకాయి. నాటినుండి రామమూర్తిగారు భాషాశాస్త్ర అధ్యయనం ప్రారంభించారు.**

**విద్యావంతులు తాము నేర్చుకొన్న జ్ఞానాన్ని ప్రజలకు అందివ్వాలంటే వారికి అర్థమయే భాషలోనే రచనలు చెయ్యాలి. అప్పుడే కర్జన్ ఆశయం నెరవేరుతుంది. అనువాదానికీ, వ్యాసరచనకూ వాడే తెలుగు భాష ప్రాచీన కావ్యాలలో కనిపించే గ్రాంథిక భాషై వుండాలని నిర్బంధిస్తే కోరుకొనే ప్రయోజనం నెరవేరదని రామమూర్తిగారు స్పష్టంగా తెలియజేశారు.**

తెలుగులో వ్యావహారిక భాషోద్యమం రావడానికి కాంపోజిషన్ కమిటీ సిఫారసులే మూల కారణం. ఈ కమిటీలో గ్రాంథిక భాషావాదులూ, వ్యావహారిక భాషావాదులూ ఉన్నారు. ఎవరి వాదనలు వారు వినిపించారు. భాషా పండితులే తప్పులు లేకుండా గ్రాంథిక భాషలో రాయలేనప్పుడు విద్యార్థులు గ్రాంథిక భాషలో పరీక్షలు ఎలా రాయగలరని రామమూర్తిగారు ప్రశ్నించారు. దీనికి సమాధానం ఇవ్వకుండా మద్రాసు ప్రభుత్వం వ్యావహారిక భాషకు గుర్తింపు రద్దు చేసింది.

1919లో ఆయన తెలుగు అనే మాసపత్రికను ప్రారంభిస్తూ "మనం సామాన్య ప్రజలనుద్ధరించాలి అని యోచిస్తున్నాం. మంచి సాహిత్యం కోసం మన పిల్లలు అర్రులు చాస్తున్నారు. స్వచ్ఛంగా ఆలోచింపజేయగల పుస్తకాల కోసం మన స్త్రీలు ఉవ్విళ్ళూరుతున్నారు. నిర్భాగ్యులై కష్టాలలో వున్న వారి జీవితాలలో వెలుగు నింపడానికి ఈ భాషా సంస్కరణ సరైన మార్గం కాదా? మధురమైన మన వ్యావహారిక భాష ప్రజల వద్దకు మన సందేశాన్ని చేర్చే వాహనం కాదా?" అనడం ద్వారా రామమూర్తిగారి సంఘశ్రేయోభిలాష వ్యక్తం అవుతుంది. పేదవాళ్ళనీ, పిల్లల్నీ, స్త్రీలనీ విజ్ఞానవంతులను చెయ్యాలంటే వారికి అర్థం అయే భాషలోనే రాయాలన్నది రామమూర్తిగారి అభిప్రాయం. అందుకే ఆయన వ్యావహారిక భాషావాది అయ్యారు. విద్య ప్రజాపరం కావాలన్నది వారి అభిమతం. "సంఘంలో నిరక్షర కుక్షులు ఎక్కువగా వున్నంతకాలం సంఘం వృద్ధిలోకి రాదు. ప్రజలలో విద్య వ్యాపిస్తేగాని సంఘం వృద్ధిలోకి రాదు" అంటూ 1940 జనవరి 15వ తేదీని ప్రజామిత్ర పత్రిక కార్యాలయంలో రామమూర్తిగారు తమ తుది సందేశం వినిపించారు.

రామమూర్తిగారు శాస్త్రవేత్త. హేతువాది. మూఢాచారాలను పాటించని మేరునగ ధీరుడు. అయినా సంప్రదాయాలను విడిచి పెట్టలేదు. ఆయన ఒక్క రోజు కూడ సంధ్యావందనం మానలేదు. ప్రతి సంవత్సరం తల్లి దండ్రులకు ఆబ్దికాలు పెట్టేవారు. ఆయనెప్పుడూ దేవాలయాలకు పోయిన దాఖలాలు లేవు. కాని పుట్టిన రోజు మాత్రం తనతో వేంకటేశ్వరస్వామి గుడికి వచ్చేవారని రామమూర్తిగారి భార్య అన్నపూర్ణమ్మగారు అంటుండేవారు. ఈ విషయాన్ని గిడుగు రామకృష్ణారావుగారు (రామమూర్తిగారి మునిమనుమడు) ఇద్దరూ ఇద్దరే - గిడుగు పిడుగులు - కళా ప్రపూర్ణులు' అన్న పుస్తకంలో రాశారు.

ఇంటర్మీడియట్ క్లాసులో తాపీ ధర్మారావుగారికీ రామమూర్తిగారికీ ఒక విషయంలో ఘర్షణ జరిగింది. రామమూర్తి గారు క్లాసులో తాపీ ధర్మారావు మొఖం చూసి "బొట్టు పెట్టుకొని రాలేదేం" అని అడిగారు. ధర్మారావు తాను శూద్రుడునని చెప్పారు. "అయితే ఏం?

శూద్రులు బొట్టు పెట్టుకోకూడదా? అన్నారు. **రామమూర్తిగారికి కులాల మతాల పట్టింపులు లేవు. అతని జీవితంలో వాటికి ప్రాముఖ్యత లేదు. సవరలది ఏ కులం? ఏ మతం? రామమూర్తి గారు తాను కుల మతాలకు అతీతుడనని ఎవరితోనూ చెప్పలేదు. ప్రచారం చేసుకోలేదు.**

రామమూర్తిగారికి జ్యోతిష్యం మీద అసలు నమ్మకం లేదు, సీతాపతిగారికి 1900 సంవత్సరంలో 16 వ ఏట జాతకాలు చూడకుండా వివాహం జరిపించారు. వివాహమైన 16 వ రోజున సీతాపతిగారి భార్య విషజ్వరమొచ్చి చనిపోయింది. రామమూర్తిగారి స్నేహితుడైన మామిడన్నం కుమారస్వామిగారు వివాహానికి ముందు సీతాపతిగారి జాతకం తనకు చూపించి వుంటే బాగుండేది అన్నారట. రామమూర్తిగారు సీతాపతిగారి జాతకం ఇచ్చి "ఇప్పుడు చెప్పు! సీతాపతి జాతకంలో ద్వితీయ కళత్ర యోగం వుందేమో" అన్నారట. కుమారస్వామిగారు జాతకం చూసి ''ఉంది'' అన్నారట. ''అలాంటప్పుడు ఈ దుర్ఘటన ఎలా తప్పుతుంది.'' అని రామమూర్తిగారు అన్నారట. ఈ విషయం గూడ 'ఇద్దరూ ఇద్దరే-గిడుగు పిడుగులు-కళా ప్రపూర్ణులు' అన్న పుస్తకంలో వుంది.

**రామమూర్తిగారు సమాజంలోని మిథ్యా ప్రమాణాలను నిరసించారు. భర్త మరణించిన స్త్రీలు మళ్ళీ పెళ్ళి చేసుకోవడం శాస్త్ర సమ్మతమేనని నిరూపించిన బంకుపల్లి మల్లయ్య శాస్త్రిగారి కుమార్తె పునర్వివాహానికి రామమూర్తిగారు కన్యాదాతగా వ్యవహరించారు.** 1908 లో గౌతమి కోకిల, వేదుల సత్యనారాయణ గారితో వివాహం జరిగింది. కులంవాళ్ళు వారిని వెలివేశారు.

రామమూర్తిగారు చలించలేదు. కొన్నాళ్ళకు వాళ్ళే దిగివచ్చారు. ఈ సంఘటనతో సనాతన వాదుల పునాదులు కదిలిపోయాయి.

1908 లో రామమూర్తిగారి శిష్యుడు కన్నేపల్లి వెంకట నరసింహంగారు ఇంగ్లండులో బారిస్టర్ పట్టా పుచ్చుకొని వచ్చారు. వారి గౌరవార్థం రామమూర్తిగారు విందు చేశారు. సముద్ర ప్రయాణం చేసినవారు తిరిగి వచ్చాక ప్రాయశ్చిత్తం చేసుకొని శుద్ధికావాలి. నరసింహం గారు ప్రాయశ్చిత్తం చేసుకోలేదు. నరసింహంగారితో సహపంక్తిలో భోజనం చేసినందుకు కులంవాళ్ళు రామమూర్తి గారిని వెలివేశారు. వెలి ఎత్తివేయాలంటే కాశీ తీర్థం పుచ్చుకొని వన సంతర్పణ చెయ్యాలన్నారు. రామమూర్తిగారు అంగీకరించలేదు. కొన్నాళ్ళకు రామమూర్తిగారి మీద వెలి అదే తొలిగి పోయింది.

**గిడుగు రామమూర్తిగారు తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడే మనిషి. అతనిది రాజీలేని ధోరణి. అయితే అతని నమ్మకాలు మూఢవిశ్వాసాలు కావు. అనుభవపూర్వకంగా, ప్రయోగాలద్వారా తెలుసుకున్న సత్యాలు. వారు తాను తెలుసుకొన్న పద్ధతులు ప్రజోపయోగం కోసం వినియోగించాలనే తపనగలవారు. సిద్ధాంతాల విషయంలో అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు ఎంతటివారినైనా ఎదిరిస్తారు, ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతారు.** అందుచేతనే విజయనగరం మహారాజావారి కొలువులో ఇమడలేక ఉద్యోగం పోగొట్టుకున్నారు. గిడుగు రామమూర్తిగారి జీవితంలో ఇది ఒక ముఖ్యమైన సంఘటన. దీని గురించి 29 ఆగస్టు 1963 నాడు హైదరాబాదు నగరములో జరిగిన సాహిత్యోపన్యాసాలలో జి. వి. సీతాపతిగారు ఈ విధంగా చెప్పారు.

"1919 జనవరి లో మా తండ్రిగారి జీవితంలో ఒక సంఘటన తలవని తలంపుగా ఒక మార్పు కలిగించినది. విజయనగరం మహారాజావారి రెండవ కుమారునికి (సర్ విజ్జి), కుమారికి, ట్యూటర్ పదవి వారికి లభించినది. ఆ దినములలో నా కడపటి తమ్ముడు సూర్యనాయణ 11 ఏండ్లవాడు తరుచుగా మా తండ్రిగారితో కలిసి కోటలోకి వెళ్ళి మా తండ్రిగారు పిల్లలకు పాఠములు చేస్తూవుంటే వారికి దగ్గరగా కూర్చుంటూ వుండేవాడు. అప్పటికి వాడు ఇంగ్లీషులో చిన్న చిన్న ప్రసంగాలు చేయగలుగుతూ ఉండేవాడు. అతనిని గూడ తన పిల్లల వలె రాణీగారు ఆదరించేవారు. (కారణం అతని ఇంగ్లీషు ప్రసంగాలు, ఇంగ్లీషు ఉచ్చారణ.) ఆ అబ్బాయిని రాణీగారు చేరదీయడము, మా తండ్రిగారిని ఎక్కువగా ఆదరిస్తూ ఉండడమూ చూచి కొందరు ఓర్వలేక పోయినారు. ఆమెకు మాతండ్రిగారి మీద కోపము కలిగించడానికి తగిన సమయము కోసము ఎదురుచూస్తూ ఉండేవారు. రాజావారు అప్పుడప్పుడూ రాత్రులందు కోటలో సంగీత కచేరీలు సమావేశపరుస్తూ వుండేవారు. ఆ కచేరీలకు నలుగురుతో పాటు మా తండ్రిగారిని కూడ ఆహ్వానిస్తూ వుండేవారు. వీరు ఏదో సాకు చెప్పి తప్పించుకుంటూ వుండేవారు. ఒకసారి వెళ్ళక తప్పినది కాదు. సభాసదులందరును నేలపై పరచిన తివాసీలపై కూర్చున్న తరువాత రాజావారు వేంచేసి ఒక సోఫాలో కూర్చున్నారు. వారితో వచ్చిన వేశ్య వారి పక్కన సోఫాలో కూర్చున్నది. మా తండ్రిగారు ముప్పదేండ్ల నుండి సాని మేళాలు చూడరాదన్న దీక్ష వహించినవారు. కనుక ఈ దృశ్యము చూసి అక్కడ కూర్చుండుటకు ఇష్టముకాక అప్పారావుగారి వైపు తిరిగి నేను వెడలిపోతానన్నట్లు అభినయించినారు. అప్పారావుగారు వారి ఉద్దేశము తెలుసుకొని ఒక్క క్షణము ఆగు, నేనుగూడ వస్తాను. ఇద్దరము కలిసే వెళ్తామన్నట్లు అభినయముతో తెలియజేసి, నిలువబడి "మహారాజా మొన్న తమరు సెలవిచ్చిన రాచ కార్యము ఇప్పుడు చేయవలసి వచ్చినది. ఆవిషయములో గిడుగు రామమూర్తి కూడ తోడ్పడవలసి ఉన్నది. కనుక మా ఇద్దరికీ ఏలినవారు అనుజ్ఞ దయచేసిన ఎడల మేము వెళ్తున్నాము అన్నారు. "సరే " అన్నారు మహారాజావారు. ఆ మర్నాడే నేను విజయనగరము వెళ్ళినప్పుడు మా తండ్రిగారు ఈ ముచ్చట చెప్తూ "రాజుల తృప్తి కోసము ఇటువంటి అబద్ధాలు ఆడవలసి వచ్చిందిరా" అన్నారు.

రాత్రి జరిగిన సంఘటననాధారము చేసుకొని కొందరు "రామమూర్తి పంతులు చాలా గర్వము కలవాడు. రాజులను లక్ష్యపెట్టడు." అని రాణీగారితో చాడీలు చెప్పారు. ఈ సంఘటన రాణీగారికి ఇదివరకే తెలిసింది. ''మంచి చెడ్డలు తెలిసిన విద్వాంసులు ఆ దృశ్యమును చూచి సహించలేరు. మంచి పని

చేసినారు" అని రాణీగారు మా తండ్రిగారిని మెచ్చుకొన్నారు. . ,

కొందరు అసూయాపరులు వీరు ఇంగ్లీషు చెప్పుటకు అవలంబించిన పద్ధతి (ప్రత్యక్ష పద్ధతి) మంచిది కాదని పెద్దలుచేత చెప్పించారు. (ప్రత్యక్ష పద్ధతిలో తరగతి గదిలో ఇంగ్లీషు భాషావాతావరణం కల్పించాలి. మాతృభాష మాట్లాడ కూడదు. చిన్న పిల్లలు సహజమైన రీతిలో వినికిడి ద్వారా మాతృభాష నేర్చుకొంటారు. పరభాష నేర్చుకోవాలంటే ముందుగా ఆ భాష వినాలి. తరవాత ఆ భాషలో పలకాలి. ఈ పద్ధతి ద్వారా ప్రామాణిక భాష, ప్రామాణిక ఉచ్చారణ విద్యార్థులకు అలవడుతుంది. విద్యార్థులు ఇంటివద్ద అభ్యాసం చేసుకోవడానికి భాషను రాసుకోవలసిన అవసరం వుంది. అందుకోసం ఫొనెటిక్ (స్క్రిప్టు నేర్చుకోవాలి) వారు చెప్పిన మాటల్లో ఫొనెటిక్ స్క్రిప్టు ద్వారా ఇంగ్లీషు మాటలు నేర్పుట వలన పిల్లలు పెద్దవారైనప్పుడు ఎటిమలాజికల్ స్పెలింగ్ లోపాలు వారికి తప్పవన్న విషయము మాత్రము ఆమెకు నచ్చింది. మామూలు పద్ధతుల ననుసరించి రామమూర్తిగారు ఎందుకు ఇంగ్లీషు బోధించరాదో తెలిసికొని తమకు నివేదిక పంపవలసిందిగా రాణీగారు అప్పారావుగారిని కోరారు. ఆ విషయము అప్పారావుగారు రామమూర్తిగారికి తెలియజేశారు. "నేనవలంబించిన పద్ధతి శ్రేష్ఠమయినది; ఈ పద్ధతుల ననుసరించే మేము మా చిట్టిబాబుకు (సూర్యనారాయణ), తక్కిన పిల్లలకు ఇంగ్లీషు నేర్పినాము. కనుక ఎవరేమి చెప్పినాసరే నేను పాత పద్ధతులలో చెప్పను" అని రామమూర్తిగారు స్పష్టముగా తెలియజేశారు. రాణీగారికి కోపము వచ్చింది. "వారు పాత పద్ధతులలో చెప్పవలెనని నా యాజ్ఞ; అది పాటించకపోతే ఈ మాసమునుండి వారి ఉద్యోగము మాకక్కరలేదు" అని రాణీగారు 21 వ తేదీని తెలియజేశారు. అది విని "అంతవరకూ వేచిఉండనక్కర లేదు; నేనీనాడే పని విడిచి పెట్టుకొంటున్నాను." అని మా తండ్రిగారు తెలియజేశారు.

రామమూర్తిగారు విజయనగరం రాజావారి పిల్లలకు ఆధునికమైన ప్రత్యక్ష పద్ధతిలో ఇంగ్లీషు నేర్పడానికి ప్రయత్నించారు. మనకంటే రామమూర్తిగారు ఎంతో ముందున్నారు. ఈనాటికీ మనం అతనిని అందుకోలేకపోతున్నాం.

**అమెరికాలోని హవాయీ విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రంలో ప్రొఫెసర్‌గా వున్న స్టాన్లీ స్టరోస్టా సవర భాషమీద పరిశోధన చేసి 1967 లో డాక్టరేటు పట్టా పొందారు. స్టరోస్టా తన సిద్ధాంత గ్రంథాన్ని రామమూర్తిగారికి అంకితం ఇస్తూ, గురువు, మానవతావాది, ముండా లింగ్విస్టిక్స్‌లో మొట్టమొదటి పరిశోధకుడు అని శ్లాఘించాడు.**

తెలుగువారు రామమూర్తిగారిని వ్యావహారిక భాషావాదిగానే చూస్తున్నారు గాని ఆయన అంతరంగాన్ని చూడలేకపోయారు. స్టరోస్టా అన్నట్టు రామమూర్తిగారు గురువు. సవరలకు వారి భాషలోనే విద్య నేర్పాలని వాచకాలు నిఘంటువులు రాసి, సొంత డబ్బుతో సవర పాఠశాలలు నడిపిన మానవతావాది. పేదవాళ్ళనీ, పిల్లలనీ, స్త్రీలనీ విద్యావంతులను చెయ్యాలంటే వారికి అర్థం అయే భాషలోనే రాయాలన్నది రామమూర్తిగారి అభిప్రాయం. అందుకే ఆయన వ్యావహారిక భాషావాది అయ్యారు. తెలుగు యువరచయితలకు వెన్నుదన్నుగా బాలకవి శరణ్యం రచించారు. వ్యావహారిక భాషలో రాయడాన్ని అడ్డుకొంటున్న పండిత భిషక్కుల భాషాభేషజాన్ని బట్టబయలు చేశారు. వచన రచనా మార్గంలో పండితులు వేసిన ముళ్ళ కంపలను తొలిగించి మార్గాన్ని సుగమం చేశారు. గిడుగు రామమూర్తి విద్యను ప్రజాపరంచేసిన సమరయోధుడు.

రామమూర్తిగారు తాను హేతువాదినని ఎక్కడా చెప్పుకోలేదు. తాను మానవతావాదినని వేదికలెక్కి ఉపన్యాసాలివ్వలేదు. అతను మూర్తిభవించిన మానవత్వం.

**ఆంధ్రప్రదేశ్ గిరిజన విశ్వవిద్యాలయానికి గిడుగు రామమూర్తిగారి పేరు పెట్టడం ఉచితమని నా అభిప్రాయం. తన పేరు వద్దని వారించడానికి ఆయన మన మధ్య లేరు కదా. భయం లేదు.**

కవిత

## మట్టిదుఃఖం

మాటలతోనో..మతం ఆసరాతోనో
అపరాధాన్ని కప్పిపుచ్చుకుంటాడు
ఆయుధాలెన్ని అందిస్తున్నా
నినాదాల పూలెన్ని పూయిస్తున్నా
ఆకలిచావులంత సునాయాసంగా
చీకటి కనురెప్పల కొమ్మల్లోంచి
మృణ్మయాణువులకు
మించిపోతున్నాడు
పట్టుచిక్కని పిరికిపాటలా
అన్నవస్త్రాలు అందని
ఆకాశమౌతున్నాడు
అంటురోగ అనారోగ్యాల
అబద్ధపు వాగ్దానమౌతున్నాడు
అసంతృప్త సముద్రమై
విద్రోహాగ్నికి ఆజ్యమౌతున్నాడు
ప్రాణవాయువు వెలిసిపోతే
రెక్కల్లేని గాలిపాటవుతున్నాడు
చివరి చూపుకు చిక్కకుండా
ఛిద్రమయే కన్నీటి చప్పుడవుతున్నాడు
భూమిదుఃఖాన్ని ఉప్పెనచేసి
విశాలఛత్రాన్ని చీలికలు చేసి
మరో గ్రహాన్ని వెదుక్కుంటున్నాడు

జనాభా పెరుగుదలను చూస్తూ...

– డా. సి. భవానీదేవి
9866847000

ఆచార్య పరిమి రామనరసింహం
9849316730



# గిడుగు అవసరం మనకు ఇప్పటికీ ఉందా?

**అచ్చు** యంత్రం వచ్చేదాకా ఏ భాష అయినా 'వ్రాతరూపు'లో తక్కువ వ్యాప్తి కలిగి ఉంటుంది. అదే విధంగా తెలుగు కూడా. జీవద్భాషగా దాని వ్యాప్తి సమాజం అంతటా ఉంటుంది. అయితే ఎంత కాలం అయినా భాష ఒకే విధంగా ఉంటుందా అనేది ఆసక్తి కరమైన ప్రశ్న. మన అందరికీ కొద్ది పరిశీలనతోనే తెలివిడిలోకి రాగల అంశం ఒకటి ఉంది: మనం మామూలు వాడుకలో మాట్లాడుతున్నప్పుడు వాక్యాల పొందిక సరిగా ఉండదు; పునరుక్తి కూడా కొంచెం ఎక్కువగా ఉంటుంది. అదే రాసినప్పుడు తేడా ఉంటుంది. వాక్యాలు పొందికగా ఉంటై; పునరుక్తులు ఉండవు. రాయటం అనేది ఒక అలవాటు. ఎంత చదువుకున్నా రాయటానికి కూడా అలవాటు పడాలి. మనం మాట్లాడే భాషే కదా! రాయలేమా? అనుకో కూడదు. అందువల్లనే భాషాబోధనలో వ్యాస రచనను ఒక అభ్యాసంగా నేర్పుతాం.

**రాసే భాష ఎట్లా ఉండాలి అనే విషయంలో, శిష్ట వ్యవహార భాషలో రాయాలి అని గిడుగు చెప్పారు. తర్వాతి కాలంలో దీనిమీద ప్రజలను శిష్టులు – అశిష్టులు అని విభజిస్తారా? అంటూ ఒక దుమారం లేపారు కొందరు సామాజిక స్పృహ మాకే ఎక్కువ ఉంది అని భావించేవారు. ఇక్కడ శిష్టులు అంటే చదువుకున్నవారు అనే అర్థం. చదువుకున్నవారే కదా రాయగలిగేది!**

అన్ని భాషలలోనూ శిష్ట వ్యావహారికమే రాస్తారు. హిందీ పుస్తకాలలో ఉండే 'హిందీ' ఎవరూ మాట్లాడరు – చదువుకున్నవారు తప్ప. తమిళం అంతే, కన్నడం అంతే. మాట్లాడే భాష రాయాలి అంటే ఎవరు మాట్లాడేది? ఈ మధ్య ఇంటి భాష అని ఒక మాట పొడుచుకొచ్చింది. మంచి నినాదం! బడి చదువులో ఏ భాష వాడాలో చెప్పటానికి వాడిన మాట ఇది. అది ఎవరి ఇంటి భాష? ఎక్కడివారి ఇంటి భాష? కనుక, ఇంటి భాష అంటే ఫలానా వారి ఇంటి భాష అని కాదు; అతి సామాన్య వ్యక్తుల భాష అని. మరి, ఏ ప్రాంతపు సామాన్య వ్యక్తుల భాష? ఏ ప్రాంతానికి ఆ ప్రాంతమే తీసుకొని అక్కడి సామాన్యుల భాష అని గ్రహించాలి. అట్లాగే శిష్ట వ్యవహారం అనే మాటను కూడా పెద్ద గిరి గీసి (విస్తృతార్థంలో) చూడాలి. ఈ విధంగా ఇంటి భాష అంటే చాలా ప్రాంతాల సామాన్య వ్యక్తుల ఇంటి 'భాషలు' అని తెలుసుకోవాలి. ఇట్లా భాషలోని చాలా 'రకాలు' గుర్తించ వలసి వస్తుంది. దీన్ని గురించి తర్వాత ప్రస్తావిస్తాను.

మళ్ళీ గిడుగువారి దగ్గరికి వస్తే ఆయన ఏ భాషలో రాశారో చూడండి. *(ఈ వాక్యభాగాలు గిడుగు వేంకట రామమూర్తి రచనా సర్వస్వం–ఇకమీదట గిడుగు రచనా సర్వస్వం–లోనించి తీసుకున్నవి.)*

"…. నిర్మొగమాటముగా చెప్పుతాను." (పు.4); "… నేను నమ్మజాలను." (పు.4); "…… రూపములున్ను, అర్థములున్ను, …. అట్టే హిందూస్థానీ మాటలున్ను, ఇట్టివి అన్నీ …. తెలుగులో మారుతవి." (పు.312); "…..అనిన్ని ప్రయోగించినాడు." (పు.315); "…… కనబడుతున్నవి." (పు. 312); "… పుట్టినవి"(పు.87); "… అని అడుగుతాము. … ఇవి తెలుగులో సాధువు లయినవి. ….. తెలుగులో చట్టన దొరకనప్పుడు… కొందరికి స్ఫురించియుండును." (పు. 310); "…. శిష్టలోకమే దేశభాషపై అధికారము చలాయిస్తుంది." (310); "ఉపయోగపడుతుంది." (పు. 87); "కావ్యాలు కాంతా సమ్మితంగా ఉపదేశము చేస్తవని నిర్ధారణ చేసినారు." (పు. 87); "…అపభ్రంశములోనే పుట్టినవి." (పు. 87); "వస్తున్నవి" (పు. 87); వెళ్ళుతున్నారు (పు. 88); "…. అలాగే మన దేశంలోనూ కావలె. (పు. 88); "….. పుస్తకాలు వ్రాయవలె." (పు. 89); "…. కావలెనంటే…" (పు. 89).

ఆయన భూతకాల క్రియా రూపాలుగా చేసినారు, ప్రయోగించినాడు మొదలైన వాటిని వాడారు. ముగంత నామాలను సున్నతో కాకుండా రూపము, ఉపదేశము అని ముగంతాలుగానే వాడారు. నిశ్చయార్థకాలను కావలె, వ్రాయవలె అని వాడారు. భూత కాలిక అమహద్బహు వచన రూపాలుగా పుట్టినవి (= పుట్టినై/ పుట్టినాయి), అయినవి (= అయినై/అయినాయి) వంటివాటిని, వర్తమాన అమహద్బహు వచనంలో వస్తున్నవి (= వస్తున్నై) వంటివాటిని, భవిష్యత్కాల అమహద్బహు వచనంలో మారుతవి వంటి రూపాలను వాడారు. వీటిలో వస్తున్నవి, మారుతవి వంటి రూపాలు తప్ప తక్కినవన్నీ గ్రాంథికాలు కావా? చెలాయిస్తుంది, ఉపయోగపడుతుంది వంటి పూర్తి వ్యావహారిక రూపాలు కూడా ఉన్నై అనుకోండి. మరి వీటిలో గ్రాంథికాలు అంటున్నవి పూర్తిగా గ్రాంథికాలేనా? అవును; కాని, వ్యావహారికాలు కూడా. చేసినాడు, రాసినాడు వంటి రూపాలు ఉత్తరాంధ్రలో ఉన్నై, తెలంగాణాలో ఉన్నై, రాయలసీమలోనూ ఉన్నై. ముగంతాలు రాయలసీమలో ఉన్నై. ఇంతెందుకు? ఇవన్నీ ఆనాటి శిష్ట వ్యావహారంలో ఉన్నై. ఉన్నై కనుకనే ఆయన రాశారు. ఈ సందర్భంలో 'విన్నపము' అనే వ్యాసం (గిడుగు రచనా సర్వస్వం, పుటలు 42–53) మొదటి పుటలోని పాదసూచిలో ఆయన రాసినది గుర్తుచేసుకోటం అవసరం:

"ఈ వ్యాసము మేము సనాతన సత్సంప్రదాయాను సారముగా వాడుకలో నున్న తెలుగు భాషలో వ్రాసినాము. ఈ సంప్రదాయము అనేక గ్రంథములలో కనబడుతున్నది. …. ఇందులో మేము వాడిన శబ్దములు నూరేండ్లకు పైగా తెలుగువారిలో పెద్దలు వాడుతూనే ఉన్నారు."

వచనంలోనే కాకుండా కావ్యాలలోనూ ఈ భాషే వాడాలని కూడా

**గిడుగువారు మనకు అందించినది శిష్టుల రాతలలో ఉన్నది వాడుక భాష అని అర్థం అవుతున్నది. దీన్నే ఆయన శిష్ట వ్యావహారికం అన్నారు. దానిలో అన్ని ప్రాంతాలలోనూ వాడుకలో ఉన్న గ్రాంథిక రూపాలు కూడా ఉన్నై. మరి వాటిని ఆ తర్వాతి వ్యావహారిక భాషా వాదులు - గిడుగు అనుయాయులై ఉండి కూడా - ఎందుకు గ్రహించలేదు? ఏవో రెండు మూడు జిల్లాలలో వాడే రూపాలను ఎందుకు తెచ్చిపెట్టారు? గుంటూరు-కృష్ణా-గోదావరి భాషనే అందరి మీద రుద్దుతున్నా రనే చెడ్డ పేరు ఎందుకు తెచ్చిపెట్టారు? ఈ కారణంగానే ఇతర ప్రాంతాల వారు నేటి ప్రమాణ భాషను నిరాదరిస్తున్నారు.**

ఆయన కోరుకున్నారు. **"వ్యావహారిక భాష అంటే ఇప్పుడు శిష్టుల వ్యవహారంలో ఉన్న భాష. అది నేను ఉగ్గుబాలతో నేర్చుకున్న భాష. అది దేశి, జాను తెనుగు! అది మనది, మన భాష. ఆ భాషలోనే కావ్యాలు వ్రాయవలె."** (గిడుగు రచనా సర్వస్వం, పు. 89).

దీన్ని బట్టి గిడుగువారు మనకు అందించినది శిష్టుల రాతలలో ఉన్నది వాడుక భాష అని అర్థం అవుతున్నది. దీన్నే ఆయన శిష్ట వ్యావహారికం అన్నారు. దానిలో అన్ని ప్రాంతాలలోనూ వాడుకలో ఉన్న గ్రాంథిక రూపాలు కూడా ఉన్నై. మరి వాటిని ఆ తర్వాతి వ్యావహారిక భాషా వాదులు - గిడుగు అనుయాయులై ఉండి కూడా - ఎందుకు గ్రహించలేదు? ఏవో రెండు మూడు జిల్లాలలో వాడే రూపాలను ఎందుకు తెచ్చిపెట్టారు? గుంటూరు-కృష్ణా-గోదావరి భాషనే అందరి మీద రుద్దుతున్నా రనే చెడ్డ పేరు ఎందుకు తెచ్చిపెట్టారు? ఈ కారణంగానే ఇతర ప్రాంతాల వారు నేటి ప్రమాణ భాషను నిరాదరిస్తున్నారు.

దీనికి కారణం: **మనం గిడుగును సరిగా అర్థం చేసుకోలేదు. వ్యావహారిక భాషా వాదులు వ్యావహారిక భాష అంటే నోటికి వచ్చినట్లు రాయటం అనుకున్నారు. అట్లా రాయటాన్ని ప్రోత్సహించారు, స్వాగతించారు. 'నియమాలు' పెట్టేవారు దుర్మార్గులు, వ్యక్తి స్వేచ్ఛా విరోధులు అనే విధంగా ప్రచారం చేశారు. వ్యాకరణాల విషయంలో కూడా.**

సంప్రదాయం ఏమిటంటే- కావ్య భాషలో కూడా మార్పు వచ్చింది. అది పెద్దగా గుర్తించ దగిన మార్పు కాదు. కాని కావ్యేతర వాఙ్మయంలో (వ్యాఖ్యానాలు మొదలైనవి) పండితులు తాము కావ్యాలలో వాడే గ్రాంథిక భాష నుండి ఒక మెట్టు దిగి - అప్పటి తమ వ్యావహారిక భాషలోనే మాట్లాడుతూ - తమ గ్రాంథిక భాషా ప్రభావం, వాడుక భాష ప్రభావం కలగలిసిన 'శిష్ట వ్యావహారికం' అనదగిన భాష రూపొందటానికి కారకులయ్యారు. అటువంటి శిష్ట వ్యావహారికంలోనే వ్యాఖ్యానాలూ, దక్షిణాంధ్ర యుగంలోని యక్షగానాలూ వచ్చినై. శ్రీనాథుడు రచించిన శాసనాలలో గ్రామ సరిహద్దులు మొదలైనవి వాడుక భాషలో రాశాడని, కృష్ణదేవరాయలు వేయించిన శాసనాలు కూడా వాడుక భాషలోనే ఉన్నై అని గిడుగు వారు రాశారు (గిడుగు రచనా సర్వస్వం, పు. 6). అదే పరిస్థితి చిన్నయసూరి వచ్చేవరకూ కొనసాగింది. దీని గురించి బూదరాజు రాధాకృష్ణగారు ఇట్లా రాశారు: "1848లో పరవస్తు చిన్నయసూరి గారు 'ఉపయుక్త గ్రంథకరణ దేశభాషా సభ'కు అధ్యక్షు లయ్యేటంత వరకు పాఠ్యగ్రంథాల్లో వ్యాకరణ రచనల్లో ఆ నాటి శిష్ట వ్యావహారికమే వాడుకలో ఉండేది. ఆయన 1853లో 'నీతిచంద్రిక'ను, 1855లో 'బాలవ్యాకరణము' రచించి రాజధాని కళాశాలలో ప్రధానాంధ్రాధ్యాపకు లయిన తరవాత పరిస్థితులు తలక్రిందుగా మారేయి." (రాధాకృష్ణ, బూదరాజు 1979: 272-273) ఈ విధంగా చిన్నయసూరి వచ్చిన తర్వాత పండిత లోకంలో చూపు మారింది. 'సలక్షణమైన' భాషలోనే రాయాలని వాదించారు. ఏం రాసినా 'గ్రాంథికం' లోనే అన్నంత వీరవాదం అందుకున్నారు. మాండలికాలు, ఆయా సామాజిక వర్గాల భాషలోని పదాలు గ్రామ్యం అన్నట్లుగా తిరస్కరించారు. నిజానికి వ్యాకరణాలు మాండలికాలను తిరస్కరించినయ్యా? దేన్ని గ్రామ్యం అన్నై? అని చూస్తే వారి వాదానికి ఊతం దొరకదు. 'మాండలికం' అనే మాట వ్యాకరణ పరిభాషలో లేదు. కాని "త్రిలింగ దేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు" (బాలవ్యాకరణము, సంజ్ఞా. 21) అని చెప్పి అన్ని ప్రాంతాలలో వాడే పలుకుబళ్ళ లోని 'సిద్ధ' రూపాలను దేశ్యంగా పరిగణించి - మాండలికం అనే మాట వాడకుండానే - కావ్య భాషలో చోటు కల్పించినై. కాకపోతే 'లక్షణ' విరుద్ధ రూపాలను మాత్రం గ్రామ్యం అన్నై. కావ్యాలలో వాడ వద్దన్నై. కాని కావ్యేతర వాఙ్మయంలో వాడకూడదని ఏ వ్యాకరణమూ చెప్పలేదు. గ్రాంథిక భాషా వాదులు దీన్ని అర్థం చేసుకోలేదు.

అసలు 'శిష్ట' వ్యావహారికం ఎట్లా రూపొందిందో ఇట్లా ఊహించవచ్చు: మొదటి (6వ శతాబ్ది) శాసనాలలో నోటి మాటగా వాడుకలో ఉన్న భాషలో శాసనాలు వచ్చినై. ఈ శాసనాలు - కోరాడ మహాదేవశాస్త్రి గారు చెప్పినట్లుగా - "వ్యావహారిక భాషలో"నూ, "సంధి ఐచ్ఛికం" గానూ, "తత్సమ పదాలు విశేషంగా" ఉండని పద్ధతిలోనూ, "వాక్య రచన కూడా కొంత అసాధారణంగానూ, అనహజంగానూ" కనిపిస్తై. ఉదా. ఎరికల్ముత్తురాజు అనబడే ధనంజయుని కలమళ్ళ, ఎర్రగుడిపాడు శాసనాలు. (మహాదేవశాస్త్రి 19979: 208 వీటిలో కనిపించే రాత పద్ధతి రాయటం అలవాటు లేని వారి రాత పద్ధతి అని గ్రహించవచ్చు. "చిన్నచిన్న వాక్యాల్లో, పునరుక్తితో ఈ విధంగా చెప్పడం వ్యావహారిక భాషలోనే కాని కావ్య భాషలో ఒప్పదు." (మహాదేవశాస్త్రి 1979: 208) ఆ కాలంలోనో ఇంకా ముందు నించో కవులు ఏవేవో రాసే ఉంటారు. వారిమీద సంస్కృత భాషా ప్రభావం ఎంతో కొంత ఉండే ఉంటుంది. ఆ విధంగా నన్నయ శైలికి ముందు దశ అని చెప్పదగిన శైలిలో ఆ రచనలు ఉంటై. వాటి ప్రభావం శాసనాలు రాసేవారి మీద పడుతుంది. అందువల్లనే పైన పేర్కొన్న ధనంజయని తర్వాతి శాసనాలలో నన్నయనాటి కావ్య భాషకు దగ్గరి భాష కనిపిస్తుంది. అంటే అప్పటికది ఆ కాలం నాటి శిష్ట వ్యావహారికం అన్నమాట. దాని లక్షణం తత్సమ పదాలు ఎక్కువగా వాడటం, పొందిక గల వాక్యాలు అని చెప్పవచ్చు. తెలుగుకు చారిత్రక వ్యాకరణం రాసిన కోరాడ మహాదేవశాస్త్రి గారు కూడా "ప్రాఙ్నన్నయ యుగంలోనే కావ్యశైలి ఏర్పడింది. దాని కాధారాలు ఏడో శతాబ్దం నుంచి కనబడుతున్నాయి." (మహాదేవశాస్త్రి 1979: 209) అని రాశారు. ఈ విధంగా కావ్య వాఙ్మయానికి సమాంతరంగా శాసన వాఙ్మయం కొనసాగుతూ వచ్చింది. అందులో

**బడి చదువులో తొలి మెట్టుగా ఆయా ప్రాంతాల 'ఇంటి భాష'లను, మలి మెట్టుగా ఆయా ప్రాంతాలలోని మాండలికాలను, తుది మెట్టుగా ఆయా ప్రాంతాల లోని ప్రమాణ భాషను అంటే శిష్ట వ్యవహార భాషను, దానితోబాటుగా కావ్య భాషను వాడాలి.**

గ్రాంథికం, ఇందులో శిష్ట వ్యావహారికం చెల్లుబాటు అవుతూ వచ్చినై. దక్షిణాంధ్ర యుగం సాహిత్యంలో శిష్ట వ్యావహారికపు పాలు ఎక్కువై జనానికి మరింత దగ్గర అయింది. ఆ తరువాత భాష యొక్క వాడుక రంగాలు పెరిగినై. కావ్యాల ఊపు తగ్గి, వచన వాఙ్మయం పెంపొందింది. అచ్చు యంత్రం, పత్రికలు వచ్చేసరికి వ్యాయ వ్యాప్తిలో వేగం, విస్తృతి పెరిగినై. ఇప్పటి వరకు శిష్ట వ్యవహార భాష సముచిత స్థానంలో కొనసాగుతుండగా 1948 తర్వాత చిన్నయసూరి ప్రభావంతో పండితులు గ్రాంథిక వాదాన్ని ముందుకు తెచ్చారు. అది అట్లా సుమారు 60 ఏళ్ళు కొనసాగింది. అప్పుడు (1915 ప్రాంతాలలో) జరిగింది గిడుగు ప్రవేశం. ఆయన ఏ ప్రయోజనాన్ని ఆశించి ఉద్యమించారు అనేది ఈ కింది మాటలలో చూడవచ్చు.

"మేము ఉద్దేశించిన ప్రయోజనము: ఇంగ్లండులో ఇంగ్లీషు, ఫ్రాన్సులో ఫ్రెంచి ఎట్లున్నవో – అట్లే తెలుగు దేశములో పెద్దలు నోటను వాడే నేటి తెలుగు భాషకు సాధ్యమయినంత దగ్గరగా తెలుగువ్రాత తెచ్చి నోటిమాటా చేతివ్రాతా ఒకదాని కొకటి పోషకములుగా చేసి, రెండింటికీ సమముగా ప్రవృత్తి కలిగించి, వ్రాత సార్థకముగాను సులభముగాను చేసి, తెలుగువారు వ్రాసేదేకాక మాట్లాడేదికూడా (క్రీగీటు నాది.) సభ్యభాషే అనే గౌరవము దేశమునకు సంపాదించడము." (గిడుగు రచనా సర్వస్వం, పు.43)

ఇక్కడ "మాట్లాడేది కూడా సభ్యభాషే" అనే మాటలు జాగ్రత్తగా గమనించాలి. (దీనిలోని 'సభ్య' శబ్దానికి పెడర్థాలు తీయకూడదు.) పాఠ్య పుస్తకాలలోని రాతలు అర్థమయ్యే శిష్ట వ్యావహారికంలో ఉండి, బడి చదువుతో వాటి ప్రభావం వ్యక్తుల మీద ఏర్పడి, వారి మాటలో శిష్టత్వం కలగటాన్ని ఇక్కడ 'సభ్యత' అని చెప్పుకోవచ్చు.

దీన్ని సాధించటానికి ఆయన పెద్ద ఎత్తున ఉద్యమం జరిపారు. వ్యావహారిక భాషా వాదాన్ని ప్రభుత్వం ఒప్పుకునేలా చేశారు. గిడుగువారి ఉద్యమం గురించి, దాని ఫలితాలను గురించి గిడుగు తర్వాతి తరం భాషాశాస్త్రవేత్తలలో ఒకరైన గంటి జోగిసోమయాజిగారి మాటలలో చూద్దాం: "వీరు (గిడుగువారు) గొప్ప పండితులు. భాషాభిమానము గలిగి ఆత్మలాభమును గణింపక గొప్ప ప్రచారము సలిపిరి. వారి గ్రంథములను నవ్యసాహిత్య పరిషత్తువారు ప్రచురించిరి. భాషకు గొప్ప యుపకృతిని చేసిరి. **వీరి వాదము వలనను, ప్రయత్నము వలనను నేటి తెలుగున రెండు మార్పులు గలిగినవి. 1. పుస్తకములు వ్రాయువారికి పండితుల వలని భయమును, జంకుకొంకులును పోయినవి. నిర్భయముగా దోషము లుండు నేమో యను సంశయము వీడి గ్రంథములు వ్రాయుచున్నారు. ఇది గొప్ప విషయమనుట నిర్వివాదము. 2. గ్రంథకర్తలు ప్రామాణిక భావమును వీడి తల కొక రీతిని వ్రాయుచున్నారు. ఇది భాష కంత మంచి మార్పు గాదు. కాని ఇట్టి స్థితికి కేవలము రామమూర్తి పంతులుగారి సిద్ధాంతము మాత్రమే హేతువు గాదు. దేశము నందలి స్వాతంత్ర్య భావము, విప్లవ వాతావరణము గూడ సహకారు లయినవి."** (జోగిసోమయాజి, గంటి. 1968: 244) దానితో, రాసేవారికి ఆటవిడుపు ఏర్పడింది. ఎట్లా పడితే అట్లా రాయవచ్చు అనేవారు బయల్దేరారు.

పైన ఉట్టంకించిన 'గిడుగువారు ఉద్దేశించిన ప్రయోజనం'లోని "నోటి మాటా చేతి వ్రాతా ఒకదానికొకటి పోషకముగా" ఉండటం అనే మాటలను కొంచెం ఆలోచించి చూస్తే ఇట్లా అనిపిస్తుంది: నోటి మాట అంటే అన్ని రకాల మాండలికాలతో కూడిన వాడుక భాష. చేతి వ్రాత అంటే అన్ని విధాలయిన రాతలతో కూడిన వాఙ్మయ భాష. వాఙ్మయ భాషలో కాలానుగుణమైన మార్పులు రావటానికి వాడుక భాష తోడ్పడుతుంది. వాడుక భాషలో (వ్యవహర్తలకు విద్య కారణంగా వాఙ్మయ భాషతో పరిచయం పెరిగి) వైవిధ్యం పెచ్చుపెరగకుండా వాఙ్మయ భాష తోడ్పడుతుంది. అట్లా జరిగి, గిడుగువారన్నట్లుగా, "వ్రాసేదే కాక మాట్లాడేది కూడా సభ్యభాషే" అవుతుంది.

గిడుగువారు ఆశించినట్లుగానూ, ఆయనే రాసి చూపించినట్లుగానూ కావ్యభాషకు పూర్తిగా భిన్నం కానిది, ప్రాంత ముద్ర లేనిదీ అయిన శిష్ట వ్యావహారికం కాకుండా, 'రెండు మూడు జిల్లాలవారి భాష' అని ముద్రపడే విధంగా రాసే భాష వాడుకలోకి తేబడింది. అదే ప్రామాణిక భాషగా 'పెత్తనం' చెలాయిస్తున్నది అనిపించే విధానం ముందుకు వచ్చింది. దీని వల్ల క్రమంగా ఇతర ప్రాంతాలవారిలో వైమనస్యాలు చోటు చేసుకున్నై.

ఇప్పటి తెలుగు భాష స్థితిని బట్టి మనం ఏం చెయ్యాలి? తెలుగు రెండు రాష్ట్రాలలో ముఖ్య భాష. సరిహద్దు రాష్ట్రాలలో కూడా బాగా వ్యాపించి ఉంది. ఒక పొరుగు రాష్ట్రంలో కూడా కొంత కాలం క్రితం ముఖ్య భాషే! కాని ప్రభుత్వాల కుతంత్రాల వల్ల దాని స్థానం జారి పోయింది, లేదా పోతున్నది. అయినప్పటికీ తెలుగుకు భౌగోళిక వ్యాప్తి చాలా ఉంది. ఆ కారణంగా వైవిధ్యం కూడా చాలా ఉంది. ఆ కారణంగానే పలు ప్రాంతాలలో పలు 'శిష్ట' వ్యావహారికాలు ఉన్నై. అదే కారణంగా (ఇంత భౌగోళిక వ్యాప్తి, ఇంత వైవిధ్యం కల భాషకు) ఒకే ఒక ప్రమాణ భాష సరిపోదు. అందువల్ల అన్ని ప్రాంతాల శిష్టవ్యావహారికాలను కలుపుకుంటూ కనీసం మూడు ప్రాంతీయ ప్రామాణిక భాషలను ప్రోత్సహించవచ్చు. ఈ విషయం మీద ఇటీవల తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక వారి వెబినార్ లో నేను సమర్పించిన ప్రసంగ వ్యాసం 'మాతృభాషలు – విద్యాబోధన' లో విపులంగా చర్చించాను. దాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తాను. ఇక ఇంటి భాషల విషయానికి వస్తే, బడి చదువులో తొలి మెట్టుగా ఆయా ప్రాంతాల 'ఇంటి భాష'లను, మలి మెట్టుగా ఆయా ప్రాంతాలలోని మాండలికాలను, తుది మెట్టుగా ఆయా ప్రాంతాల లోని ప్రమాణ భాషను అంటే శిష్ట వ్యవహార భాషను, దానితోబాటుగా కావ్య భాషను వాడాలి. దీన్ని గురించి కూడా ఆ ప్రసంగ వ్యాసంలో చర్చించాను.

చివరకు మళ్ళీ గిడుగువారి గురించి. ఎన్.ఎస్. రాజుగారు ఉట్టంకించిన విశ్వనాథవారి మాటల ప్రకారం **"మన భాషలో ఇద్దరే వాగనుశాసనులు. నన్నయభట్టుగారు, గిడుగు రామమూర్తిభట్టు గారు."** (రాజు, ఎన్. ఎస్. 2012: 88). అటువంటి గిడుగును మళ్ళీ జాగ్రత్తగా చదువుకుంటే ఒక ప్రశ్న కలుగుతుంది: గిడుగు అవసరం మనకు ఇప్పటికీ ఉందా? అని. ఉందనే అనిపిస్తుంది.

ప్రొ. వెలమల సిమ్మన్న
9440641617

# గిడుగు సూర్యరాయాంధ్ర నిఘంటువు విమర్శ - పరామర్శ



**"శబ్దరత్నాకరం", "సూర్యరాయాంధ్ర నిఘంటువు"ల గూర్చి గిడుగు చేసిన విమర్శలు వారి నైఘంటిక విజ్ఞానాన్ని తెలియజేస్తున్నాయి. రామమూర్తిగారి చూపు వ్యాకరణాలపైనే కాక, నిఘంటువులపై కూడా పడింది. వీరు సవర- తెలుగు, తెలుగు- సవర, ఇంగ్లీషు- సవర, సవర-ఇంగ్లీషు నిఘంటువుల్ని తయారు చేశారు. నిఘంటువుల నిర్మాణానికి పండిత ప్రతిభతో పాటు, భాషా శాస్త్రజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం కూడా తప్పనిసరిగా వుండాలని గిడుగువారి అభిప్రాయం. మన ఆధునిక నిఘంటువుల్లో పసలేదనీ, ఎక్కువదోషాలతో వున్నాయనీ, రామమూర్తిగారు తీవ్ర పదజాలంతో విమర్శించారు.**

**"శబ్దరత్నాకరం" నిఘంటువులో చాలా దోషాలు వున్నాయని ఎత్తి చూపారు. బహుజనపల్లి సీతారామాచార్యులకు పాండిత్య ప్రతిభతప్ప, భాషా జ్ఞానం, శాస్త్రీయ దృక్పథం, లేకపోవడం వల్ల, "శబ్దరత్నాకరం"లో 2000వేలకు పైగా దోషాలు వున్నాయని పరిశోధనలో నిర్ధారించారు. గిడుగువారి నిఘంటు నిర్మాణ కృషి ఎనలేనిది. వీరి నిఘంటు నిర్మాణ అధ్యాయం ఎంతో మందికి ఆదర్శం. నిఘంటు నిర్మాణంలో లోతుల్ని చూసిన మహామేధావి గిడుగు.**

సవర భాషకు వీరు తయారు చేసిన నిఘంటువు పలువురి ప్రశంసల్ని అందుకుంది. నిఘంటువులోని పదాలకు, ప్రయోగ పూర్వకమైన అర్థవివరణ కూడా ఇచ్చారు. రామమూర్తిగారు సవర భాషలోని పర్యాయపదాల్ని, జాతీయాల్ని, కూడా సేకరించారు. వాటిని నిఘంటువులో చేర్చలేదు. వీరు చేసిన తులనాత్మక అధ్యయనం తెలుగుజాతి ఎన్నటికి మరువలేనిది. తన నిఘంటువులో పదాలకు అర్థాల్ని చూపడంతోపాటు చెట్లు, ఊళ్ళు, మనుషుల పేర్లను తెలియజేసే చిన్నపట్టికల్ని కూడా జతచేశారు. చెప్పుకోదగ్గ గొప్ప విషయం ఇది.

''శబ్దరత్నాకరం'' బహుజనపల్లి సీతారామాచార్యులు తయారుచేశారు. ఈ నిఘంటువును పండితలోకం మెచ్చుకుంది. ఎంతో కష్టపడి ఎన్నో ప్రయోగాల్ని సేకరించి, నిర్మించారు శాస్త్రిగారు. 1912లో అచ్చయిన " శబ్దరత్నాకరం" ఆధారంగా గిడుగు నిశితంగా పరిశీలించారు.

ఈ నిఘంటువులో తాను చేసిన మార్పుల్ని గిడుగు కొంతమందికి ఉత్తరాల ద్వారా తెలియజేశారు. కొంతమంది పెద్దలతో చర్చలు కూడా చేశారు. "శబ్దరత్నాకరం" నిఘంటువుకు ఎన్నో సవరణల్ని చేశారు. "ఇంచుమించుగా రెండు వేల సవరణలను నేను దానిలో (శబ్ద రత్నాకరం) చేసినాను" అని కటారి ప్రభాకర శాస్త్రి గారికి రాసిన లేఖలో గిడుగు పేర్కొన్నారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు "శబ్దరత్నాకరం" గూర్చి గిడుగుతో చర్చించారు. శ్రీపాద వారి వ్యాసాన్ని బట్టి గిడుగు మరొక శబ్దరత్నాకరాన్ని కొని, దాన్ని రెండు భాగాలుగా చేసి రెండింటిలోను మధ్య మధ్య తెల్లకాగితాలు కలిపి, బైండు చేయించారు. "శబ్దరత్నాకరం"లో వారు రాసినదాన్ని మరల నీటుగా రాయాలన్నదే వారి సంకల్పం. అయితే వారి జీవిత కాలంలో ఆ పనిని చేయలేక పోయారు. గిడుగు మనుమడు జి.వి. రామమూర్తి గారు తాతగారి గ్రంథసూచిక వరకు గిడుగు బైండు చేయించిన "శబ్దరత్నాకరం" లోని తెల్ల కాగితాలపై ఎక్కించారు. అది కూడా అసంపూర్ణంగానే మిగిలిపోయింది.

"అది (సూర్యరాయాంధ్ర నిఘంటువు) "శబ్దరత్నాకరం" మీద ఇంప్రూవ్‌మెంటు తప్ప, స్వతంత్ర గ్రంథం కాదు, సమగ్రం అంతకంటే కాదు. నిర్దుష్టం కానే కాదు. కావడానికి తగిన సన్నివేశాలు ఎక్కడా లేనేలేవు. అది అచ్చులో వుందని తెలుస్తుంది. నేను దానికోసం ఎదురు చూస్తున్నాను. వచ్చీరావడం తోనే, దాన్ని నేను ముక్క చెక్కా కింద చితక్కొట్టేస్తాను. అందుకోసం ఈ శబ్దరత్నాకరాన్ని ఇంత జాగ్రత్తగా వుంచాను. దీన్ని అనుసరించి వెలువడుతుంది కనుక, దాన్ని విమర్శించాలంటే దీనిమీద రాసి వుంచిన నోట్సు చాలా అవసరం. తర్వాత దీని పని తీరిపోతుంది. ఇంత పనిచేస్తే గాని, కృతకాంధ్రం యొక్క దౌర్బల్యమూ, దౌర్భాగ్యమూ, విదేశీయులకు పూర్తిగా బోధపడవు. నిఘంటువును రాయడానికి ఎలాంటి వారు పూనుకోవాలో, వారిహృదయం ఎంత విశాలమయింది కావాలో, సంకుచిత భావాలతో పూనుకుంటే అది ఎలాగు నిరర్థకం అయిపోతుందో, జీవద్భాషను విడిచిపెట్టి, నిఘంటువు రాయడం ఎంత శవాలంకరణమో, దేశీయులకు బోధపడడంచాలా అవసరం. ఏది జరిగినా, జరగక పోయినా, నేనిది మాత్రం చేసి తీరుతాను. మీరు చూస్తారు" అని గిడుగు మాటలసందర్భంగా శ్రీపాదవారితో అన్నట్లు శ్రీపాదవారు తెలియచేశారు.

గిడుగు తాను అనుకున్న లోపాల్ని గానీ, తాను చేసిన సవరణల్ని

*"ఈ నిఘంటునందు, మొగమాటము లేకుండా, నిఘంటువులోని లోపములు, దోషములు, కొన్ని ఎత్తి చూపించక తప్పినది కాదు. అది మంచి ఉద్దేశముతో చేసిన పని అని, నా స్వభావము ఎరిగినవారు భావిస్తారని నమ్ముతాను"*

*"ఈలాగున వ్రాయవలసి వచ్చినందుకు దుఃఖిస్తున్నాను సుమండీ. శ్రీ మహారాజా వారి యెడలను, శ్రీ జయంతి రామయ్య పంతులు వారి యెడలను, నిండా గౌరవము గల వాడను. అయితే ఇట్టి విషయములలో సత్య జిజ్ఞాసువులు మొగమాట పడకూడదు గదా!" - గిడుగు*

గానీ, ఎక్కడా వర్గీకరించలేదు. "శబ్దరత్నాకరం"లోనే ఆయా పేజీల్లో ఖాళీస్థలాల్లో రాసుకున్నారు. పేజీల పైభాగంలోనూ, క్రిందభాగంలోనూ, గిడుగు రాసుకున్నారు. లోపాల్ని ప్రత్యేక పుస్తకంలో "నోట్" చేసుకుంటే ఇంకా బాగుండేది. అయినా గిడుగు కృషి అభినందనీయమే.

గిడుగు నిఘంటువులో పాటించవలసిన నియమాల్ని, పద్ధతుల్ని చెప్పారు. అవి ఇవి:

♦ యతి ప్రాస స్థానాలు - శబ్దాల సాధుత్వా సాధుత్వ నిర్ణయం - పరిధి విస్తరణ

♦ అర్థ విపరిణామం చెందిన శబ్దాలు

♦ భిన్నార్థకాలయిన సంస్కృత శబ్దాలు

♦ లింగ వచన నిర్దేశం

♦ వ్యవహార భ్రష్ట పదాలు, అర్థాలు

♦ అన్య దేశ్యాలు ♦ దేశ్యాలు ♦ మూల శబ్దాలు ♦ గ్రామ్యాలు

''ఆంధ్రదేశం గిడుగుచే ఒక మంచి నిఘంటువు నిర్మించుకోలేకపోయిందని" 1953లో విశ్వనాథ సత్యనారాయణ గారు బాధపడ్డారు. విశ్వనాథ వారు చెప్పినట్లు గిడుగు ఆలోచనలతో, అభిప్రాయాలతో ''శబ్దరత్నాకరం'' పునర్ముద్రణ జరిగివుంటే సహృదయ సాహితీ ప్రియులకు ఎంతో మేలు జరిగేది.

**సూర్యరాయాంధ్ర నిఘంటువు విమర్శ**

*"నీళ్ళపాలు, హంసపాల బడ్డాయి. అదిగో గి.రాం. రాజహంస. నీళ్ళకి నీళ్ళు, పాలకిపాలు విడమర్చి చూపించే ఈ సూర్య రాయాంధ్ర నిఘంటు విమర్శనము. ఆ విమర్శనము వెలకట్టరానిది మరొకరికి సాధ్యం కానిది"* - పురిపండా అప్పలస్వామి

జయంతి రామయ్య పంతులు (1860-1941) గారి నేతృత్వంలో, పిఠాపురం మహారాజా వారి సహాయసహకారాలతో ఆయన పేరు మీద "సూర్యరాయాంధ్ర నిఘంటువు" వెలువడింది. 1936లో ప్రథమ సంపుటి 'అ' నుండి 'ఔ' వరకు వచ్చింది. "ఆంధ్రపత్రిక"లో వడ్లమూడి వెంకటరత్నంగారు ఆ సంపుటాన్ని గూర్చి సమీక్షచేశారు. ఈ నిఘంటువులోని లోపాల్ని ఎత్తి చూపారు. ''నవ్యసాహిత్య పరిషత్తు" వారి 'ప్రతిభ' పత్రికలో గిడుగు వారు 'సూర్యరాయాంధ్ర నిఘంటువు"కు సంబంధించి మంచి విమర్శ వ్యాసం రాశారు. ఈ విమర్శ చాలా నిశితంగా వుంది. సుదీర్ఘమైన తన విమర్శను రామమూర్తిగారు 109 అంశాలుగా వర్గీకరించారు. గిడుగు వారి విమర్శ ప్రముఖుల ప్రశంసల్ని అందుకుంది. ఈ విమర్శవల్ల గిడుగువారికి ఎనలేని పేరు ప్రఖ్యాతులు వచ్చాయి.

"శబ్దరత్నాకరం"లో అనేక లోపాలు వున్నాయి కాబట్టి, దానికి మించిన మేల్తరమైన నిఘంటువు రావాలని. పండితులు కోరుకున్నారు. సమగ్రనిఘంటు నిర్మాణం ఏకవ్యక్తి పరంగా సాధ్యం కాదని, వచ్చినా అది అంత సంపూర్ణంగా, సమగ్రంగా, వుండదని, ఎక్కువ మంది పండితులు విమర్శించారు. కాబట్టి ఒక సంస్థ తరుపున నిఘంటువు వస్తే మంచిదని ఎక్కువమంది భావించారు. అది నిజం కూడా.

ఆ సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని జయంతి రామయ్య గారు భాషాపరమైన అభివృద్ధికి ఒక సాహితీ సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఒక మంచి వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో జయంతి వారు అలా అన్నారు.

"తెలుగు భాషలో నిఘంటువులనేకము ఉన్నను, సమగ్ర మయినదియు, పరమ ప్రమాణముగా గ్రహింప దగినదియునున్నదని చెప్పుటకు వీలులేదు. భాషలోని యర్థ భేదములను సాధ్యమయినంతవరకు, వ్యుత్పత్తులను తెలుగుకు సంబంధించిన యితర భాషలగతి స్వరూప శబ్దములను బ్రయోగములకు సప్రమాణ గ్రంథములలోనుండి యుదాహరణములను తెలుపునట్టి యొక నిఘంటువును రచించుట కర్తవ్యమైయున్నది. అటు పిమ్మట సంస్కృతమునందు శబ్ద కల్పద్రుమాది గ్రంథముల వంటివి, ఆంధ్ర భాషా సర్వార్థకసూచికమగు గ్రంథమొకటి రచింపవలెను. ఈ ఘనకార్యము లొనర్చుటకును బ్రత్యేకముగా నీవిషయమై పాటు పడువారలకు జేయూతనిచ్చి తోడ్పడుటకును భాషా విషయకములగు సర్వ ప్రయత్నములకును దారి చూపుటకు ఆంధ్రభాషా మహాసంఘమునునొక గొప్ప సమాజమేర్పరచుట యావశ్యకము" అని తెలియజేశారు. అంతేకాక జమీందారులకు అటువంటి మహా సంఘాన్ని ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తిచేశారు. జయంతి వారి విన్నపం తర్వాత 'ఆంధ్ర సాహిత్యపరిషత్తు' ఏర్పడింది.

"శబ్దరత్నాకరం" (1885) వెలువడిన 50 సంవత్సరాలకు 1936లో ''సూర్యరాయాంధ్ర నిఘంటువు'' వెలువడింది. జయంతివారు "సూర్యరాయాంధ్ర నిఘంటువు" విషయంలో తమతో కలిసి పనిచేయవలసిందిగా గిడుగును కోరారు. ఆయన తిరస్కరించారు. గిడుగు అంటే జయంతి వారికి గౌరవం. అయితే గిడుగు సున్నితంగా ఇదే విషయాన్ని ఉత్తరంలో వేటూరి వారికి తెలియజేశారు.

"దేశ్యాల విషయంలో చాలా చిక్కులు కనబడుతున్నవని, రామమూర్తి గారి సాయం కావాలని" జయంతివారు కోరారు. అప్పుడు గిడుగు ఇలా అన్నారు.

"అయ్యా మన మతాలు వేరు. నేను అవునన్నది మీరు కాదంటారు. ప్రాచీనాంధ్ర శబ్దములకు వర్తమాన వ్యావహారికాంధ్రములో అర్థము

చెప్పడము పూర్వ పండితుల సంప్రదాయము. ఆశిష్టాచారము మీరు కూడా అవలంబించేయెడల కూలి ఏమీ కోరకుండా సేవచేస్తాను. లేదా మీరు గ్రంథమంతా సిద్ధముచేసిన తరువాత నేను వచ్చి, చూచి, దానిలో చేర్చవలసినవి, తొలగించవలసినవి, మార్చవలసినవి, సప్రమాణముగా తెలియజేస్తాను. నా ఉపదేశము మీరు అంగీకరించినప్పుడు ఒక్కొక్క అంశమునకు ఒక్కొక్క రూపాయి చొప్పున ఈనాము దయచేయవలెను. ఇట్లు నేను జవాబు ఇచ్చినాను. అందుకు బదులు జవాబు రాలేదు రాదు" అని వేటూరివారికి గిడుగు ఉత్తరం రాశారు.

''సూర్యరాయాంధ్ర నిఘంటు'' నిర్మాణ సంఘంవారు అవలంబించే పద్ధతుల్లో కొన్నింటిని గిడుగు వ్యతిరేకించారు.

1936లో "సూర్యరాయాంధ్ర నిఘంటువు" తొలి సంపుటి వెలువడింది. 'ప్రతిభ' పత్రికా సంపాదకులు నిఘంటువు సమీక్షకోసం, గిడుగుకి పంపారు. 'ప్రతిభ'లో ధారావాహికంగా "సూర్యరాయాంధ్ర నిఘంటువు" విమర్శవచ్చింది. దాన్ని 1980లో విశాలాంధ్రవారు ప్రచురించి సహృదయ పాఠకులకు వేడి వేడిగా విమర్శ విందు అందించారు.

వ్యావహారిక భాషా వాదుల విమర్శలకు పరిహారంగా, తెలుగుభాషను, తెలుగువారందరూ నేర్చుకోవడం కోసం, సంపూర్ణమైన నిఘంటువును ప్రకటించవలసిన పరిషత్తు ఉద్దేశానుసారం నిఘంటువు లేకపోవడంవల్ల గిడుగు విమర్శచేశారు.

''శబ్దరత్నాకరం'' విమర్శలో రాసిన కొన్ని నియమాల్ని, "సూర్యరాయాంధ్ర నిఘంటు" నిర్మాణకారులు పాటించారు.

కొన్ని నియమాల్ని, పద్ధతుల్ని, ఈ నిఘంటుకారులు పాటించలేదు.కొన్ని తామేర్పరచు కొన్న, నియమాలనే తాము పాటించలేదు.

"శబ్దరత్నాకరం"లో ఏ లోపాలు వున్నాయో అవే లోపాలు "సూర్యరాయాంధ్ర నిఘంటువు"లో కూడా వున్నాయి.

మరికొన్ని "సూర్యరాయాంధ్ర నిఘంటువు" లోని లోపాల్ని గిడుగు పేర్కొన్నారు. ఇలా "శబ్దరత్నాకరం", సూర్యరాయాంధ్ర నిఘంటువుల్ని తూర్పారబట్టారు గిడుగు.

ఒక నిఘంటు నిర్మాణం సమగ్రంగా వుండాలంటే సుపరిష్కృతాలయిన గ్రంథాలు వుండాలి అన్నారు.

ప్రామాణికమైన, సమగ్రమైన వ్యాకరణం వుండాలి.

తెలుగు శబ్దాల వ్యుత్పత్తులు నిరూపించుకొని వుండాలి.

పండితులందరూ కూర్చుని, శబ్దాల వ్యుత్పత్త్యాదులను గూర్చి చర్చించాలి. అటువంటి ప్రతిభ సూర్యరాయాంధ్ర నిఘంటు కారులకు వున్నాయి. అయినా "సూర్యరాయాంధ్ర నిఘంటువు" లోపభూయిష్టంగా తయారైందని గిడుగు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

"సూర్యరాయాంధ్ర నిఘంటువు" సమగ్రం కాదని, అది ప్రచురణ కాకముందే అభిప్రాయపడ్డారు గిడుగు. ''శబ్ద రత్నాకరం''పై ఇంప్రూవ్‌మెంట్ కాని, సమగ్రంకాదని అన్నారు అయన. "సూర్యరాయాంధ్ర నిఘంటువు" గ్రంథం చూచిన తర్వాత కూడా గిడుగు అదే అభిప్రాయానికొచ్చారు. ఇప్పుడు బల్లగుద్ది మరీ చెప్పారు.

"శబ్దరత్నాకరం"లో శబ్దాల వ్యుత్పత్త్యాదులు లేనందువల్ల, అది సమగ్రంకాదని జయంతి వారు అన్నారు. అయితే తాముకూడా ఆవిధంగానే "సూర్యరాయాంధ్ర నిఘంటువు"ను కూర్చారు అని వున్నది వున్నట్లు తీవ్రంగా విమర్శించారు గిడుగు.

"సూర్యరాయాంధ్ర నిఘంటువు" రచయిత, జయంతి రామయ్య పంతులని ఆ గ్రంథం ముఖపత్రం మీద వుంది. దాన్ని రామమూర్తిగారు తీవ్రంగా విమర్శించారు. పంతులుగారు ఎంతో మంది పండితులతో తయారుచేసిన నిఘంటువును తన పేరు పెట్టుకోవడం చాలా దారుణమని నిశితంగా విమర్శించారు. ఆ నిఘంటువులో కన్పించే మంచి, చెడులన్నింటికీ జయంతి రామయ్య పంతులుగారే బాధ్యత వహించవలసి వుంటుందని గిడుగు పేర్కొన్నారు.

నిర్వాహకులు ''సూర్యరాయాంధ్ర నిఘంటువు'' గొప్పదని కొనియాడారు. గిడుగువారు ఆ నిఘంటువులో ఏమాత్రం గొప్పతనం లేదు, లెక్కలేనన్ని దోషాలు వున్నాయని ఉదాహరణ పూర్వకంగా వివరించారు. **"మరణించిన వారి పేర్లు జనాభాలెక్కలలో చేర్చడం ఎలాంటిదో, వాడుకలోనేని మాటలను నిఘంటువుల్లో చేర్చడం అలాంటిదే"** అని గిడుగువారు వున్నది వున్నట్లు ఘంటాపథంగా చెప్పారు. "శబ్దరత్నాకరం" లోని 186 పుటల్లో మాత్రం ఇమిడివున్న గ్రంథాన్ని మేము వెయ్యి పుటలకు పెంచినాం'' అన్న సూర్య రాయాంధ్ర కారుల అవివేకపు మాటల్ని రామమూర్తిగారు తీవ్రంగా ఆక్షేపించారు.

కవులు నిఘంటువును చూసి శబ్దాల్ని ప్రయోగిస్తారని జయంతి రామయ్యగారు అనడం ఆయన అజ్ఞానానికి పరాకాష్ట అని అన్నారు. తెలియనిమాటకు తెలిసిన మాటలతో చెప్పడం నిఘంటువు చేయవలసిన మొదటి పని. అందుకు భిన్నమైన పరిస్థితి ఏర్పడినప్పుడు, నిఘంటువులకు టీక రాయవలసి వస్తుందని గిడుగువారు వాపోయారు. సూర్య రాయాంధ్ర నిఘంటుకారులు, నిఘంటు నిర్మాణ సంప్రదాయానికి వ్యతిరేకంగా పనిచేశారని రామమూర్తిగారు బాధపడ్డారు.

**ప్రతీ భాషకు ఒక సంప్రదాయం వుంటుంది. అదే విధంగా, తెలుగు భాషా సంప్రదాయం వేరు. సంస్కృత భాషా సంప్రదాయం వేరు. సంస్కృత భాషా సంప్రదాయాన్ని అనుసరించి, తెలుగు నిఘంటు నిర్మాణం చేయడం చాలా తప్పు అని రామ్మూర్తిగారు తెలిపారు.** ఇలా గిడుగువారు సూర్యరాయాంధ్ర నిఘంటువులోని అనేక ఆరోపాల్ని, బయట పెట్టారు. వీరి "సూర్యరాయాంధ్ర నిఘంటు విమర్శ"ను ఎంతోమంది పండితులు, మేధావులు, విమర్శకులు, మెచ్చుకున్నారు..

''వ్యావహార భ్రష్టభాష ఎవ్వరికీ స్వాయత్తము కాదు. దుర్‌జ్ఞేయము, దుర్బోధము, దుర్లభము, నన్నయాది ప్రాచీన కవులలోని భాష గ్రాంథిక భాష అనీ, అదే తాము వాడుతున్నామని బొంకుతూ, కృతక భాషకల్పించి, అవాస్తవమైన దేశభాషమీద ఉండవలసిన అభిమానము పోగొట్టి తెలుగుదేశములో ప్రజలకు, చదువు రాకుండా చేసి అపరిమితమైన కీడుకలిగించినారు పండితులు'' అని సూర్యరాయాంధ్ర నిఘంటు విమర్శనములో



*"నన్నయ భట్టు మొదలుకొని, నేటి వరకు బయలుదేరిన భాషానుశాసకులలో ఎవరికి గాని, గిడుగు పంతులుకు తెలిసినన్ని మహాకవి ప్రయోగాలు తెలియవని ఏ ప్రమాణం పడితే ఆ ప్రమాణం చెయ్యడానికి జంకను. అది ఎక్కడి పరిశీలనా జ్ఞానమో! ఒక్కొక్క శబ్దాన్ని ఎత్తుకొని వర్గ త్రయాలు వ్రాయటం మొదలిడితే, వంశవృక్షాలు వ్రాయటం మొదలిడితే, అదే వ్రాయడం ఆదే వ్రాయడం. ఆ వ్రాయడంలో ఒక్క అక్షరంకూడా సూటి దప్పినదంటూ వుండదు. అదెక్కడి పాండిత్యమో.. నిజంగా గ్రాంథిక కవులమని పేరు పెట్టుకొని వాళ్ళందరూ ఆత్మవంచన లేని వాళ్ళే అయితే, ఒక మహాసభచేసి, వారి వారి బిరుదులన్నీ పంతులవారికి సమర్పించి, ఆయన అనుగ్రహించి మళ్ళీ ఇచ్చేటట్టయితే, అలంకారార్థం ధరించుకోవలసిందే కాని, లేకపోతే వదులుకోవలసిందే"*

*"గిడుగు గాదిది పిడుగు గాని" అని పెద్ద పెద్ద విమర్శకులందఱూ శంకరగిరిమాన్యాలట్టుకొని పాఱిపోయే ప్రజ్ఞాశాలి. వీరికి వున్న విమర్శనా జ్ఞానం యింతా అంతా అని చెప్పడానికి నా తరం కాదు. యీయన ఇంగ్లీషులో బి.ఏ. తెలుగులో యే పండితులున్నూ ఈయనకు చాలరు. సంస్కృతంలో యీయన వ్రాసే విషయంచూస్తే దానిలోయెంత పాండిత్యంవుందో తెలుసుకోవడానికి శక్యం కాదు.*

*పంతులుగారంతటి విజ్ఞుడు లేదా, వారి ప్రజ్ఞలో సగభాగమేనా వున్న విజ్ఞుడు, నేటి గ్రాంథిక కవులలో మృగ్యుడు. వారి వ్రాతకు తిరుగంటూ వుండదని నా విశ్వాసం. పంతులుగారి విమర్శనానికి, పంతులుగారి విమర్శనమే సాటి"* **– చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి**

గిడుగు బాధపడ్డారు.

**ప్రశంస**

గిడుగు "సూర్యరాయాంధ్ర నిఘంటువు" లోని లోపాలని చెప్పడవే కాదు అందులో వున్న మంచివిషయాల్ని కూడా ప్రశంసించారు. సహృదయ విమర్శ అంటే అదే.

♦ ఈ నిఘంటువు మరి ఏ ఇతర నిఘంటువులకు పోలిక కన్పించలేదని గిడుగు కితాబు ఇచ్చారు.

♦ అంతకుముందు నిఘంటువులు కొన్ని ప్రామాణిక గ్రంథాల్ని గ్రహించలేదు. ఈ నిఘంటువు ఆ గ్రంథాల్ని స్వీకరించిందని గిడుగు ప్రశంసించారు..

♦ కొన్ని శబ్దాల క్రింద, ఇది ఇప్పుడు వాడుకలో లేదు అనీ, ఇది శాసనాల్లో కనబడుతున్నది అనీ, ఇది పశ్చిమాంధ్రము అని సూచించడం వల్ల "సూర్యరాయాంధ్ర నిఘంటువు" అద్యతన నిఘంటు ఛాయలను సంతరించుకున్నదని గిడుగు అభిప్రాయపడ్డారు.

♦ వ్యవహారిక శబ్దాల్ని తమ నిఘంటువులో కొంచెమైనా చేర్చి, నిఘంటు నిర్మాతలు తమ ఔదార్యం ప్రకటించారు. హరిజనుల్ని దేవాలయముల్లోనికి రానిచ్చినట్టున్నది. గాంధీమహాత్ముడు మన సంఘంలోని అస్పృశ్యతా కళంకం తొలగించినట్టే, ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు ప్రకటించి, మన భాషలోని గ్రామ్యతాకళంకము నేడు తుడిచివేశారు అని గొప్పగా ప్రశంసించారు.

♦ ఇంచుమించు ప్రయోగాల్లో లేని 200 వ్యావహారిక శబ్దాల్ని సూర్యరాయాంధ్ర నిఘంటుకారులు సంగ్రహించారు. శబ్దరత్నాకరకర్త గ్రామ్యాలుగా చెప్పినవి, ఈ నిఘంటువులో సాధువులుగా చెప్పారు. ఈ పద్ధతి ఆంధ్ర నిఘంటు నిర్మాణంలో గొప్ప పరివర్తనానికి అంకురార్పణం లాంటిదని గిడుగు వారు హర్షం వ్యక్తంచేశారు.

♦ ఈ నిఘంటువులో వాడుక మాటలన్నీ చేరితే, అది "లౌకిక భాషానిఘంటువు" అన్పించుకుంటుందని గిడుగు అన్నారు. సామాన్య జనులకు కూడా ఉపయోగపడుతుంది. పరిషత్తు వారి ఉద్దేశం కూడా చెరవేరుతుంది.. అంతే కాదు వారి పని ప్రశంసా పాత్రం అవుతుంది. అని గిడుగు వారు పేర్కొన్నారు.

♦ రెండో కూర్పులో వ్యావహారిక భాషా శబ్దాలు చేర్చి (పశ్చిమాంధ్రంలోనివి, దక్షిణాంధ్రంలోనివి) వ్యావహారిక భాషలోలేని అరసున్నాలూ, శకటరేఫలూ, ఆదేశాలూ, ఆగమాలు విడిచిపెట్టి చక్కని వ్యావహారిక భాషలో నిర్వచనాలు, వివరణలూ, రాసి, ప్రకటిస్తే మొదటి సంకల్పం చాలా వరకు నెరవేరుతుందని గిడుగు అన్నారు.

"సూర్యరాయాంధ్ర నిఘంటువు" విమర్శ, కేవలం " అ నుండి ఔ" వరకు మాత్రమే జరిగింది. మొత్తం నిఘంటువు మీద కాదు. గిడుగు బ్రతికి వున్నప్పుడే రెండో సంపుటి కూడా వచ్చింది.

**నిఘంటు నిర్మాణం ఒక అద్భుతమైన కళ. ఆ పని అందరూ చేయలేరు. చేసినా అందులో రాణించలేరు. పండితులు అయి వుండాలి. భాషాశాస్త్రవేత్త అయి వుండాలి. అప్పుడే ఆ నిఘంటువు రాణిస్తుంది. నిఘంటువులు "భాషాచరిత్ర"ను చెప్పేవిధంగా వుండాలి. నిఘంటు నిర్మాణంలో శాస్త్రీయ దృక్పథం అత్యంత అవసరం. లౌకిక భాషా పదాల్ని కూడా నిఘంటువులో చేరిస్తే ఎక్కువమంది ప్రజలకు ఉపయోగపడుతుంది. భాషవిషయంలో మడికట్టుకొని కూర్చోకూడదు.**

**గిడుగు మహా పండితుడు, గొప్ప మేధావి, అని చెప్పడానికి ఆయన రాసిన వ్యాకరణ విమర్శ". "నిఘంటు విమర్శ"లే ప్రధాన కారణం. గిడుగ అంటే ఆ కాలంలో పండితులు అందరికీ భయం. మహా మహా పండితులు కూడా గిడుగుప్రతిభను చూసి ఆశ్చర్యపోయారు. మహా మహోపాధ్యాయ వేదం వారితోనే "ధీ" కొన్న ఏకైక మహాపండితుడు గిడుగు. ఒక విషయంలో కానీ, ఒక శబ్దవ్యుత్పత్తిలో కానీ, ఎంతలోతుగా వెళ్ళాలో అంత లోతుగా పరిశీలించేవారు. అదే స్థాయిలో విశ్లేషించేవారు కూడా. అందుకే గిడుగు "పిడుగు" అయ్యారు. అందరి ప్రశంసల్ని పొందగలిగారు.**

డా. జంపాల చౌదరి



# తెలుగు భాషాభివృద్ధికి 'తానా'- గిడుగు రామమూర్తి స్మారక పురస్కారం

**ఉత్తర** అమెరికా ఖండానికి తెలుగువారు వలసదారులుగా వస్తున్న మొదటిరోజుల్లో, వారందరూ కలసి 1977లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా – TANA తానా) ను స్థాపించుకున్నారు. అమెరికాలోని మొదటి భారతీయ సంతతి సంఘాలలో ఒకటైన తానా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస తెలుగు సంఘాలన్నిటిలోనూ పెద్దది. అమెరికాలోనూ, భారతదేశంలోనూ తెలుగువారికోసం చేస్తున్న కార్యక్రమాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి హృదయాలలో ఒక ప్రత్యేక స్థానాన్ని తానా సంపాదించుకొంది.

తెలుగు భాష పరిరక్షణకు, పరివ్యాప్తికి కృషిచేయటం తానా సంస్థ ముఖ్య ఆశయాలలో ఒకటి. ఈ ఆశయ సాధనకు మొదటి నుంచీ కట్టుబడి ఉన్న తానా ఉత్తరఅమెరికాలోనూ, తెలుగు రాష్ట్రాలలోనూ, తెలుగువారు నివసించే ఇతర ప్రాంతాలలోనూ గత నాలుగు దశాబ్దాలలో చాలా కార్యక్రమాలు నిర్వహించింది; మరిన్ని కార్యక్రమాలు నిర్వహించబోతూంది. పిల్లలకోసం తెలుగు పుస్తకాల పోటీలు నిర్వహించి పుస్తకాలను ప్రచురించటం; పెద్ద బహుమతులతో తెలుగు నవలల, కథల పోటీలను నిర్వహించటం, అరుదైన పుస్తకాలు ప్రచురించటం, పేరెన్నికగన్న సాహితీవేత్తల్ని అమెరికాకు ఆహ్వానించడం, కంప్యూటర్లలో తెలుగు వాడకాన్ని పెంచటానికి కృషి చేయటం, అంతర్జాలంలో తెలుగు నిఘంటువులు ఏర్పరచటం, తమిళనాడులో తెలుగువారికి తెలుగు వ్రాయటం, చదవటం నేర్పించటం వంటి అనేక కార్యక్రమాలను తానా నిర్వహించింది. పాఠశాల పేరిట వేలాదిమంది చిన్న పిల్లలకు అమెరికాలో తెలుగు నేర్పిస్తుంది.

**తానా–గిడుగు రామమూర్తి స్మారక పురస్కారం**

తానా నిర్వహించే భాషా సంబంధిత కార్యక్రమాలలో ప్రత్యేకమైనది- తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వారిని గుర్తించటానికి రెండేళ్ళ కొకసారి ఇచ్చే తానా- గిడుగు రామమూర్తి స్మారక పురస్కారం. ఈ తానా పురస్కారం కాకుండా తెలుగు భాష అభివృద్ధి కోసం చేసిన కృషిని ప్రత్యేకంగా గుర్తించే పురస్కారాలు ఇంకా ఏమైనా ఉన్నాయేమో నాకు తెలియదు.

ఈ పురస్కారాన్ని మొదటగా 2002లో, అప్పటి తానా తెలుగు భాషాభివృద్ధి సంఘం అధ్యక్షుడు డా. బండ్ల హనుమయ్య ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు ఆయనను ప్రేరేపించినవి రెండు ముఖ్య కారణాలు. తెలుగులో వ్యావహారిక భాషను పెంపొందించటానికి, పాఠశాలలో, పత్రికలలో తెలుగు వ్యావహారిక భాష వాడటానికి శ్రీ గిడుగు వేంకట రామమూర్తి అవిరామంగా జరిపిన పోరాటం తనను ఎంతో ఉత్తేజితం చేసిందని, ఆయన సేవను తెలుగువారు సముచితంగా గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఉందని డా. హనుమయ్య భావించారు. తెలుగు సాహిత్యంలో కృషి చేసిన వారిని తానా పలువిధాలుగా గుర్తించి సత్కరిస్తున్నా, తెలుగు భాష అభివృద్ధికోసం కృషి చేస్తున్నవారిని గుర్తించటం జరగవలసినంతగా జరగటంలేదని ఆయన అభిప్రాయ పడ్డారు. గిడుగు వారి పేరిట ఒక పురస్కారాన్ని ఏర్పరచి, తెలుగు భాష కోసం కృషి చేస్తున్న వారిని ప్రత్యేకంగా గౌరవిస్తే బాగుంటుందని ఆయన భావించారు. శ్రీమతి ముత్యాల పద్మశ్రీ అధ్యక్షురాలిగా ఉన్న తానా కార్యవర్గం డా. హనుమయ్య ప్రతిపాదనను ఆమోదించింది.

**ఎంపిక ప్రక్రియ:**

రెండేళ్ళకొకసారి, తెలుగు భాష వికాసానికి, అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్న ఒక వ్యక్తిని తానా- గిడుగు రామమూర్తి స్మారక పురస్కారంతో గౌరవించాలని తానా కార్యవర్గం నిర్ణయించింది. తానా తెలుగు భాషాభివృద్ధి కమిటీ, రెండేళ్ళకొకసారి, ఈ పురస్కారానికి అర్హులైనవారి గురించి తెలుగు భాష కోసం కృషి చేస్తున్న ప్రముఖుల వద్దనుండి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి, ఒక వ్యక్తిని ఎన్నిక చేస్తుంది. తానా కార్యవర్గం, పాలకమండలి విడివిడిగా ఆ ఎన్నికను పరిశీలించి ఖరారు చేస్తారు. ఈ పురస్కార గ్రహీతను తానా ఒక ఫలకంతోనూ, రూ. 50,000 నగదు బహుమతితోనూ సత్కరిస్తుంది. వీలయినంత వరకూ, ఈ పురస్కారాన్ని, రెండేళ్లకొకసారి, డిశంబరు నెలలో తెలుగునాట తానా జరిపే తానా చైతన్య స్రవంతి కార్యక్రమంలో అందజేస్తారు.

**పురస్కార విజేతలు:**

ఈ తానా- గిడుగు రామమూర్తి స్మారక పురస్కారాన్ని మొదటిసారి 2002లో హైదరాబాదులో, ప్రముఖ తెలుగు భాషా

శ్రద్ధాంజలి

# కె.కె. రంగనాథాచార్యులు



హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో మానవీయశాస్త్రాల విభాగానికి డీన్ గానూ, తెలుగు విభాగానికి అధ్యక్షుడు గానూ పనిచేసిన ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు 2021 మే 15వ తేదీన కన్నుమూశారు.

సహృదయుడూ సామాజిక స్పృహ, ఆచితూచి మాట్లాడడం ఆయన నైజం. సాంప్రదాయిక కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి, తన సొంత వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్న వ్యక్తి. చిన్నాపెద్దా తేడా లేకుండా చనువుగా మాట్లాడే మృదుస్వభావి. మంచికి మారుపేరై, సహనశీలిగా, మానవత్వం, పెద్దరికం కలబోసుకొని, చిరునవ్వుల పలకరింపులతో అందరి గుండెల్లోనూ చోటు సంపాదించుకొన్నారు. అందరికీ ఆదర్శప్రాయుడైన గురువుగా ఎందరో అభిమానులను సంపదగా పోగుచేసుకొన్న ఆధునిక తెలుగు సాహితీవేత్త, తెలుగు చారిత్రక వ్యాకర్త, విమర్శకుడు. కెకెఆర్ గా సుప్రసిద్ధులైన ఆచార్య కోవెల కందాడ రంగనాథాచార్యులు 1941 జూన్ 14న తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జన్మించినా బాల్యం నుంచీ హైదరాబాద్ సీతారాంబాగ్ దేవాలయ ఆవరణంలో పెరిగి, అక్కడి సంస్కృత కళాశాలలో డీ.ఓ.ఎల్ కోర్స్ చేశారు. సంస్కృతం, తెలుగుసాహిత్యం, భాషాశాస్త్రాలలో పట్టభద్రులు.

ఆచార్య కోవెల కందాడ రంగనాథాచార్యులు మే 15వ తేదీన కన్నుమూశారు. వారి కుటుంబసభ్యులకూ తదితరులకూ మా ప్రగాఢ సంతాపం.

– సంపాదకుడు

శాస్త్రజ్ఞుడు, విమర్శకుడు, ఆచార్య చేకూరి రామారావు గారికి, శ్రీమతి వి.ఎస్. రమాదేవి అందజేశారు. అప్పటినుండి ప్రతీ రెండేళ్ళకొకసారి ప్రకటిస్తున్న ఈ పురస్కారాన్ని ఇప్పటి వరకూ ఐదుగురు భాషా శాస్త్రవేత్తలు, నలుగురు తెలుగు భాషా ఉద్యమకారులు అందుకున్నారు.

**ప్రస్తుతం తెలుగు సమాజంలో తెలుగు భాషను శిక్షణా మాధ్యమంగా ఉంచటానికి, తెలుగును ఒక భాషగా ప్రాథమిక, సెకండరీ పాఠశాలలలో విద్యార్థులు నేర్చుకోవటానికి చాలా అడ్డంకులు, ఇబ్బందులు ఉన్నాయి. వీటివల్ల తెలుగు మనుగడకే ప్రమాదం వాటిల్లవచ్చని భాషాభిమానులు కలవరపడుతున్నారు. ఇంతకంటే విపరీతమైన వ్యతిరేక పరిస్థితులలో వ్యావహారిక తెలుగును బోధనాభాషగా, రాజభాషగా చేయటానికి అకుంఠిత కృషి సలిపిన శ్రీ గిడుగు వేంకట రామమూర్తి పంతులు మనకు స్ఫూర్తిదాయకులు. ఆయనను గుర్తు చేసుకొంటూ, తానా నిలిపిన ఈ పురస్కారం తెలుగు భాషాభిమానులకు మరింత ఉత్సాహాన్ని, బలాన్ని సమకూరుస్తుందని, తెలుగుదీపం మరింత కాంతివంతంగా ప్రకాశిస్తుందని ఆశించుదాం.**

వ్యాసకర్త డా. జంపాల చౌదరి
తానా పూర్వఅధ్యక్షులు
ప్రస్తుతం తానా పాలకమండలి సభ్యులు

## 'తానా'– గిడుగు రామమూర్తి స్మారక పురస్కారం పొందినవారు



**2002**
ప్రొఫెసర్ చేకూరి రామారావు



**2004**
ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణమూర్తి



**2006**
శ్రీ సి. ధర్మారావు



**2008**
శ్రీ ఎబికె ప్రసాద్



**2010**
శ్రీ స.వెం. రమేశ్



**2012**
ప్రొ పి.ఎస్.సుబ్రహ్మణ్యం



**2014**
ప్రొ॥ రవ్వా శ్రీహరి



**2016**
డా॥ సామల రమేష్‌బాబు



**2018**
ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు

భారత
ప్రధాన న్యాయమూర్తి

ప్రొ. గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# అమ్మనుడిలో చదివి అత్యున్నత పదవికి ...
# భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ



2021 ఏప్రిల్ 6న జస్టిస్ రమణను 48వ భారత ప్రధాన న్యాయమూర్తిగా భారత రాష్ట్రపతి నియమించారు. 2021 ఏప్రిల్ 24 న రాష్ట్రపతి భవన్‌లో అధ్యక్షుడు రామ్‌నాథ్ కోవింద్ జస్టిస్ రమణ చేత ప్రమాణస్వీకారం చేయించారు.

**మ**హర్షులు పుట్టరు, తయారవుతారు. సుఖాల్ని బంధించి, సంతోషాలను త్యజించి, నిరంతర శ్రమతో చెమటలు చిందించినపుడు మాత్రమే తయారవుతారు. తాము ఎంచుకున్న రంగంలో చేసే కృషినే తపస్సుగా భావించి శ్రమించినప్పుడు మాత్రమే తపస్వులు సిద్ధులవుతారు.

అలాంటివారి జీవితం ఎప్పుడూ పూలబాట కాదు. కంటికీ రెప్పకీ దూరంగా నిద్రను నిలదీసి, ఒక జీవితకాలంపాటు వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యానికి పణంగా పెడితేనే పర్వతశిఖరాగ్రాలు అందుతాయి. ఈ మాటలకు ముమ్మార్లుతూ నిదర్శనంగా నిలిచే పదహారణాల తెలుగు పేరు- నూతలపాటి వెంకట రమణ. తెలుగుతనాన్ని పేరులోనే కాదు, మాటలో నడతలో ఆలోచనల్లో ఆచరణల్లో నింపుకున్న ఓ అరుదైన వ్యక్తిత్వం ఆయనది.

అమ్మనుడిలో కమ్మగా చదివితే ఎంత సమున్నత స్థానాన్నైనా చాలా సులభంగా సాధించవచ్చు అని నిరూపించిన మాతృభాషాప్రేమికుడు. మనిషి మనీషిగా ఎలా మారాలో తెలుసుకోవాలంటే రమణగారి జీవితాన్ని ఒక్కసారి పలకరించాల్సిందే.

రైతు దేశానికి వెన్నెముక. కాబట్టే ఆ నేపథ్యం నుంచి వచ్చినవాళ్ళు ముందుకు రాలేకపోతున్నారు అన్నది అపోహేననీ ఆశయాల నిచ్చెన గట్టిగా ఉంటే ఆకాశం అందుతుందనీ, లక్ష్యం గట్టిగా ఉంటే పర్వతమైనా లొంగితీరుతుందనీ నిరూపించిన రైతుబిడ్డ. భారతదేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి తెలుగువారి వెలుగు పతాకను సగర్వంగా ఎగురవేశారు జస్టిస్ రమణ. ఆయన పేరుముందు న్యాయవాది అనే విశేషణంతో మొదలై భారత ప్రధాన న్యాయమూర్తి అనే ఉపనామం అలంకరించడానికి అచంచల దీక్ష, పట్టుదలలే కారణం.

జస్టిస్ వెంకట రమణ, మొదట అందరిలాగే ఒక సాధారణ న్యాయవాది. నల్లకోటును వృత్తికి అలంకారంగా కాక బాధ్యతకు గుర్తుగా స్వీకరించారు. అయితే వారికి ఉన్న బలం, ఆత్మబలమే. తాను ఎందులోనూ తక్కువ కాదనీ అలాగే తనకంటే ఇతరులు ఏమీ ఎక్కువ కాదనీ, సంకల్పం దృఢంగా ఉంటే కన్న కల అందకుండా పోదని నమ్మి, అందుకోసం శ్రమించారు కూడా. ఆయన ఎప్పుడూ వ్యక్తిగా పని చెయ్యలేదు. తానే ఒక సైన్యంగా తనగురించి తాను పూర్తిగా తెలుసుకున్నాడు. పట్టుదలనే స్ఫూర్తిగా మలుచుకున్నాడు. అందుకే తాను ఎంచుకున్న రంగమే అతడికి వశమై అత్యున్నత స్థానానికి చేర్చింది.

ఇంట గెలిచి రచ్చ గెలవమన్నది సామెత. అవును, ముందు ఎవరి ప్రాంతాలను వాళ్ళు క్షుణంగా తెలుసుకోవాలి. జస్టిస్ రమణ చేసిందీ అదే. ఒక ప్రాంతీయ న్యాయవాదిగా ఉంటూ ఆ ప్రాంతంపై పట్టు పెంచుకున్నాడు. నైపుణ్యాలను తెచ్చుకున్నాడు. కొన్ని ప్రాంతాలు కలిస్తేనే ఒక దేశం. ఒక ప్రాంతంపై అవగాహన ఉన్నవాడికి దేశంపై అవగాహన పెంచుకోవడం అసాధ్యమేమీ కాదు. ఆ ప్రాంతంలో కూడా మట్టిలో నానిన జీవితాలు వ్యవసాయంతో పెనవేసుకున్న పరిచయాలే ఆయన్ని సమున్నతుడిగా నిలబెట్టాయి. ఆయన తల్లిదండ్రులు (కీ.శే. గణపతిరావు, కీ.శే. సరోజినీదేవి) ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణాజిల్లాలోని సామాన్య రైతు కుటుంబానికి చెందినవాళ్ళు.

లోకంలో వ్యవసాయాన్ని మించిన ఉత్కృష్టమైన పనీ సాహసోపేతమైన పనీ మరొకటి లేదంటారు. రైతు పడే కష్టంకంటే ప్రధానన్యాయమూర్తి పడే కష్టం ఎంతమాత్రమూ ఎక్కువ కాదంటారాయన. ఇంతటిలోతైన దృష్టీ దానినుంచి అలవడిన నిశిత పరిశీలనే ఆయనకు న్యాయవాదం అంటే సమన్యాయాన్ని అందించటమేననీ అది ఒక

నమ్మకం మాత్రమే కాదు, ఒక బాధ్యత కూడానని చెబుతుంటారు. ఇదే నేటికీ ఒక సాధారణ మనిషిగా రైతుబిడ్డగా ఉండేలా ఆలోచించేలా మాట్లాడేలా ఆచరించేలా చేసింది అంటారు. ఇనుము నిప్పులో కాలినప్పుడే మెత్తనవుతుంది, అప్పుడే కోరుకున్న పనిముట్టుగా సాగుతుంది. అలాగే జీవితంలో అనుభవించిన కష్టాలూ అనుసరించిన సాధారణమైన జీవితమే ఆయనకు సరళతను నేర్పాయి. దేన్నైనా ఇట్టే ఆకళింపు చేసుకోవడం చేసుకున్నదాన్ని సోపపత్తికంగా విశ్లేషించడం, విశ్లేషించినదాన్ని విశదం చెయ్యడం ఆయనకు మాతృభాషాధ్యయనం వల్లనే అలవడ్డాయి. అవే ఆయన న్యాయమూర్తిగా నిలదొక్కుకోడానికీ ఇచ్చిన తీర్పులకు కూడా సరళతనూ స్పష్టతనూ సంపాదించిపెట్టాయి.

పల్లెటూరి జీవితం సమతుల్యతకు పెట్టింది పేరు. ఒకరిపై ఒకరు ఆధారపడడం, అన్నింటినీ సమానంగా చూడడం, ఇచ్చిపుచ్చుకోవడం వల్లే జీవితానికి పట్టుగొమ్మలు. అదే, న్యాయవిధానంలో సమతుల్యతను ఎలా సాధించాలో నేర్పింది అనేది ఆయన మాటల్లో వినబడుతుంది. ఇక పుట్టిన నేల మాత్రమే కాదు తెలుగు భాష అన్నా తెలుగు సాహిత్యమన్నా ఆయనకు అంతులేని అభిమానం. ఆ అభిమానమే విషయాన్ని వేగంగా సమగ్రంగా సంపూర్ణంగా ఎలా నేర్చుకోవాలో బోధించింది. చెరువులోని చేపపిల్లకి ఈత నేర్పడం ఎంత సులువో అమ్మభాషలో చదువుకున్నవారికి విజ్ఞానం నేర్పడం అంత సులువని నిరూపిస్తూ, తనలోనే అంతులేని శక్తి ఉందని తెలుసుకొని ఆ శక్తిని వెలికి తీసి దానికి పుస్తకాలతో మెరుగులు దిద్దుకున్నాడు. తాను వెలుగులోనికి వెళ్ళడమే కాదు తనతోపాటు ఉన్న ఎందరికో వెలుగు వాకిళ్లు తెరిచాడు. ఆ వెలుగు వెంట వడివడిగా నడిచి ఈ రోజు ఇంతటి అత్యున్నత శిఖరానికి చేరుకున్నాడు.

అవిభక్త ఆంధ్రప్రదేశ్ జుడీషియల్ అకాడెమీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు దిగువ న్యాయస్థానాలలో తెలుగును అమలుపరిచేందుకు వీలుగా న్యాయవాదులనూ తెలుగు భాషావేత్తలనూ, విలేఖరులనూ కలిపి సదస్సులను ఎన్నింటినో నిర్వహించడం, ఇంగ్లీషు-తెలుగు డిజిటల్ న్యాయపదకోశాన్ని తయారుచేయించి ప్రజాస్వామ్యంలో ప్రజలభాషలో పనులు జరగాలనే న్యాయసూత్రానికి మెరుగులద్దే ప్రయత్నం చేశారు.

అందరికీ అన్నీ సమకూడాలి, బతకడానికి కావలసినవన్నీ అందుకోవడం అందరి హక్కు. ఆ హక్కు అందరికీ గౌరవప్రదంగా అనుభవంలోకి రావాలి అనే ఆలోచనా పరంపరలే ఆయనను న్యాయ విద్యా శిక్షణకు పురికొల్పాయి. న్యాయవాద వృత్తిని భుక్తికి గాక తాను మెచ్చిన సమతావాదానికి వెన్నెముకగా మార్చుకొని బడుగువర్గాలకు చేరాల్సిన సామాజిక న్యాయంకోసం పాటుపడడం మొదలుపెట్టాడు. న్యాయవాది రమణ తనను తానే సమన్యాయానికి చిరునామాగా మలుచుకున్నాడు. చిన్ననాటినుండే రైతుల ఇబ్బందుల్నీ, కార్మికుల కష్టాలనూ, సామాజిక సమస్యలనూ అర్థంచేసుకుని ఎప్పటికప్పుడు స్పందిస్తూ విద్యార్థి నాయకుడై ఎవ్వరూ వెయ్యలేని కొత్త అడుగును సంక్షేమం దిశగా వేసి సమస్యల మలుపుల్లో పరిష్కారాల మైలురాళ్ళను పాతుతూ సాగారు. అందుకనే న్యాయకోవిదులు కొందరు ఆయనను క్రియాశీలుడైన భావుకుడని కొనియాడారు.

ఉలి దెబ్బకు బెదిరిపోతే శిల- గుడిమెట్టై కాలికింద నలిగిపోతుంది. కానీ, ఎన్ని ఉలి దెబ్బలనైనా ఓర్చుకోగలిగితే అది గుడిలో దేవతగా నీరాజనాలను అందుకుంటుంది. అందుకే అత్యవసర సమయంలో అంతటి గడ్డు పరిస్థితుల్నే ఎదుర్కొన్నాడు. అన్నింటినీ భరించి తన లక్ష్యాన్ని చేరుకొనేందుకు తన చుట్టూతా ఉన్న బెడదలను ఓర్చుకొంటూ ముందుకు సాగాడు. ప్రభాత సమయానికి భూమిని పెగిల్చుకొని వచ్చే మొలకలా తలయెత్తి నిలిచాడు.

కొంతకాలం ప్రముఖ తెలుగు వార్తాపత్రికకు విలేఖరిగా పనిచేసిన అనుభవమే న్యాయరంగంలోనూ ఆయన నిరంతర చైతన్యంతో పరిగెత్తే సెలయేరై సాగిపోయేలా చేసింది. అదే, చేసిన సంకల్పాలన్నింటినీ చిగురించే వరకూ విజయం సాధించేవరకూ నిలబడి పోరాడే తత్వాన్ని నేర్పింది. అందుకే ఆయనకు విజయమే ఆమనిగా స్వాగతించింది. అక్కణ్ణుంచి తిరిగి చూసుకోలేదు. న్యాయవాదిగా ఉన్న ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అదనపు అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. అప్పుడూ సామాజిక సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనే చురుకుదనం ఏమాత్రం తగ్గలేదు. ఒక సైన్యంలా ఆయన సాగించిన ప్రతి పోరాటంలోనూ రణరంగమే ఎదురొచ్చి తలవంచింది.

హైకోర్టు న్యాయమూర్తిగానూ, ప్రధాన న్యాయమూర్తిగానూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగానూ ఆయన వెలువరించిన తీర్పులు ఎప్పుడూ ఊహాతీత పరిష్కారాల ఆవిష్కరణకు అద్దం పడుతుంటాయి. ప్రగతిశీల నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన చూపించిన ధైర్యసాహసాలు చిరస్మరణీయాలు. రాజ్యాంగం మరియు వాణిజ్య చట్టాల పరిధిలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు న్యాయకోవిదుల మన్ననల్ని పొందాయి.

అనురాధ భాసిన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు, కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్‌లో ఏడాది పొడవునా అంతర్జాల నిషేధంపై జస్టిస్ రమణ ఇచ్చిన తీర్పులు ప్రగతిశీలమైనవి. అంతేగాక, అంతర్జాల స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా ప్రకటించడం, ఆధునిక అవసరాలను గుర్తిస్తూ తీర్పులకు సమగ్రతను జోడించటం ఆయన ప్రత్యేకత. సుప్రీంకోర్టు వర్సెస్ సుభాష్‌చంద్ అగర్వాలా తీర్పులో భారత ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో పారదర్శకతకు పెద్దపీట వేశారు. శివసేన వర్సెస్ మహారాష్ట్రలో, చట్టసభా పరీక్షను నిర్వహించడానికి ఆయన ఇచ్చిన తీర్పు చట్టసభ్యుల కొనుగోళ్లనూ

మారకాన్ని నివారించడానికి మార్గం సుగమం చేస్తూ రాజ్యాంగ నైతికతను పునరుజ్జీవింపజేసిన తీర్పుగా ప్రశంసలు పొందింది. ఇటీవల, అశ్వనీకుమార్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియాలో ఆయన తీర్పు సాహసోపేతం. వాణిజ్యపరంగా వ్యాపార చట్టాల విషయాలపై స్పష్టమైన తీర్పులను అందించిన జస్టిస్ రమణ ఆలోచనలు వాణిజ్య ప్రపంచంలో స్థిరీకరణకు నాంది పలికాయి. ఇటీవల, విద్యా ద్రోలియా కేసులో, మధ్యవర్తుల నియామక దశలో కోర్టుల జోక్యం అనే సుదీర్ఘమైన సమస్యను ఆయన పరిష్కరించారు. వివిధ న్యాయ విద్వాంసులు- ఈ నిర్ణయాన్ని మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యతనివ్వడం ద్వారా దీర్ఘకాలిక కేసులను చాలావరకూ తగ్గించే అవకాశం ఉందని ప్రశంసించారు. ఆల్కాన్ వర్సెస్ సేలం కేసులో విదేశీ డిక్రీని అమలు చేయడానికి అనుమతించాలనే ఆయన నిర్ణయం భారతదేశంలో అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేసింది.

పరిహార సంబంధిత కేసులలో గృహిణుల ఆదాయాన్ని నిర్ణయించడంలో న్యాయస్థానాలు వారి శ్రమ, సేవలు మొదలైన త్యాగాలకు విలువనివ్వాలని పేర్కొనడం మరో పురోగామి తీర్పు. పురుషులతో పోల్చితే మహిళలు ఇంటి సభ్యుల సంరక్షణ కోసం ఎలాంటి చెల్లింపులూ లేకుండానే ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తారు అంటూ చెప్పిన ఈ తీర్పు మన న్యాయ వ్యవస్థలో సామాజిక పరమైన పురోగమనానికి సంకేతం.

ఇలా తన పదవీకాలంలో లక్ష్యాలను సాధించడానికి న్యాయవిధానంలో ఒక సులభతరమైన మార్గాన్ని అందించడం ఆయనకు ఒక కొత్త గుర్తింపును తెచ్చిపెట్టింది. భారతదేశంలో బలమైన న్యాయసహాయ సంస్కృతిని అభివృద్ధి చేయడానికి వివిధ కార్యక్రమాలను చేపట్టిన రమణ మార్గదర్శకత్వంలో ప్రపంచవ్యాప్తంగా న్యాయపరంగా మౌలికమైన మార్పులకు నూతన శకం ప్రారంభం కానున్నదని చెప్పవచ్చు. 130 కోట్ల మంది జనాభా కలిగిన భారతదేశ న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే మహోన్నత వ్యవస్థగా పేరుపొందింది. దేశంలో నేరుగా పేద బడుగు వర్గాల కక్షిదారుల తలుపుతట్టి న్యాయం అందించే బాధ్యతతోపాటు, న్యాయం అనేది కష్టాల కడలి కాగూడదని సత్వర న్యాయంకోసం మొత్తం దేశంలోనే న్యాయపరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆయన ఆకాంక్ష. అందుకోసం జాతీయ న్యాయవనరల పేరిట ఒక ప్రత్యేక ప్రయోజనాలను చేకూర్చే వ్యవస్థకు అంకురార్పణ చేయాలని ఆయన సంకల్పం.

**సమున్నత లక్ష్యాలతో సాగుతున్న జస్టిస్ రమణగారి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి అటు రాష్ట్రాలకూ - కేంద్రానికీ, ప్రజలకూ మధ్య న్యాయపరమైన వారధి అవుతుందని ఆశిద్దాం. అలాగే ప్రపంచీకరణ నేపథ్యంలో పడి కొట్టుకుపోకుండా అమ్మనుడి కోసం సొంత అస్థిత్వంకోసం పరితపిస్తున్న భాషాసమూహాలకూ వారి తీర్పులు మరింత వికాసాన్ని కలిగిస్తాయనీ, భాషాపరంగా మాతృభాష అవసరాన్ని ఒక అమ్మభాష ఆరాధకుడిగా గుర్తించి, ప్రోత్సహిస్తారని ఆశిద్దాం.**

**పుస్తక పరిచయం**

# కరోనా@ లాక్‌డౌన్. $360^0$




ప్రపంచానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది మహమ్మారి కరోనా. "కోవిడ్-19" బతుకుల్ని అతలాకుతలం చేసింది. ఎన్నో విషాద ఘటనలు, మరెన్నో హృదయవిదారక దృశ్యాలు, కక్కలేక మింగలేక జీవనం సాగిస్తున్న సమయంలో 'లాక్‌డౌన్' వచ్చిచేరింది. వేగంగా పయనిస్తున్న ప్రగతిరథం ఒక్కసారిగా ఆగింది. సమాజం భారీ కుదుపులకు గురైంది. ప్రజాఆరోగ్య రంగం కరోనాకు చికిత్స చేయడంలో పెక్కు సవాళ్ళను ఎదుర్కొంది. అత్యవసర వస్తువుల ఉత్పత్తి కుంటిపడి, ఉత్పత్తుల సరఫరా గొలుసు అస్తవ్యస్తమై ఆర్థిక రంగం విలవిలాడింది. పూర్తిస్థాయి సర్వీసులను అందజేయలేని స్థితికి సేవారంగం పడిపోయింది.

చైనాలో వూహాన్‌లో పుట్టిన కరోనా క్రమంగా ప్రపంచంలోని అన్ని దేశాల్ని చుట్టుముట్టింది. వెల్లువలా విరుచుకుపడిన కోవిడ్-19 ఉపద్రవంతో సమాజం ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. కంటికి కనిపించని సూక్ష్మాతి సూక్ష్మంగా ఉండే జీవినే మనం వైరస్ అంటున్నాం. వైరస్‌కు విరుగుడు వాక్సిన్. శాస్త్రవేత్తలు ఫార్మా కంపెనీలు వాక్సిన్ కనుగొనేలోపే ఎన్నో మరణాలు సంభవించాయి. మొత్తం ప్రపంచంలో కరోనాను కట్టడిచేసి నిలువరించింది క్యూబా దేశం. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిచ్చి కరోనా విముక్తి దేశంగా నిలబడింది. కానీ కరోనా తొలి విలయ తాండవానికి బలై ఎక్కువగా నష్టపోయింది- అమెరికా, బ్రెజిల్ వంటి దేశాలు. భారతదేశంలో కరోనా దెబ్బకు ఎక్కువగా గురైంది మహారాష్ట్ర, కరోనా కట్టిడిచేసి మానవహానిని తగ్గించింది కేరళ రాష్ట్రం.

కరోనా యుద్ధంలో ముందువరసలో నిలిచి, కరోనా కట్టడికి వైద్యులు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు అందించిన సేవలు అపూర్వమైనవి. తొలి కోవిడ్ సంక్షోభ సమయంలో దొరికిన తీరిక సమయాన్ని కవులు, రచయితలు- తోచిన రీతిలో తమ సృజనాత్మకను ప్రదర్శిస్తూ రచయలు చేశారు. అయితే జర్నలిస్టు కోడం పవన్‌కుమార్ వినూత్న రీతిలో ఈ పుస్తకాన్ని రచించారు. ఇందులో 59 వ్యాసాలున్నాయి. ఒక్కొక్క రంగంపై కోవిడ్ ప్రభావం ఎలావుందో వివరించి, విశ్లేషించి రచయిత ఈ పుస్తకానికి ప్రత్యేకతను చేకూర్చారు. ఇందుకై ఒక జర్నలిష్టుగా కోడం పరవన్‌కుమార్ చేసిన కృషి గొప్పది. ప్రతి ఒక్కరు చదవలసిన పుస్తకం. పుటలు 194, వెల: 150రూ. ప్రతులకు: లయ పబ్లికేషన్స్ ఇంటి నెం: 3-12-110/బి గణేష్‌నగర్, రామంతాపూర్, హైదరాబాద్-500013, సెల్ : 9848992825.

**- డా॥వెన్నిసెట్టి సింగారావు, 939301 5584**

సి.పి.కుమార్
93965 14554

# తెలుగు భాషాబోధన - ఒక పరిశీలన

**నే**నొక సాఫ్ట్‌వేర్ ఇంజనీరుని. పాతికేళ్ళ కిందట ప్రాథమిక ఉన్నత పాఠశాల చదువుల్ని నా మాతృభాష తెలుగు మీడియంలోనే పూర్తిచేశాను. ఒక విషయాన్ని అర్థం చేసుకోవడంలోను, పరభాషలను నేర్చుకోవడంలోను మాతృభాషకున్న సౌలభ్యం ఎలాంటిదో స్వయంగా అనుభవం ఉంది. నా పిల్లల్ని కూడా కనీసం ప్రాథమిక విద్యనైనా మాతృభాష మాధ్యమంలో చదివించాలనుకున్నాను.

నేను ఉద్యోగం చేస్తున్నది బెంగళూరులో. అక్కడ తెలుగు మీడియం స్కూళ్లు లేవు. ఒకటి రెండు చోట్ల ప్రభుత్వ స్కూళ్లు ఉన్నా ఉపాధ్యాయుల కొరతా, అరకొర వసతులు ఉన్నందు వల్ల ఆంధ్రప్రదేశ్‌కు మకాం మార్చాలనుకున్నాను. ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, వదులుకొని ఇంటి నుండి పని చేయడానికి కంపెనీ దగ్గర అనుమతి తీసుకొని విజయవాడకు కుటుంబాన్ని మార్చాను. పోరంకి వికాస విద్యావనం పాఠశాలలో పిల్లల్ని చేర్పించాను. ఇది ఐదేళ్ళ కిందటి సంగతి. తెలుగు మీడియంలో ఆడుతూ, పాడుతూ ఐదవ తరగతి పూర్తి చేశారు. గత సంవత్సరం ఆరో తరగతిలో ఒక ప్రైవేటు ఇంగ్లీషుమీడియం స్కూల్లో చేర్పించాను. ఐదవ తరగతి వరకు ఒక భాషగా ఇంగ్లీషును కూడా బాగా నేర్పించారు గనుక ఆరవ తరగతి ఇంగ్లీషు మీడియం అయినప్పటికీ ఇబ్బంది పడలేదు. అంతా బాగానే ఉంది. మరి సమస్య ఏమిటి? ఇప్పుడు సమస్యంతా తెలుగు పాఠాలతోనే. ప్రస్తుతం ఆన్ లైన్ క్లాసులు కదా! తల్లిదండ్రుల సహకారం కూడా అవసరం. నేను అన్ని సబ్జక్టుల్లో సహకరించ గలుగుతున్నాను. కానీ తెలుగులో మాత్రం పిల్లవాడు అడిగిన విషయాలు చెప్పలేక, నాకు అర్థం కాక తెల్లమొఖం వేస్తున్నాను.

హైస్కూలు వరకు తెలుగు మీడియంలో చదివిన నేను ఒక ఆరవ తరగతి విద్యార్థికి తెలుగులో సహకరించలేకపోవడానికి కారణం ఏమిటి? పుస్తకం కఠినంగా ఉందా, లేదా టీచర్ బోధనే కఠినంగా ఉందా? ఒకసారి ఆరవ తరగతి తెలుగు పాఠ్యపుస్తకాన్ని పరిశీలించాలనుకొన్నాను. బోధనలో నాకేమీ అనుభవం లేదు. నేను విమర్శకుడినీ కాదు. మాతృభాషపై మమకారంగల వ్యక్తిగా, ఒక విద్యార్థి తండ్రిగా తెలుసుకోవాలనే కుతూహలం కొద్దీ ఆరవ తరగతి పాఠ్యపుస్తకాన్ని క్షుణంగా పరిశీలించాను. నాకొచ్చిన సందేహాలను కొద్దిమంది మిత్రులతో పంచుకొన్నాను. కొంతమంది విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను అడిగాను. అందరి అభిప్రాయాలను తీసుకొని నా పరిశీలనాంశాలను తెలియజేస్తున్నాను.

**తెలుగు బాట 6** -ఇది పాఠ్యపుస్తకం పేరు. పుస్తకంలో వంద పేజీలున్నాయి. మొత్తం పాఠాలు 12. రెండు ఉపవాచకాల పాఠాలను కూడా పాఠ్యపుస్తకంలోనే ఇచ్చారు. ప్రతీపాఠానికి అనుబంధంగా చదవండి, ఆనందించండి అని చిన్న చిన్న కథనో గేయాన్నో ఇచ్చారు. 9వ పాఠం ధర్మనిర్ణయం. పాఠం పరిచయం చేయడానికి ముందుగా ఒక చిన్న చిత్ర కథనిచ్చారు. ఇది అంత బాగాలేదు.

అందరికీ పరిచయమైన ఆవు పులి కథ. ఎంతో కరుణారసాత్మకమైనది. సత్య సంధతకు సంబంధించినది. దీన్ని అతి పేలవంగా 4 బొమ్మల్లో చూపించారు. అందులో కూడా ఆవు స్థానంలో జింకను చేర్చారు. ప్రసిద్ధమైన గొప్ప కవుల కథలను ఇలా మార్చడం బాగాలేదు. ఇదొక్కటి మినహా పాఠాలతో సమస్యలేదు- సమస్య అంతా వ్యాకరణంతోనే.

**అభ్యాసాలు:** అభ్యాసాలు రకరకాలు ఉన్నాయి. పిల్లలు ఆలోచించాల్సినవి, అడిగి తెలుసుకొని రాయాల్సినవి ఉన్నాయి. వీటితో కూడా సమస్యలేదు. సమస్యంతా వ్యాకరణాంశాలతోనే. ఇన్ని బాగుండి ఒక్క వ్యాకరణాంశాలతో వచ్చే నష్టమేముంది అనుకోవచ్చు. ఇవి ఎంతకఠినంగా ఉన్నాయంటే తెలుగు పాఠాలలో ఉన్న మంచిని, తెలుగుపై ఉన్న అభిమానాన్ని తుడిచిపెట్టేంతగా ఉన్నాయి. నేను విద్యార్థులను, టీచర్లను కూడా అడిగిచూసాను. అంతా పెదవి విరిచేవారే. ఇవి అనవసరమనేవారే. ఏవో నాలుగు సంధులు, ప్రకృతి వికృతులు వంటి నాలుగు రకాలు కాదు. మేము చదివే రోజుల్లో పదో తరగతిలో కూడా ఇవి లేవు. ఎన్ని రకాల వ్యాకరణాంశాలున్నాయో చూడండి.

1.అచ్చులు 2.హల్లులు 3.హ్రస్వాలు 4.దీర్ఘాలు 5.పరుషాలు, 6.సరళాలు 7.ద్విత్వాక్షరాలు 8.సంయుక్తాక్షరాలు 9.పర్యాయపదాలు 10.వ్యతిరేకార్థపదాలు 11.అనునాసికాలు 12.వర్గ యుక్కులు 13.వర్గాక్షరాలు 14.అంతస్థాలు 15.ఊష్మాలు 16.స్థిరాలు 17.స్పర్శాలు 18.కంఠవ్యాలు 19.తాలవ్యాలు 20.మూర్ధన్యాలు 21.దంత్యాలు 22.ఓష్ఠ్యాలు 23.కంఠతాలవ్యాలు 24.కంఠోష్ఠ్యాలు 25.దంతోష్ఠ్యాలు 26.ప్రకృతులు 27.వికృతులు 28.తెలుగు సంధులు 29.సంస్కృత సంధులు 30.ఉత్వసంధి 31.అత్వసంధి 32.ఇత్వసంధి 33.సవర్ణదీర్ఘసంధి 34.గుణసంధి 35.భాషాభాగాలు 36.నామవాచకం 37.సర్వనామం 38.విశేషణం 39.అవ్యయం 40.సంధి 41.వైకల్పికం 42.యడాగమం 43.సమాసం 44.ఉత్తరపదం 45.పూర్వపదం 46.ద్వంద్వసమాసం 47.విగ్రహవాక్యం 48.అన్ని విభక్తులు 49.సామాన్యవాక్యం 50.సంయుక్తవాక్యం 51.సంశ్లిష్టవాక్యం.

ఇన్ని అంశాలున్నాయని చాలా మందికి తెలియకపోవచ్చు. వీటిలో టీచర్లు, పండితులు ఎన్ని చెప్పగలరో ఆలోచించండి. పిల్లలకు ఇవి అవసరమా? భాషాశాస్త్రవేత్తలకు అవసరమైన విషయాలు ఇవన్నీ. టీచర్ అవగాహనను బట్టి ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి ఈ వ్యాకరణాంశాలను పక్కనబెట్టవచ్చు. కానీ అలాంటిదేమీ

కనిపించడంలేదు. తెలుగు పాఠాలను ఎలా బోధిస్తున్నారోచూద్దాం.

**తెలుగు పాఠాల బోధన :** ఈ స్కూలు ఆ స్కూలు అని లేదు. ప్రైవేటు స్కూలు ప్రభుత్వ స్కూలు అని లేదు. చిన్నది పెద్దది అని లేదు. అన్ని పాఠశాలల్లో తెలుగు బోధకులు ఒకే మాదిరిగా బోధిస్తున్నారు. అదేమిటంటే పాఠం చదువుతూ వ్యాఖ్యానిస్తూ ఉంటే పిల్లలు వింటూ ఉండడం.

పంచాంగ శ్రవణంలా పురాణ కాలక్షేపంలా విద్యార్థులు ఎంత కాలం వినాలి? టీవీల్లో ల్యాప్‌ట్యాపుల్లో సెల్‌ఫోన్లలో ఎక్కడ చూసినా వినడమే. దీని వలన ఎంత విసుగు కలుగుతుందో చదువు మీద ఎంత వ్యతిరేకత పెంచుకుంటారో ఆలోచించే వాళ్ళే లేరు. స్వయంగా ఆలోచించే అలవాటు నశించి ఇష్టమున్నా లేకున్నా అర్థంచేసుకోకుండా అంగీకరించడమనే స్వభావంలోకి వెళ్ళిపోతారు. పాఠ్యపుస్తకం పిల్లలు చదివి అర్థం చేసుకోడానికి తయారు చేసింది. పిల్లలు స్వయంగా చదవాలి. అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి. అర్థంగాకపోతే తోటి విద్యార్థులనో ఉపాధ్యాయుడినో అడగాలి. విద్యార్థులు చదివిన తర్వాత పాఠంపై ఉపాధ్యాయుడు చర్చపెట్టాలి.

కథలతో పద్యాలతో గేయాలతో వ్యాసాలతో ఉన్న తెలుగు వాచకాలు స్వయంగా చదివి అర్థంచేసుకొని ఆనందించలేకపోతే ఇతర సబ్జెక్టుల సంగతి ఏమిటి?

గతంలో తెలుగు భాషాబోధన వేరు. పాఠాలన్నీ ప్రముఖ కవులు రాసిన పద్యాల్లో, గ్రాంధిక కావ్య భాషల్లో ఉండేవి. ఆ భాష విద్యార్థులకు అర్థమయ్యేదికాదు. అందువలన తెలుగు పండితులు చదివి అర్థంచెప్పి విపులీకరించేవారు. ఇప్పుడు పాఠాలన్నీ వాడుకభాషలో సులభశైలిలో ఉన్నాయి. ప్రాథమిక తరగతుల్లో చదవడం నేర్చుకొన్న ప్రతీవిద్యార్థి అర్థంచేసుకోగలడు. స్వయంగా చదివి అర్థంచేసుకునే ప్రయత్నంలో ఆనందిస్తారు. చెరువుల్లో బావుల్లో ఈత నేర్చుకుంటున్న పిల్లల్లా ఆనందిస్తారు. స్వయంగా చదవడం అర్థంచేసుకోవడం ఒక అభ్యాసంగా అలవాటుగా మారుతుంది. తెలుగుపై మక్కువ కలుగుతుంది. విద్యార్థి భవిష్యత్తుకు తెలుగు భాషావికాసానికి ఇది ఎంతో అవసరం.

పిల్లలు అర్థంచేసుకోగల విషయాలుకూడా టీచరే చదివిచెప్పి టీచరే ప్రశ్నలకు జవాబులు చెప్పి పిల్లల్ని చేతగానివాళ్లగా మార్చడం ఎవరికి ఉపయోగం? ఇది ఎలా ఉందంటే నడవగల్గిన పిల్లల్ని ఎత్తుకొని తిరిగినట్లు ఉంది. ఈ బోధనా పద్ధతి మారాలి. ఈ బోధనగురించి టీచర్లుకు కొన్ని సూచనలు పాఠ్యపుస్తకం ముందు పేజీల్లో ఉన్నాయి. వాటి వివరాలు, కూడా చూద్దాం.

**సూచనలు :** పాఠ్య పుస్తకం ముందుపేజీల్లో టీచర్లకు, విద్యార్థులకు కొన్ని సూచనలు ఇచ్చారు. ఇవి చాలావరకు బాగున్నాయి. కానీ ఆచరణలో వాటిని పాటించడంలేదనేది వాస్తవం. అవేమిటో చూద్దాం.

1.పాఠశాలలో చేరగానే అంటే కొత్తక్లాసు ప్రారంభంలో పరీక్ష పెట్టి ప్రతీవిద్యార్థి స్థాయిని అంచనావేయాలి. ఇది ఎక్కడా జరగడంలేదు.

2. అన్ని రాతపనులు స్కూల్లోనే పూర్తిచేయాలి. ఇది సగం కూడా జరగడం లేదు. సగం పైగా ఇంటిపనికి ఇస్తున్నారు.

3.లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తీసుకొని చదవమన్నారు. ఇది పదిశాతం స్కూళ్ళలో జరుగుతున్నదేమో. చాలా స్కూళ్ళలో గ్రంథాలయాలు లేవు. ఉన్నా వాటిని ఉపయోగించరు. గ్రంథ పఠనం వ్యక్తి వికాసానికి అవసరమనే విషయం ఎవరికీ నమ్మకం లేదు. అసలు లైబ్రరీ పీరియడే లేదు.

4. భాషా బోధనలో తప్పనిసరిగా వివిధ ప్రక్రియలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యాసాలు, లేఖలు, నాటకీకరణ, ఏకాపాత్రాభినయం, గేయాలు పాడుతూ అభినయించడం, పద్యాలను రాగయుక్తంగా చదవడం, వార్తలు, నినాదాలు, ప్రకటనలు, కరపత్రాలు, పోస్టర్లు రూపొందించడం ఇవ్వన్నీ పిల్లలకు పరిచయం చేయాలని సూచించారు. దాదాపు 90 శాతం పిల్లలకు చెప్పరు.

5. స్వంతపని జట్టుపని ఇవేమి సక్రమంగా జరగవు. బాగారాసిన పిల్లల నోట్‌బుక్స్ చూసి రాయలేని పిల్లలచేత రాయిస్తారు.

ప్రతీస్కూల్లో జరిగేది ఒక్కటే. ప్రశ్నలకు జవాబులు టీచర్ చెబుతారు. పిల్లలు వాటిని బట్టీ పడతారు. పరీక్షలు పెడతారు. మార్కులు వేస్తారు. ఏ సబ్జక్టయినా, ఏస్కూలైనా జరిగేది ఇదే.

మారాల్సింది పాఠ్యపుస్తకాలు మాత్రమే కాదు. బోధన మారాలి. ముఖ్యంగా తెలుగు భాషాబోధన పాతధోరణిని నుండి బయటపడాలి. తెలుగులో బోలెడన్ని పుస్తకాలున్నాయి. పిల్లలు స్వయంగా వాటిని చదవాలి. ఎందుకంటే భవిష్యత్తులో తెలుగు భాషను నిలబెట్టాల్సిన వారు, తెలుగులో రచనలు చేయాల్సినవారు ఈనాటి విద్యార్థులే గదా! ఎలాగూ తెలుగు మీడియంకు ఎసరు పెట్టారు. ఒక్క సబ్జెక్టుగానైనా తెలుగు మిగులుతుందా!

**తెలుగు భాషా బోధన మారకపోతే కష్టం.**

తప్పెవరిది? టీచర్లమీద నెపం నెట్టేసి చేతులు దులుపుకోవడం సరికాదు. వాళ్లకు తెలిసింది, అనుభవంలో ఉన్నదేదో అదే చేస్తున్నారు. సిలబస్ పూర్తిచేయడం పరీక్షలకు సిద్ధం చేయడమనే వత్తిడిలో ఉంటారు. తీరిగ్గా పిల్లల చేత చదివించి తరగతిలో చర్చపెట్టి పిల్లలే స్వయంగా ప్రశ్నలు జవాబులు రాసుకోవడం అనే కార్యక్రమం చాలా ఆలస్యమవుతుందనేది వాస్తవం. పిల్లలకు ఎంత ఉపయోగం అనేదానితో నిమిత్తంలేకుండా టీచర్లకు స్కూళ్ళకు ఏది సౌలభ్యమో అదే చేస్తున్నారు.

టీచరు 10 పాఠాలు చెప్పడం కంటే పిల్లలు స్వయంగా ఒక్క పాఠం చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ఎక్కువ ప్రయోజనం.

పిల్లలకూ, సమాజానికీ, తెలుగు భాష భవిష్యత్తుకూ మేలైన పద్ధతులేవో అవి తెలుగు సమాజం గుర్తించాలి.

అ

> "దేశభాషాభిమానము తోడిదే దేశాభిమానము. ఏ కులమువారైనా, ఏ మతమువారైనా, ఏ దర్జావారైనా తెలుగు మాతృభాషగా గలవారందరూ ఒక్క సంఘమువారనిన్ని, సంఘములోని వారందరూ అభివృద్ధిపొందితేనే కాని, సంఘము అభివృద్ధిపొందదనిన్ని. ఎవరు వెనుకబడ్డా సంఘమునకు నష్టమే అనిన్ని, ఎవరు త్రికరణశుద్ధిగా భావిస్తారో వారే దేశాభిమానము గలవారని చెప్పవలెను."
>
> – గిడుగు వేంకటరామమూర్తి (తెలుగు పత్రికల సంపాదకులకు వ్రాసిన లేఖలో)

జె. డి. ప్రభాకర్
8500227185

# సమసమాజ స్థాపనకు ఎటువంటి విద్య అవసరం?

**ఆ**కలి కోసం వదిలేసిన చదువులూ, ఆకలి తీర్చని చదువులూ ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ ఉన్నాయి. విజ్ఞానం, అభివృద్ధి దిశగా నడిపించే విద్యా వ్యవస్థను వాటి నుండి దూరంపెంచే కారకాల గురించి లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. మన దేశంలోకి శత్రు సమూహాలు రాకుండా దేశ సరిహద్దుల్లో పకడ్బందీగా సైన్యాన్ని కాపలా పెట్టి ఎలా దేశాన్ని రక్షించుకుంటామో, టెర్రరిస్టులు దేశంలోకి ప్రవేశించి బాంబులు వేసి చంపకుండా బలమైన అంతర్గత నిఘా వ్యవస్థను ఎలా ఏర్పాటు చేసుకుంటామో, నైతిక విలువలు కలిగిన విద్యా వ్యవస్థను నిర్మించుకోవడం అంతకంటే ముఖ్యమైనది. ఎందుకంటే నైతిక విలువలు లేని అనేకులు చీడ పురుగుల్లా సమాజాన్ని దోచుకుంటూ, చంపుతూ, నాశనం చేస్తున్నవాళ్ళు మన దేశం లోపలే ఉన్నారు. సమాజంలో వివిధ వ్యవస్థలలో ఉంటూ, ప్రజలని పాలిస్తూ, ప్రజల శ్రమను దోచుకుంటూ నిత్యం దేశాన్ని పేదరికంలోకి నెట్టేస్తూ కూడా వీళ్ళు ఎడాపెడా బతికేస్తున్నారు. దీనికి కారణం నైతిక విలువలూ, ప్రశ్నించే తత్వం ప్రజల్లో అనేకుల్లో కొరవడటం. చట్టాలను ఎంత కఠినంగా అమలుపరిచినా మనిషిలో నేర ప్రవృత్తి మారడమూ లేదూ, నైతిక విలువలు సిద్ధించడమూ లేదూ. కానీ సమాజంలో నెలకొన్న అసమానతలనూ, అక్రమాలనూ, నేరాలనూ రూపుమాపే శక్తి విద్యకు మాత్రమే ఉందనడంలో అతిశయోక్తి లేదు. దీన్ని నమ్మకపోవడం, సరైన విద్యను అందించకపోవడం వలన నేటి అసమానతల సమాజం మన కళ్లెదుటే పెరుగుతోంది.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, నేటికీ దోపిడీ, కులవివక్షా, మతకల్లోలాలూ, నక్సలిజం, నిరుద్యోగం, మానభంగాలూ, నిరక్షరాస్యా, పసిబిడ్డల చావులూ, ఆకలి చావులూ ఎందుకు ఉంటున్నాయి? ధనికులు ధనికులుగానే ఉంటూ పేదలు పేదలుగా ఎందుకు మిగిలిపోతున్నారు? నిత్యం మనల్ని వేధిస్తున్న ప్రశ్నలు ఇవి. అన్యాయానికీ, వివక్షతకూ గురవుతూ, వాటికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు వీడుతున్న గొంతుకలు ఎన్నో! ఈ దుస్థితి నాణ్యమైన నైతిక విలువలున్న విద్య ద్వారా మారుతుందని నమ్మడంలో విఫలమవుతున్నాము.

**ఫిన్లాండ్ విద్యావ్యవస్థ**

విద్యా వ్యవస్థ బాగుంటే దేశం కూడా అన్నిరంగాల్లోనూ ఆరోగ్యంగా ఎదుగుతుందనడానికి ఫిన్లాండ్ ఒక చక్కటి ఉదాహరణ. ఐక్యరాజ్యసమితి వార్షిక నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యంత సంతోషకరమైన దేశాల్లో మొదటి స్థానంలో వరుసగా నాలుగు సార్లు ఫిన్లాండ్ నిలిచింది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మానవుల అభివృద్ధి సూచి (హ్యూమన్ డెవలప్మెంట్ ఇండెక్స్), విద్యాసూచి (ఎడ్యుకేషన్ ఇండెక్స్) 2008 లో ఫిన్లాండ్ మొదటి స్థానాన్ని పొందింది. ఒకప్పుడు ఆర్థికంగా వెనుకబడిన దేశం అయినప్పటికీ కేవలం నాణ్యమైన విద్యతోనే దేశాన్ని సుభిక్షంగానూ, సంతోషంగానూ చేసుకున్నారు. చిన్న పిల్లలకు పరీక్షలూ, అసైన్మెంట్స్ పేరుతో భారాన్ని కలిగించకుండా స్వేచ్ఛగా పాఠ్యాంశాలు అవగతమయ్యేలా విద్యా వ్యవస్థను రూపొందించారు. ప్రౌఢ దశకు వచ్చేసరికి తమకు ఇష్టం వచ్చిన కోర్సులను ఎన్నుకొని నైపుణ్యాన్ని సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తారు. ఇక్కడ ముఖ్యంగా చెప్పుకోవాల్సింది అమ్మనుడి విద్యామాధ్యమం. నూటికి 90 శాతం మంది తమ అమ్మనుడి అయిన ఫిన్నిషులోనే మాట్లాడతారు, విద్యాభ్యాసం కూడా తమ అమ్మనుడిలోనే చేస్తారు. విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు అందరూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినవారే. విద్యా వ్యవస్థలో ఉన్న ప్రతి ఒక్క విషయాన్ని కూలంకషంగా పరిశీలించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు కాబట్టి ఆ దేశం ప్రతి విషయంలోనూ సంతోషంగా ఉంటోంది. మనం అటువంటి విద్యావ్యవస్థ నుండీ, అమ్మనుడి మాధ్యమవిద్య నుండీ స్ఫూర్తి పొందవలసిన అవసరం ఎంతో ఉంది.

**నైతికత నేర్పని విద్యలు:**

విద్యా వ్యవస్థలో విలువలు కొరవడ్డాయి. నేటి విద్య చాలామట్టుకు యంత్రాల తయారీ వాటి పనితనం గురించి మనుషులకు నేర్పిస్తోంది, కానీ తాను ఉన్న సమాజం ఎలా నిర్మితమైందో, దాని పనితీరు ఏ విధంగా ఉందో అవగాహన కలిగించలేకపోతోంది. ఉన్నత చదువులు చదువుకుని విమానయానాలు చేస్తున్నారు, కానీ వారిని పెంచి పోషించిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో అనాథలుగా చేరుస్తున్నారు. అంతరిక్షంలోకి వెళ్తున్నాము కానీ సాటి మనిషి యొక్క ఆంతర్యాన్ని గ్రహించలేకపోతున్నాము. ఎంత విద్యను ఆర్జించినా సమాజంలో ఎలా మెలగాలో తెలుసుకోలేకపోతున్నారు. దీనికి ప్రధాన కారణం, 4, 5వ ఏట నుండే ఐఐటి శిక్షణ అని పిల్లలను పూర్తిగా బాల్యానికి దూరం చేసి, సమాజం నుంచి వేరు చేసే ప్రక్రియను అనేక మంది తల్లిదండ్రులు అవలంబించడం తప్పునిసరి ఐంది. రోజుకి ఒక గంట స్నేహితులతో ఆడుకోవడానికి కూడా సమయం లేనంత జీవితాన్ని పరిచయం చేసుకుంటున్నారు. దీనివలన సంఘ జీవనానికీ సామాజిక ప్రవర్తనను నేర్చుకోలేని దుస్థితిలోకి నేటి తరాలు జారుకుంటున్నాయి. ఒకవైపు అక్షరాస్యత పెరుగుతున్నా మరోవైపు మనుషుల్లో నేరప్రవృత్తి పెరుగుతూనే ఉంది. అమానవీయతకు బీజాలు పడుతున్న విద్యార్థులను మార్చే ప్రయత్నం విద్యా వ్యవస్థ చేయలేకపోతోంది. నేటి బాలలే రేపటి పౌరులు అన్న జవహర్‌లాల్ నెహ్రూ గారి మాటలను గుర్తు చేసుకుంటూ నేటి బాలలకు నైతికమైన విద్య అందించినట్లయితే రేపటి ఉజ్వల భవిష్యత్తును నిజమైన మానవీయ సమాజాన్ని చూస్తాం. మొక్కై వంగనిది మానై వంగునా అన్న సామెత మనం వింటూ ఉన్నప్పటికీ దానికి సరి అయిన

న్యాయాన్ని విద్య ద్వారా చేయలేకపోతున్నాం. **నైతిక విలువలు ఉన్న విద్యని పిల్లలకి చిన్ననాటినుండే అందిస్తే వారిని నేర ప్రవృత్తికి దూరంచేసి, సమాజాన్ని మానవీయ కోణంలో చూపించే అవకాశం ఉంటుంది. అటువంటి పాఠాలను అమ్మనుడిలోనే పిల్లలకు నేర్పించడానికి ప్రయత్నాలు జరగాలి.**

**వీడని కులం కట్లు:**

మనమందరం దేశాన్ని ఎంతో ప్రేమిస్తున్నాము, కానీ దేశంలో ఉన్న ప్రతి మనిషినీ ప్రేమించడంలో విఫలమవుతున్నాం. దీనికి గల కారణం మనదేశంలో కొన్ని సామాజిక రుగ్మతలు నేటికీ కొనసాగటమే. వాటిని ఆచరిస్తూ వాటిని బ్రతికిస్తున్నవాళ్ళూ, ఇంకా వాటిని అసలు పట్టించుకోని జనం పెరుగుతూనే ఉన్నారు. దీని ఫలితమే మనదేశంలో కుల వ్యవస్థ జడలు విప్పిన మర్రిచెట్టులా అన్ని రంగాల్లోనూ కనిపిస్తోంది. ఇది విద్యా వ్యవస్థలో ఒక జడ పదార్థంగా తయారయింది. అంటే మనం నేర్చిన, నేర్పుతున్న విద్య సామాజిక రుగ్మతా దేనికవేలాగ తయారైనై. ఇది మన విద్యా వ్యవస్థ బలహీనతగా కనిపిస్తోంది. నేటికీ కుల వివక్షతకు గురై, విద్యలోనూ, ఉద్యోగ ఉపాధుల్లోనూ అసమానత్వానికి బలై గాయపడిన అణగారిన జనం ఎందరో కుల వివక్ష చాపకింద నీరులా రోజురోజుకూ భారతదేశంలో విస్తరిస్తూనేవుంది. దీని గురించి విద్యావ్యవస్థలో మాట్లాడడమే అపవిత్రంగా భావిస్తున్నారు. పంట చేను మంచిగా పంట పండాలి అంటే అందులో ఉన్న పురుగులను మొదట చంపాలి. అలాగే మన దేశంలో ఉన్న ఈ కుల వివక్ష అనే దురాచారాన్ని మనం నిర్మూలించినట్లయితే స్వేచ్ఛా భారత్‌ను చూడగలుగుతాం. అందుకే **బాల్యదశలో కాకపోయినా, యవ్వన దశలోనైనా విద్యార్థులకు పాఠాల ద్వారా దేశంలోని కులవ్యవస్థ గురించి దాన్ని రూపుమాపే విధి విధానాల గురించి పరిపక్వతతో ఒక ప్రధాన విషయంగా బోధించాలి. అసమానత్వానికి గురైన అణగారిన కులాలకు రిజర్వేషన్ పాలసీ ద్వారా విద్యా, ఉపాధులలో అవకాశాల కల్పన ద్వారా ప్రగతి పథంలో ఉన్న కులాలతో పాటు సమన్యాయం జరుగుతుందనీ, వాటిని వినియోగించుకోవాలనీ సూచించాలి.** ఇది జరగని క్రమంలో ఏ స్థాయిలో ఉన్న వాళ్ళు ఆ స్థాయిలో నిలిచిపోయి, సమాజంలో కుల కట్లు బలపడే అవకాశం ఉంటుంది. తద్వారా అది దేశానికి ప్రగతికి అవరోధంగా ఉంటూ తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది.

**నైపుణ్యం నేర్పని నేటి విద్య:**

ప్రతియేటా వచ్చే విద్యా వ్యవస్థల ప్రకటనలు చూస్తే మన విద్య ఏ దారిలో ప్రయాణిస్తోందో తెలుస్తుంది. ముఖ్యంగా ప్రైవేట్ విద్యా వ్యవస్థలు కేవలం ర్యాంకుల పేరుతో, అధిక మార్కుల సాధనే ప్రధాన లక్ష్యంగా విద్యను అందిస్తూ, లక్షలకు లక్షలు ప్రజల నుంచి దోచుకుంటున్నాయి. ర్యాంకుల సాధనే పరమావధిగా విద్యార్థులను రాత్రీ పగలూ రుద్దుతున్నారు. దాని కోసం ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. పాఠ్యాంశాలను పూర్తిగా బోధించి, వాటిని ఎలా అవగాహన చేసుకోవాలో నేర్పించకుండా, షార్ట్‌కట్లు వెతికి మరీ పరీక్షలు ఎలా రాయాలో నేర్పిస్తున్నారు. అంటే విషయాల పట్ల అవగాహన కలిగించటంకంటే మార్కులను మూటకట్టుకొనే పద్ధతులపైనే బోధన చూపు. ఫలితంగా పాఠ్యాంశాల అవగాహన లేకుండా, నైపుణ్యత కొరవడి ఉద్యోగాల వేటలో విఫలమవుతున్నారు. ఇందులో తల్లిదండ్రుల పాత్ర కూడా ఉంది. కేవలం మార్కులనే విద్యా అభివృద్ధికి సూచికలుగా తీసుకుని తమ పిల్లలను తామే నిరుద్యోగులుగా తయారు చేస్తున్నారు. ప్రత్యేక ట్యూషన్లు, కోచింగులు ఇప్పించినా ఫలితం ఉండడం లేదు. దీనికి కారణం అభివృద్ధికి ప్రాతిపాదికగా మార్కులను పరిగణించడమే. మనలో ఉండే ఈ అపప్రథ నిరుద్యోగానికి దారి తీస్తోంది. దీనికి ప్రత్యేక నిదర్శనం 2019లో జరిగిన ఒక సర్వేలో 80 శాతం మంది ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలు లేక ఉద్యోగానికి అనర్హులని తేల్చారు. కేవలం 2.5%ఇంజనీరింగ్ విద్యార్థులు మాత్రమే కృత్రిమ మేధపై పట్టు కలిగి ఉన్నట్టు తెలుస్తోంది. ఇలా ఇంజనీర్లను మాత్రమే కాదు వైద్యవృత్తిలోనైనా ఇంకా ప్రతి వృత్తిలోనూ ఈ నైపుణ్యలేమి కనిపిస్తోంది. రాజకీయ కారణంగానో, మరి ఏ ఇతర బాహ్య కారణంగానో ఉద్యోగం రాకపోతే పోరాడవచ్చు గానీ విద్యా వ్యవస్థను విద్యార్థులను నిస్సహాయులుగా, నిస్సారంగా తయారు చేస్తూ వారి భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోన్న విద్యా విధానాన్ని మార్చుకోనంతకాలం మనగతి ఇంతే. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టుగా, దీనికితోడు ఇంగ్లీషు మాధ్యమ విద్య. **ఉన్నత చదువులు ఆకళింపు చేసుకోలేక, ఇంగ్లీషులో బోధన అర్థం కాక, విషయాల అవగాహన లేమితో విద్యలో నైపుణ్యతను సాధించలేకపోతున్నాం.**

**రాజకీయ చైతన్యం:**

ప్రజల సమస్యల పట్ల అవగాహన లేని నాయకులు రాజకీయాల్లోకి రావడం, ప్రజా సంక్షేమానికి కావలసిన విధానాలను రూపొందించే జ్ఞానం లేకపోవడం, దోచుకునే ప్రవృత్తి ఉండటం సమాజానికి ఎప్పటికీ ప్రమాదమే. ఒక విద్యార్థి ఐఏఎస్ కావడానికి రాత పరీక్షలూ, ఇంటర్వ్యూలూ పెట్టి ప్రజలకు కావలసిన విధి విధానాల గురించి కూలంకషంగా పరీక్షించి ప్రత్యేక నిపుణులచే ప్రశ్నించి లక్షల్లో కొందరిని పాలనాధికారులుగా ఎంపిక చేసుకుంటాము. కానీ రాజకీయాల్లోకి పాలకులుగా వచ్చేముందు రాజకీయ నాయకులను ప్రజా సమస్యలపట్లా, పరిపాలనా విధానం పట్ల దేశంలో ఎవరూ వారు ఎవరూ ఏమిటని ప్రశ్నించి ఎంపిక జరగటంలేదు. అక్కడి నుండే సమాజానికి కష్టాలూ నష్టాలూ మొదలవుతాయి. మనం చదువుకునే చదువులు కేవలం వ్యక్తిగతంగా మనకు మాత్రమే ఉపయోగపడేవి కావు, దాని ద్వారా ఆర్జించిన జ్ఞానాన్ని సమాజశ్రేయస్సు కొరకు తిరిగి ఉపయోగించవలసిన అవసరం కూడా ఎంతైనా ఉంది. రాజకీయం గురించి అవగాహన లేని విద్యార్థి లోకాన్ని ఈరోజు ఈ విద్యావ్యవస్థ తయారు చేస్తోంది. సమాజాన్ని మార్చే ఒక గొప్ప ఆయుధం రాజకీయం అని గుర్తించాలి. సమసమాజాన్ని స్థాపించడంలో రాజకీయం కీలక పాత్ర పోషించాలి. అటువంటి గొప్ప రాజకీయ వ్యవస్థ నేడు అక్రమాలకూ, అన్యాయానికీ, దోపిడీకీ అడ్డాగా మారిపోయింది. ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని చేపట్టి ప్రజాధనాన్ని దోచుకుంటూ పేదలను అణగదొక్కుతున్న

రాజకీయ నాయకులకు మన సమాజం ఒక ప్రయోగశాలగా మారింది. ప్రజా సమస్యలపైన సరైన అవగాహన లేక నిర్ణయాలు తీసుకుని దేశాన్ని అస్తవ్యస్థంగా చేస్తున్న నాయకులూ మన దేశంలో ఉన్నారు. ఎన్ని నేరాలూ, దోపిడీలూ చేస్తే అంత గొప్ప నాయకులుగా రాజకీయాల్లో కనిపిస్తున్నారు. దేశం బాగుపడాలంటే విద్యావంతులూ, నిస్వార్థపరులూ, ప్రజల పట్ల పరితాపం ఉన్నవాళ్లూ రాజకీయాల్లోకి వస్తేనే సాధ్యపడుతుంది అనుకోవటం అమాయకత్వంగా కనబడుతోంది. **విద్యావ్యవస్థకి ఈ దేశాన్ని అభివృద్ధి పథంలోకి నడిపించగలిగిన గొప్ప నాయకులను తయారు చేసే బాధ్యత కూడా ఉంది. దేశాన్ని పరిరక్షించి ప్రాణాలర్పించిన అనేక గొప్ప నాయకుల గురించి పాఠ్యాంశాలలో చేర్చి దేశంపట్ల బాధ్యతను పెంచాలి. రాజకీయ చైతన్యాన్ని విద్యావ్యవస్థ ద్వారా అందించాలి. ఇది మాతృభాషామాధ్యమం ద్వారానే సాధ్యం అని తెలుసుకోవాల్సిన సమయం వచ్చింది.**

**పేదలకు విద్యాభద్రత:**

దేశాన్ని పట్టి పీడస్తున్న జాఢ్యాలలో పేదరికం ముఖ్యమైనది. ఒక దేశంలో 5 నుంచి 10 శాతం మందిఉన్న ఉన్నత వర్గాలు ఉన్నత విద్యను అభ్యసించి, వారిలో ఒక శాతంలో నూరవ వంతు విదేశాలలో ఉద్యోగాలు సంపాదిస్తే దానిని అభివృద్ధి అనలేము. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఆర్డి) 2018లో ఇచ్చిన నివేదికలోని విద్యా గణాంకాల ప్రకారం భారత్‌లో ప్రాథమిక స్థాయిలో బడిమానేసిన సగటు విద్యార్థుల రేటు 4.13 శాతం ఉండగా, ఇది ఉన్నత ప్రాథమిక స్థాయిలో 4.03 శాతం, ద్వితీయ స్థాయిలలో 17.06 శాతంగా ఉంది. విద్యార్థులు బడి మానేయడానికి గల ప్రధాన కారణం పేదరికం, చదువుకునే స్థోమత లేకపోవడం. ఆకలి కోసం చదువులు వదిలేసి బాలకార్మికులుగా జీవనం సాగిస్తున్న పిల్లలు 2011 జనాభా లెక్కల ప్రకారం ఒక కోటి 10 లక్షలు. పరిపూర్ణ అక్షరాస్యత సాధించడానికీ అభివృద్ధికీ పేదరికం పెద్ద అవరోధంగా ఉంటోంది. పేదరికం మాత్రమే కాదు ఇంగ్లీషు మాధ్యమ విద్య కారణంగానూ విద్యార్థులు బడి మానేస్తున్నట్టు ఆచార్య గారపాటి ఉమామహేశ్వర రావు గారు 2018లో హైదరాబాద్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'మదర్ టంగ్ మీడియం ఆఫ్ కన్స్ట్రక్షన్' అనే అంతర్జాతీయ సదస్సులో గణాంకాలతో నిరూపించారు. కాబట్టి ఒక సమాజంలో ప్రజల మధ్య సమానత్వాన్ని నెలకొల్పేది విద్య ఒక్కటే. **విద్యార్థులందరికీ సమాన విద్యను, తగిన వసతులను, ఉపాధ్యాయులను నియమించి, వారి మాతృభాషలో నాణ్యమైన, నైతికతతో కూడిన విద్యను అందించిన నాడే అభివృద్ధి జరుగుతుంది.**

**ప్రశ్నించకపోవడమే బానిసత్వం! :**

నేడు అధికంగా విస్తరిస్తున్న సాంకేతిక విద్య, రాజకీయ చైతన్యం లేని విద్య వల్ల సమాజంలోని అన్యాయాలనూ, అక్రమాలనూ ప్రశ్నించే తత్వం క్రమేణా కోల్పోతోంది. తన చుట్టూ ఉండే సమాజం ఎలా నిర్మితమైందో, వ్యవస్థ పనితీరుపై అవగాహన కొరవడుతోంది. తన జీవితం, తన కుటుంబం కోసమే ఆలోచిస్తున్నారు కానీ వ్యవస్థ పనితీరును దానిలో ఉండే లోపాలను ప్రశ్నించే విద్యార్థులు కొంతమందే ఉన్నారు. **దేశాభివృద్ధికి ప్రధాన అవరోధం ప్రశ్నించని ప్రజలే! దీనికి కూడా మూలాలు మనం విద్యా వ్యవస్థలోనే వెతుక్కోవాలి. సమాజం, వ్యవస్థ పనితీరు పట్ల అవగాహన కలిగించని పాఠాలను మనం విద్యార్థులకు అందిస్తున్నాం. కనీసం, ఉన్న పాఠ్యాంశాలను అయినా పూర్తిగా అవగాహన చేసుకుని నైపుణ్యాన్ని సాధిద్దామంటే, ఆ విద్యామాధ్యమం ఇంగ్లీష్లో ఉంటుంది. ప్రశ్నించే తత్వం విద్యార్థి దశలోనే ఆగిపోతుంది, తద్వారా పాఠాలు అర్థం కావూ, లక్షల రూపాయలు ప్రైవేటు విద్యాసంస్థలు దోచుకుంటూనే ఉంటాయి, చివరికి దేశానికి నైపుణ్యం లేని విద్యార్థులను అందించడం జరుగుతోంది. ఒకవేళ ఉద్యోగానికి వెళితే శ్రమ దోపిడీ జరుగుతోంది. దాన్ని కూడా ప్రశ్నించలేక బానిసలుగా మిగిలిపోవలసి వస్తోంది.**

**సమసమాజం అమ్మనుడితోనే సాధ్యం!**

విద్యార్థులకు నైతిక విలువలు కలిగిన విద్యను, నాణ్యమైన విద్యను అందించడం ఎంత ముఖ్యమో, ఆ విద్యను అమ్మనుడిలో అందించడం కూడా అంతే ముఖ్యం! ప్రజల సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నా, చుట్టూ ఉన్న వ్యవస్థను అర్థం చేసుకోవాలన్నా అది అమ్మనుడితోనే సహజంగా సాధ్యపడుతుంది. ఎందుకంటే భాషకూ, సమాజానికీ, దానిలో ఉన్న సంస్కృతికీ అవినాభావ సంబంధం ఒక గొలుసులా ఉంటుంది. ఎప్పుడైతే ఈ గొలుసు తెగిపోతుందో సమాజంలోని అన్ని వ్యవస్థల పైన దీని ప్రభావం ఉంటుంది. విద్యార్థులు తరగతి గదుల్లో పాఠ్యాంశాలపై ప్రశ్నించడం మానేస్తారు, అవగాహన కొరవడుతోంది, నైపుణ్యత సాధించలేరు, ఉద్యోగాలు పొందలేరు, మానసిక వేదనతో ఆత్మహత్యలకు పాల్పడతారు. రాజకీయ వ్యవస్థలో దోపిడీదారులు చొరబడి ప్రజలను పాలిస్తారు, సమాజం దోపిడీకి గురవుతోంది, పేద ప్రజలకు సంక్షేమాలు అందవు, సమాజంపై అవగాహన లేని చదువుకున్న వ్యక్తులు రాజకీయ నాయకులను ప్రశ్నించరు. ఇక సమాజంలో సాంఘిక దురాచారాలైన కుల వివక్షా, కుల పిచ్చీ, శ్రమదోపిడీ, మతకల్లోలాలు చెలరేగుతూ వుంటాయి. తార్కికంగా, సైద్ధాంతికంగా ఆలోచించే సమాజాన్ని మనం నిర్మించుకోలేము. కాబట్టి అమ్మనుడి వాడుక ప్రతి రంగంలోకి చొరబడాలి. అప్పుడే విషయాల పట్ల అవగాహనలో సహజత్వం వస్తుంది. ముఖ్యంగా **విద్యా రంగంలో పూర్తిస్థాయిలో అమ్మనుడే మాధ్యమంగా ఉండాలి. ఒక చెట్టు వేళ్లు నేలలోకి ఎంత లోతుగా తన్నుకుపోతే, బాహ్యంగా కనిపించే చెట్టూ అంత పచ్చగా కళకళలాడుతుంది. అలాగే విద్య కూడా - అమ్మనుడిలో సమాజాన్ని ఎంత లోతుగా అర్థం చేసుకుంటామో, దాని సమస్యలకు అంత చక్కటి పరిష్కారాన్ని కలిగించి సమసమాజాన్ని స్థాపించవచ్చు.**

---

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

## ఆకలి దప్పులతో అలమటిస్తూ, ఆవాసం కోల్పోతున్న ఆదిమజాతులలో కోదు గిరిజన జీవితం చిత్రించే ఒడియా నవలకు తెలుగు అనువాదం

# 'అమృత సంతానం'

**ఆ**మధ్య 2013లో ఒరిస్సాలో కోదుతెగవాళ్ళు తమ దేవతాస్థలాలు, పోడు, కల్లుబసలు ఉన్న 'నియంగిరి కొండలలో వేదాంత కంపెనీ బాక్సైట్ తవ్వకాలకు ఒప్పుకోం' అని ఎదురు తిరిగారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం వారి గ్రామసభలకు తిరస్కరించే హక్కు ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

తిరస్కరించారు కాని, అవి తమవని నిరూపించటానికి కావలసిన విధివిధానాలు, పటాలు గీయటం, దరఖాస్తులు నింపటం, ఆయా స్థలాల ప్రాముఖ్యం తెలిపే నానుడులు, బడి చదువులలో పడి గుర్తు రాక, గుర్తుచేసేవారు లేక, బిక్కచచ్చి పోతున్నారు..

ఈ నియంగిరి ప్రశస్తిని 1863లో వచ్చిన విశాఖపట్నం జిల్లా మాన్యుయల్ ప్రస్తావిస్తుంది. అప్పటికే తెల్లవాళ్ళు కోదుల చరిత్ర, సంస్కృతి, వ్యాకరణం, నరబలి వగైరాల మీద చాలా రాసారు. స్కూళ్ళ ఇనస్పెక్టర్ లింగం లక్ష్మాజీ పంతులు కోదు వ్యాకరణం మీద పట్టున్నవాడు అని మాన్యుయల్ వివరంగా పేర్కొంది. ఈ ప్రాంతంలో ఎర్రమట్టిని కోండలైట్ అని భూగర్భశాస్త్రవేత్తలు ఆ తెగపేరుతో పిలుస్తారు. గిడుగు రామమూర్తి కూడా 'కోదులలో రాసేవాళ్ళు చాలామంది ఉన్నారు. కాని–సవరలలో లేరు.' అన్నారు (సవర కథలు 1912 .ఎమెస్కో)

అత్యున్నత శిఖరం నియంగిరి పేరు ఈ నవలారచయిత పేర్కొనలేదు కాని, అనేక తెగలకు ఆవాసమైన తూర్పుకనుమలలో, మాల్యవంతం దాకా విస్తరించిన ఈ కొండప్రాంతాలలో, కథకు ఎన్నుకున్న ఘర్ జాతా పర్వత శ్రేణిలో అట్టరహా గడజాత, పద్దెనిమిది దేశీయ రాజ్యాలను, తూర్పు కనుమలలో ప్రాచీన రాజధాని జయపురాన్ని(నందపురం) 'అమృత సంతానం' రచయిత నామమాత్రంగా పేర్కొంటాడు..

**540 పేజీల ఈ నవల మూదూళ్ళ ఎత్నోగ్రఫీ**

1.అప్పులపాలై భూమి పోగొట్టుకుని, షాహుకారుకింద వెట్టి చేయటానికి పల్లానికి వెళ్లి అసువులు బాసిన, ఒకకోదు గిరిజనుడి పెళ్ళాం, అతని ఈడొచ్చిన కూతురు 'పియోటి', మళ్ళీ కొండల్లో, తమ ఊరే వెళ్లి బతకటానికి తంటా పడుతుంటారు.

ఊరి పెద్దను సావోతా అంటారు. అతడు పెండ్లికాని పడుచువాడు.అస్తి పెంచుకుని దిగువ వాడిలా అవ్వాలని అతని తాపత్రయం.అతన్ని చేసుకుంటే పియోటి సుఖపడుతుందని తల్లి ఆలోచన. సరసం తెలియని వాడిని ఎలా పడేయాలో అర్థంకాని ఆ పడుచుదాని పాట్లు.

2. ఈ కుర్రాడు మరో ఊరి పెద్ద చెల్లెలు 'పుయుబి'ని చేసుకోవాలనుకుంటాడు. ఏదో పనిమీద వాళ్ళ ఊరు వెళతాడు. కాని, పెళ్లి మాటలదాకా వెళ్ళడు. పుయుబికైనా తన మాట చెప్పడు..

పుయుబి వదిన, పుయు, పురిటాలు. కాన్పుతో ఈచుకుపోయిన పుయుమీద మోహం మొత్తిన మొగుడు, ఆడదాని పొందు కరువై అల్లల్లాడి పోతుంటాడు. అతడు, అతని చిన్నాన్న. గ్రామనౌకరు కోదలు సోనాదేయి దగ్గరికి సారా కోసం పోతుంటారు.. కాని, ఆమెతో కలియటానికి కులం, పెద్దరికం అడ్డొస్తుంది.

3.చిన్నాన్న పెళ్ళాన్ని పులి చంపేసింది.పులికి బలి అయినవాడి పెళ్లాన్ని మాత్రమే, అతడు మనువాడాలిట..అటువంటివాళ్ళు దొరకటం కష్టం. దొరికినా ఆమె ఇష్టపడాలి.అందువల్ల ఆ ఆ ముదరప్రాణం పొందుకోసం, సొంత ఇల్లుకోసం తపిస్తుంటాడు. ఆస్తి పంచి ఇమ్మని అన్నకొడుకును అడగాలని మధన పడుతుంటాడు. ఇద్దరికీపడదు..వీళ్ళ మధ్య పుయు నలిగి పోతూ, పసికందును పెంచుకుంటూ వస్తుంది.అదొక్కటే ఆమెకు




దక్కిన ఆనందం, ఓదార్పు.,

4.దొంగసొత్తు వెతికే సాకుతో, ఇంట్లో దూరి ఫారెస్ట్ వాడొకడు సోనాదేయిమీద అత్యాచారం చేస్తాడు. తండ్రి 20రూ ఓలి తీసుకుని కట్టబెట్టాడు. ఆమె మొగుడు పెళ్ళాన్ని పట్టించుకోడు. దొంగతనాల కోసం ఆ ఊరు, ఈ ఊరు పోతుంటాడు. ఆ కులంది ఒకటే ఇల్లు. వాళ్ళు అంటరాని వాళ్ళు.. తండ్రి ఊరుకు పోదామంటే, అతడు దొంగతనాలు చేసి జైలు పాలై, కిరస్తానీ మతం తీసుకుని, ఊరికి కాకుండా పోతాడు. అక్కడా ఆమెకు ఆసరా లేదు.అడవి గాచిన వెన్నెల అయిన ఆమె, మోడులా కుమిలిపోతూ ఉంటుంది.

5.ఇంతలో పుయిబి పక్క ఊరు కుర్రాడితో లేచి పోతుంది. అతడో మంచి వేటగాడు..లేపుకొచ్చిన కుర్రాడి కుటుంబం మీద తప్పు వేయాలి అని, అన్న చిందులు తొక్కుతాడు. కానీ, పెళ్లి మాటలు కాలేదు కాబట్టి తప్పు లేదని పెద్దలు తేలుస్తారు.పెళ్లిబంతి ఇచ్చి వాళ్ళు కాపురం పెడతారు.

పుయు మొగుడు, పియోటి ఊరుకు రాకపోకలు సాగిస్తుంటాడు. పియోటిని తీసుకొస్తాడు.పెళ్ళాం అలుగుతుతుంది.

అలిగి చేయగలిగిందేముంది ,–
**కట్టే కొట్టే తెచ్చే పద్ధతిలో ఇదీ కథ .**

ఈ కథ మధ్యలో గిరిజనజీవితంలో పోడు, వేట, పండుగలు, తగవులు, నమ్మకాలు,. చుక్కలు చూసి యోగం తెలుసుకునే దిసారి, దేవతలు పూనే బెజ్జుణి, ఫారెస్ట్ అధికారుల మామూళ్ళు, దౌర్జన్యాలు, సాహుకార్ల బేరాలు రచయిత జొప్పిస్తాడు. అన్నీ నిస్సహాయంగా భరించే జనం. వాళ్ళ సరదాలు సంతోషాలు, ఆట పాటలు...

**ఇటువంటి జీవితాన్ని చిత్రించే సామెతలెన్నో**
**మన గిరిజనుల వాడుకలో ఉన్నాయి..**

కొండచేను కోమటివాడిదుకాణం.
కోదోడి పోడు కొమటోడి సంచి..
అన్ని డిపార్టెమెంట్లు అనుకూలమే గాని ఫారెస్ట్ డిపాట్మెంట్ పరమశత్రు.
అడిగిన పిల్ల కడిగిన మొహం.
'ఒక్క తల్లి పిల్లవైతే కో..కోడలమ్మా, ,బొక్కలోని తట్టలవైములా'

జాకరి దేవత(శాంకరి,భూదేవత)కు మొక్కుతూ చేసే మొదటి పంటల పండుగ కొర్రకొత్తనుండి పిండి పండుగ దాకా సాగే పంటకొత్తలు.,

కల్లు పండుగ, అడవి రాజుల పండుగ, మామిడి పండుగ, చైత్రంలో వేటల(ఇటికల)–ఇలా అంతులేని పండుగలలో 'అమ్మలతోడి ఆటలు, గోవులతో గొట్టి, గుబ్బట్లతో గుమ్మళ్ళ'తో తుళ్ళిపడే ఆట బసలు, వేట బసలు, పండుగ బసలు. గొట్టి బస.– ఈ పండుగలు, పబ్బాలు, తగువులు చర్చించి జరిపించే పెద్దల 'గోష్టి'.

'అందమైన నందపురము నంది ఆటలె ఆడి వద్దాం, తీయగుమ్మడి తీసి వద్దాం,మళ్ళు గుమ్మడి మరలి వద్దాం';

'చక్కెర దేవికోటలోన (చక్రకూటం) చేదండాలు పట్టి–రండో చేరి పాండవులు లార భోంచేయ రండో" అని పాడుతూ ఒకనాటి చరిత్ర అడుగు జాడలను గుర్తు చేస్తాయి.

ఇటువంటి నానుడులు, కోదులకు ఉంటాయి. అవి రచయిత ఎంతగా వాడాడో అనువాదంలో తెలియదు..అవి ఒడియా సాహిత్యంలోకి ఎంత చొచ్చుకు పోయాయో !

చూస్తే గిరిజన జీవితం ఇలాగే కనిపిస్తుంది. ఇంతేనా! వాళ్ళకు ఇంతకంటే మించిన ఆశయాలు ఆదర్శాలు, వాటికోసం ఆరాటపడిన చరిత్ర ఏమన్నా ఉన్నాయా అవి కొంతైనా **చదివి తెలుసుకుని ఈ రచయిత గోపీనాథ మొహంతి, రాశాడా అంటే తెలుసు కోలేదు సరికదా వక్రీకరించాడు అని కూడా చెప్పొచ్చు .**

సోనాదేయి కులం దొంబులు, వీళ్ళది, విశాఖ మన్యం మత్స్య గుండం పక్కన ఒండ్రుగడ్డ నుంచి వచ్చారని రచయిత చెపుతాడు. అది నిజమే అక్కడ వాళ్ళను కొండమాలలు / కోలగాళ్ళు, వాల్మీకులు అని పిలుస్తారు.. గ్రామ నౌకర్లు కాబట్టి ఊరి పనులతో పాటు, మన్యానికి –పల్లానికి షాహుకార్లకు, అధికార్లకు వాళ్ళే సంధానకర్తలు..

కొండకింద వద్దాది మత్స్యరాజ్యంలో పిట్టగడ్డ నుంచి వాళ్ళు వచ్చినట్లు 'పిట్టగడ్డ జాలంపల్లి పట్టపు కోలన్న' అంటూ అరణ్య అజ్ఞాత వాసాలు గడుపుతున్న పాండవుల గూర్చి పాడుతూ విశాఖ మన్యంలో నంది, కొలువు పండుగలు చేస్తారు. వీళ్ళ ఆడపడుచు మాలగంగును కోడలును చేసుకున్న మన్యం ఇలవేలుపు వద్దాది రాకుమారి, నందపురం కోడలు మోదకొండమ్మ గేయగాథను, గిరిజనులు భక్తి ప్రపత్తులతో పాడుకుంటారు. ప్రతి ఉళ్ళో గంగ పూజారి, వాళ్ళు పాడుకునే గంగాచెల్లి పాటలను 1961 సెన్సస్, విలేజ్ మోనోగ్రాఫ్‌లలో కనిపిస్తాయి.. పురాణ ఇతిహాసాలే కాదు, ఒడియా మహాకావ్యం సరళాదాస్ జగ్ మోహన రామాయణం మొదలైనవి ఈ తెగల జీవితాన్ని వర్ణిస్తాయి.. మహేంద్రగిరి, పూరీ జగన్నాథం, కళింగం రాజధాని ముఖలింగం గిరిజన మూలాలను చాటిచెపుతాయి.

స్వతంత్రం వచ్చినప్పుడు విలీనమైనవి, ఎక్కువగా, గణరాజ్యాలుగా పేరు మోసిన ఈ గిరిజన సంస్థానాలే. ఈ రచయిత ఉద్యోగం చేసే రోజులలో ఒరిస్సా మొదటి ముఖ్యమంత్రి కొండదొరతెగకు చెందిన పర్లాకిమిడి పాలకుడు.. జయపురం పాలకుడు, విశాఖ నగర నిర్మాత విక్రమదేవ వర్మ. లిఖిత సాహిత్యం ఇటువంటి వారసత్వం, ఎంతవరకు ఉపయోగించుకోగలిగింది ఉభయ భాషల ఆదివాసీ సాహిత్యంతో పరిచయమున్నవారు చెప్పాలి.

నాటి దిగువ రాజులతో 'నేస్తం' సంబంధాలుగల ఈ తెగలు, రాజులతో కలిసి తెల్లవాళ్ళను ఎదిరిస్తారు. రాజులు లొంగారు కాని ఈ తెగలు లొంగలేదు. వారిలో ఉన్నట్టు చెప్పుకునే నరబలి మానిపించే సాకుతో తెల్లవాళ్ళు తమ బలగాలతో ఈ కొండలలోకి ప్రవేశించారు. ఈ సాయుధ సంస్కరణలకు రాజ్యాలలోని శిష్ట వర్గాల మద్దతు సంపాదించుకున్నారు. బలగాల తరలింపుకు రోడ్లు వేసారు. గిరిజనుల తిరుగుబాట్లు/ పితూరీలను అణిచి వేసారు. రెవెన్యూ, ఫారెస్ట్, పోలీసు పాలన కోసం దిగువనుంచి వచ్చి ఉద్యోగులు వచ్చి తిష్టవేసారు. ఆ ఒరవడి, ఉద్యోగుల పెత్తనం, నేటికి కొనసాగుతున్నది.

ఈ రచయిత అటువంటి రివిన్యు అధికారులలో ఒకడు. అధికారి రచయిత కూడా అయితే, అక్కడా ఇక్కడా కొంత భజన బృందం ఉంటుంది.. ఏ చెట్టూ లేనిచోట ఆముదమే మహావృక్షమైనట్లు, పుస్తకాలపురుగులు, సాహిత్య గాళ్ళు ఇటువంటి రచనలద్వారా ప్రపంచాన్ని చూపిస్తారు, రసం ధ్వని, పాత్ర చిత్రణ 'వ్రతానాం ఉత్తమం వ్రతం' అంటూ ఆశ్రయించిన వారిని ఆకాశానికెత్తేస్తారు. సాహిత్య విమర్శను రక్తి కట్టిస్తారు. ఆ సాహిత్యం చూరులొంచి మనకు సమాజాన్ని చూడటం అలవాటు చేస్తారు. 1956లో ఒడియాలో అచ్చైన ఈ రచనకు, పురిపండా అప్పలస్వామి అనువాదం 1966లో 2018లో కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురించింది. ఇది కాక ఈ రచయిత గిరిజన జీవితం మీద చాలా కథలు నవలలు రాసారు. ఆంగ్లంలోకి అనువాదం అయినాయి. జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్నారు.

'వెన్నెలకోసం ఏడ్చే రాత్రిని, చుక్కలు ఓదార్చినట్లు, కర్తవ్యం బోధపడని వాళ్ళను కవి ఓదారుస్తాడు' 'అన్నట్లు ఇటువంటివి ఆలోచింప చేయలేని ఓదార్పు రచనలు.

ఇక మన దగ్గర భద్రిరాజు కృష్ణమూర్తి 1960లోనే కువి భాషను అధ్యయనం చేసారు. తెలుగుగిరిజన మాండలికం అర్థమైతేనే, పొరుగునున్న కొందు, గోండు వంటి భాషలు అర్థమౌతాయి. అనితెలుసుకున్నారు. వారి శిష్య ప్రశిష్యులు వ్యాకరణానికి పరిమితమైనారు. సాహిత్యం జోలికి పోలేదు.

అయితే 1982లో ప్రారంభమైన

గిరిజన సంప్రదాయ సాహిత్య సేకరణ, విశ్లేషణ ప్రచురణలో, చట్టాల మలులో నేడు గిరిజనులే పాల్గొంటున్నారు. కానీ ఇది ఒంటరి పోరాటంగా సాగుతున్నది. అరకులోయలో గిరిజనాభివృద్ధికి కృషి చేసిన కెనడా దేశస్తుడు. గుస్తాఫ్ ఆదివాసీ కాలచక్రం-పండుగలు పుస్తకం పాడేరు గిరిజనాభి వృద్ధి సంస్థ 76లో ప్రచురించింది. ఉభయ రాష్ట్రాల సంగమస్థలి అరకులోయ చిత్రణం మనపొరుగున ఒడిశాలోని తెగల పలుకు బడులనును అర్థం చేసుకోటానికి, ఈ నవల ఎంతవరకూ వాటిని ఉపయోగించుకున్నది తెలుసుకునేందుకు దోహదం సాయపడుతుంది.

"కోదులు అవయవసౌష్టవం కలవారు. కట్టుబట్ట వారిది ప్రత్యేకం. ఆడవారు చీరెను మోకాళ్ళు తాకేవరకు కట్టుకొని రెండుచెంగులు ముడి వేస్తారు. మరో చెంగు ఎడమ చంకకిందగా రెండు భుజాలను కలుపుతూ రొమ్ములను బిగిస్తుంది. తమను కోరుకున్న జతగాళ్ళు బహూకరించిన దువ్వెనలను, పిన్నుల నుతలలో తురుముకున్న పడుచులు మిస్ యూనివర్స్‌ను తలపిస్తారు.

ఓరగా ముడిచిన కోరకొప్పుకొప్పులో ముడిచిన కొమ్మ సంపెంగిపూలు, ముడిచిన జడకు బదులుగా సాగే నెమలివన్నెచీరెనిలువుటంచు, మీగాళ్ళ పైకి మెదలమీదుగాకట్టినచీర, తలమీద బరువునురెండు చేతులెత్తి కాసుకుంటే, దారిలో ఎత్తుపల్లాలకు తగినట్లు ఊగే తనూలత-చిలుకుచీర తాకీతాకక చాటే శరీరపు వంపుల, వయ్యారినడకల కోదుపడుచుల శ్రమైకజీవన సౌందర్యానికి ఎటువంటి సొమ్ములైనా దిగదుడుపులు

వేసవికాలంలో వచ్చే ఇటింపండుగలో పెళ్ళిళ్ళలో కోదులు/సావొంత/సామంతులు ఆడేది నెమలి ఆట. పిల్లనగోవికి (పిరోడి)జతగా కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు.. తలకు రంగురంగుల సిల్క్‌గుడ్డల 'తొయ్యంగా'పాగా చుట్టుకుంటారు. నడుముకు నెమలీకల తోక కట్టుకుని ఆడతారు. "తల్లి భూదేవత, తండ్రి ఆకాశం, పుట్టించిన బమ్మదేవుడ" అంటూ పాటలతో ఆటలు మొదలౌతాయి. కుడి చేతిని నోటికి అడ్డుపెట్టుకుని నెమలిలా అరుస్తూ గోలచేస్తారు.

**ఇక పెళ్ళికూతురు ఇంటిముందు దృశ్యం**

**కానీ రోజులు మారాయి. తళుకు బెళుకు రాళ్ళకు దూరంగా నిక్కమైన నీలం వెతుక్కునే వారు, చదువుకుని రాసేవారు రాకపోరు.. మెరుగు పెట్టే వారు, ప్రసారం చేసేవారు దొరక్కపోరు.**

పిల్లను ఇమ్మని బతిమాలి బామాలి, పిల్ల ఇంటివాళ్ళు ఒప్పుకోకపోతే, పిల్లాడు, తలకిందులుగా నిలబడి మొత్తుకుంటాడు, పిల్లాడి తరపు వారంతా సానుభూతితో గంతులు వేస్తుంటారు. చివరకు పిల్లాడి బాధలు చూసి, పిల్లవచ్చి వాడి కాళ్ళు దింపి, పెళ్ళికిఅంగీకరిస్తున్నట్లు తెలుపుతుంది. చివరకు చేతిలో రుమాళ్ళు ఎగరేస్తూ ,ఆట ఆడుతూ పిల్లను పిల్లాడి ఇంటికి తీసుకుపోతారు. దీన్ని నిలాస్వ్ అంటారు'..

**ఇలా మన పరిశోధకులు చిత్రించిన రసవత్తర దృశ్యాలు.ఈ నవలలో కనిపించవు.**

మన గిరిజన సంక్షేమంలో పనిచేసిన రచయితలు, గిరిజనులను పరీక్షలలో పాస్ చేసే, పథకాలు అమలు చేసే పనికి పరిమిత మైనారు. వారు కన్న కలలలో, నడిచిన దారులలో రాసే కవితలలో, చెప్పే ముచ్చట్లలో గిరిజన సంస్కృతి మీద శుష్క ప్రియాలు తప్ప, ఇంకేం విశేషాలు కనిపించవు. వీరు ముఖపుస్తకంలో ఈ నవలాపరిచయాన్ని తెగ ప్రోత్సహించారు. ఈ మధ్య గిరిజనరచయితలు వస్తున్నారు కాని వారు చూసింది రాస్తున్నారు. ఈ సర్కారీ రచయితల ఒరవడిలో కొట్టుకుపోతున్నారు..

గ్రామనామాల నుండి గేయగాథల దాకా భద్రపరచే జానపదపండితులున్నారు. వారికి ఆ సాహిత్యం చట్టాల అమలులో ఎలా ఉపయోగపతుందీ తెలియదు. ఇక న్యాయవాదులు వాళ్ళు చట్టాలు, తీర్పులు వల్లిస్తారు.. వారికి సంస్కృతి తెలియదు. మానవ శాస్త్రవేత్తలు ప్రాజెక్టులు తెచ్చుకోడం తప్ప గిరిజనులకు సాయపడే చదువు చెప్పటానికి ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు.. అధికారులు పథకాలు అమలు తప్ప చట్టం అమలుకు పూచీ పడరు. ఆ మెలకువలు తెలియని జనం మీద పెత్తనం చేస్తుంటారు.

ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం, విద్యాశాఖ ఒడిశాలో వేదాంత కంపెనీ సాయంతో నడిచే కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో ఒప్పందం చేసుకున్నారు. ఈ



సంస్థ నడిపేవి ఫ్యాక్టరీ స్కూల్స్ అంటారు. అవి గిరిజన సంస్కృతిని కూడా బోధిస్తున్నామనటంలో ఎంత నిజం ఉందో తెలియదుకాని, ఆ చదువు నియంగిరి సుప్రీం కోర్టు తీర్పు అమలుకావటానికి కావలసిన దేశకాల పరిజ్ఞానాన్ని మాత్రం గుర్తుచేయటంలేదు- అనేది అంతంత మాత్రంగా సాగుతున్న అమలు బట్టి స్పష్టమౌతుంది.

కానీ రోజులు మారాయి. తళుకు బెళుకు రాళ్ళకు దూరంగా నిక్కమైన నీలం వెతుక్కునే వారు, చదువుకుని రాసేవారు రాకపోరు.. మెరుగు పెట్టే వారు, ప్రసారం చేసేవారు దొరక్కపోరు.

మోదమ్మ కోడలు గంగు విహరించిన 'పూలగందువనం' పేరుతో చింతకింది శ్రీనివాసరావు, తన మాతృభూమి చోడవరం, ఒకనాటి, మత్స్యరాజ్యం మీద భక్తితో, గిరిజనులు అల్లుకున్న గేయగాథను నవలగా రాసారు. దీన్ని విశాఖపట్టణం ఆకాశవాణి ధారావాహికంగా ప్రసారం చేసింది

**విజయనగరం, గురజాడ, ఉద్యమ సాహిత్యం చుట్టూ తిరిగే, ఉత్తరాంధ్రకు మరిచిపోయిన చరిత్రను గుర్తుచేసింది.**

కొంతకాలానికి గిరిజనులే తమ ఒకనాటి పాటలు పాడుకుంటూ, ప్రదర్శనలిచ్చే రోజులు వస్తాయి.. పునరుజ్జీవించిన ఆ ఉత్సాహం హక్కుల పోరాటాలను మరో మలుపు తిప్పుతుంది,

**'ఉదరపోషణ మాత్రాన కుర్వీమీద కాకి చిరకాలమున్న ఏ కార్యమగును!".**

డా॥ గంధం సుబ్బారావు
9440624678

# "ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే కదా!"

తెలుగు కోసం, తెలుగు పిల్లలకు పిల్లలకు సరియైన చదువులకోసం పీవీ నరసింహారావుగారు పాలకునిగా చేసిన నిర్ణయాలు, కృషి సాటిలేనివి. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రెండు వాలాలకే తెలుగు విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవానికి ప్రత్యేకంగా వచ్చి చేసిన ప్రసంగాన్ని ఇక్కడ చదవండి. రెండు తెలుగు రాష్ట్రా పాలకులు పీవీగారి అభిప్రాయాలను చెవికెక్కించుకొంటే తెలుగు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మా విన్నపం

-సంపాదకుడు



**త**త్వశాస్త్రవేత్తలే సమాజానికి, దేశానికి ఉత్తమమైన పాలకులని, వారైతేనే పాలనలో న్యాయాన్ని, ధర్మాన్ని సమానంగా, సమతుల్యంగా స్వీకరిస్తారని ప్రాచీన గ్రీకు తత్వవేత్త ప్లేటో సూత్రీకరించాడు.

స్థితప్రజ్ఞుడు, అపరచాణక్యుడు, సాహితీవేత్త, మూర్తీభవించిన తెలుగుతనంగా భాసించిన పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ) గారికి ఈ సూత్రీకరణ అక్షరాలా వర్తిస్తుంది.

"అతడు మహాకవి కాలేదు. గొప్ప నవలా రచయితా కాలేదు. సంగీత విద్వాంసుడుగానో, లేదా చిత్రకారుడుగానో రూఢీ చెందలేదు. తత్వవేత్తగానో, శాస్త్రపరిశోధకుడుగానో - లేక విఖ్యాత న్యాయవాదిగానో కూడా పేరు పొందలేదు". పీవీగారి గురించి ఈ మాటలనే సాహసం చేసిన వ్యక్తి ఆయన ఆప్తమిత్రుడు, కాకతీయ పత్రిక సంపాదకులు, కీ.శే. పాములపర్తి సదాశివరావుగారు. 1972 మార్చిలో "జనధర్మ" ప్రచురించిన పీ.వీ. నరసింహారావు అభినందన సంచికలో రాసిన వ్యాసంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు.

సదాశివరావుగారంటే, బాల్యం నుంచీ శరీరాలు వేరైనా ఆత్మ ఒకటిగా పీవీని వెన్నంటి వున్న మహానుభావుడు. అందుచేత ఇవి పీవీగారు తనను తాను అంచనా వేసుకున్న మాటలుగా భావించవచ్చు.

ఈ మాటల్లో గుర్తింపవలసిన ఒక చమత్కారం వుంది. ఇక్కడ 'కాలేదు', 'చెందలేదు', 'పొందలేదు' - అంటూ చెప్పబడినవన్నీ అట్లాకావడానికి, చెందడానికి, పొందడానికి తగిన ప్రతిభాసామర్థ్యాలు పీవీలో పుష్కలంగా ఉన్నాయని నిర్ద్వంద్వంగా తెలియజెప్పటమే. పీవీ వ్యాసంగవైవిధ్యాన్ని, వ్యాపకత్వాన్ని సువ్యక్తం చేయడమే. ఆ లక్షణాలన్నింటినీ ఒకచోటికి చేరిస్తే రూపుగట్టిన వ్యక్తిత్వం పీవీ గారిది.

అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు గారు 1985 డిసెంబర్‌లో తెలుగు విశ్వవిద్యాలయాన్ని తెలుగు సాహిత్యం, భాషా సంస్కృతుల పరిరక్షణకు, అభివృద్ధి తదితర లక్ష్యాలతో స్థాపించారు. 1991 నాటికి విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఆచార్య సి. నారాయణరెడ్డి గారు పనిచేస్తున్నారు. ఆ సమయంలో విశ్వవిద్యాలయం రెండవ స్నాతకోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పుడు హైదరాబాద్‌లోనే వున్న పీవీ గారిని 1991 జూలై 7వ తేదీన జరగనున్న విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రావలసిందిగా ఆచార్య నారాయణరెడ్డి గారు ఆహ్వానించారు. అందుకు పీవీ గారు సంతోషంగా అంగీకరించారు. ఆ తరువాత జరిగిన ఆశ్చర్యకర పరిణామాల మధ్య పీవీ గారు 1991 జూన్ 21న దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అంటే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రెండు వారాలకే ఆయన తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొనవలసి వుంది. మారిన పరిస్థితుల దృష్ట్యా ఆయన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనే అవకాశం వుందో లేదో అని తర్జనభర్జన పడుతున్న సందర్భంలో ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి విశ్వవిద్యాలయానికి ప్రధాన మంత్రి గారు 7 జూలై 1991 నాడు జరిగే విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి హైదరాబాద్ వస్తున్నారని సందేశం వచ్చింది. ప్రధాన మంత్రిగా పదవిని చేపట్టిన తరువాత పీవీ హైదరాబాద్ రావడం అదే మొదటిసారి కావడంతో ఈ వార్త అన్ని వార్తాపత్రికలలో పతాక శీర్షికలో వచ్చింది. దాంతో తెలుగు విశ్వవిద్యాలయం ప్రాధాన్యత అమాంతం పెరిగిపోయింది.

ఆ సమయంలో తెలుగు విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం బాధ్యతలను నేనే నిర్వహిస్తున్నందున హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే స్నాతకోత్సవంలో ప్రధాని పాల్గొంటున్న సందర్భంగా జరిగిన ఏర్పాట్లను బాగా దగ్గరగా చూసే అవకాశం నాకు లభించింది. ఉదయమే రవీంద్రభారతి ప్రాంగణాన్నంతా స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (SPG) వారు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

ప్రధాని నిర్ధారిత సమయానికి రవీంద్రభారతికి వచ్చారు. స్నాతకోత్సవం ప్రారంభమై పీవీ గారు మాట్లాడే సమయానికి ఆయన

ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్‌లో ప్రధానిగా అది ఆయన మొదటి సమావేశం. ఉపన్యాసం ప్రారంభిస్తూ, ఆయన ఈ విషయమే చెప్పారు. మొదటిసారి హైదరాబాద్ వచ్చి తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకి ఆనందాన్నే కాక ఎంతో ఉద్వేగాన్ని కూడా కలిగిస్తున్నదని, హైదరాబాద్ రావడం తన తల్లి ఒడికి వచ్చినట్టుగా వుందని అంటూ "ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే కదా!" అన్నారు. వెంటనే ఆయన కంఠం గాద్గదికమైంది. ఒక అర నిమిషం మాట్లాడలేకపోయారు. ఆ తరువాత తేరుకుని తన స్నాతకోత్సవ ప్రసంగాన్ని ఈ విధంగా కొనసాగించారు :

**"విద్యలో సాంస్కృతిక పరిమళం రంగరించాలి:**

తెలుగు విశ్వవిద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవంలో పాల్గొంటున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. విశ్వవిద్యాలయం అధ్యక్ష, ఉపాధ్యక్షులూ, పాలకమండలి సభ్యులూ, ఈ స్నాతకోత్సవానికి నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం నా పట్ల వారికున్న అభిమానానికి నిదర్శనంగా భావిస్తున్నాను. ముందుగా వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

మే మాసం రెండవ వారంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డి గారు నన్ను కలిసి, స్నాతకోత్సవం గురించి ప్రస్తావించి, ఆహ్వానించినప్పుడు కాదనలేకపోయాను. ఇందుకు ప్రధానంగా రెండు కారణాలున్నాయి. మొదటిది – ప్రఖ్యాత కవులు, అత్యున్నత జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలైన డా. సి. నారాయణరెడ్డి గారు నా చిరకాల మిత్రులు. ఈ విశిష్ట విశ్వవిద్యాలయ కార్యకలాపాల ప్రగతి గురించి ఆయన వివరించినప్పుడు నేను సంతోషించాను. అధ్యాపకుల్నీ, విద్యార్థుల్నీ స్వయంగా అభినందించవచ్చుననే ఉద్దేశ్యంతో ఆహ్వానానికి సమ్మతించాను. రెండవ కారణం–ఆంధ్రప్రదేశ్‌కు, అందులోనూ హైదరాబాద్ నగరానికి రావడం నాకు ఎప్పుడూ ఆనందప్రదమే. నా స్వగ్రామం ఈ రాష్ట్రంలోనిదే. అక్షరాలు దిద్దుకున్నది ఈ గడ్డ మీదనే. దేశ సేవకు తొలి అడుగు వేసింది ఇక్కడే. అందుచేతనే ఇక్కడున్న మిత్రులనూ, సహచరులనూ కలుసుకునే అవకాశం కలుగుతుందనే కోరికతో కూడా ఈ ఆహ్వానాన్ని మన్నించాను.

భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్ భారతదేశానికి నడిబొడ్డున వున్న రాష్ట్రం. ఇది ఉత్తర, దక్షిణ భారతాలకు వారధిగా నిలుస్తుంది. ఇక్కడ ఉత్తర, దక్షిణ భారత సంస్కృతుల సమ్యక్ మేళనం కనిపిస్తుంది. తూర్పున సుదీర్ఘ సాగర తీరముండగా, మిగిలిన మూడు వైపులా ఒరియా, హిందీ, మరాఠీ, కన్నడ, తమిళ ప్రాంతాలున్నాయి. రాష్ట్రం ఉత్తర, దక్షిణ భారతాల సంగమంగా పరిఢవిల్లితే, రాజధానీ నగరం హైదరాబాద్ భారతదేశానికే స్థూల ప్రతిరూపంగా విరాజిల్లుతున్నది. ఈ నగరంలో వివిధ మతాలు, వివిధ భాషలు, వివిధ సంప్రదాయాలు సమైక్యంగా వర్ధిల్లుతున్నాయి. దేశవ్యాప్త భాషగా ప్రవర్తిల్లే ఉర్దూ ఈ నగరంలో ప్రత్యేక స్థానాన్ని వహిస్తున్నది. వాస్తవానికి ఉర్దూకూ, హైదరాబాద్ సంస్థాన్ చరిత్రకూ అవినాభావ సంబంధం వుంది. ఉర్దూ మాధ్యమంగా 1919లోనే బోధన ప్రారంభించి, దేశంలోనే ఇందుకు ఆదర్శంగా నిలిచిన ఉన్నత విద్యా సంస్థ హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం. ప్రధాన మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రప్రథమంగా హైదరాబాద్ రావడం నాకు భారత దర్శన అనుభూతిని కలిగిస్తున్నది.

భారతదేశాన్ని ఎందరెందరో మహానుభావులు తమ కావ్యాలలో వర్ణించారు. బంకించంద్ర ఛటర్జీ ఈ దేశ మహిమాన్విత రూప వైభవాన్ని "వందేమాతరం" గీతంలో మనోహరంగా చిత్రించారు. అయితే, విశ్వకవి రవీంద్రుడు తన గీతంలో అభివర్ణించిన తీరు అత్యద్భుతం. మన దేశ స్వరూపాన్ని భారతీయులు పదే పదే స్మరించుకునే విధంగా అందులో వున్న ప్రాంతాల పేర్లను అక్షరబద్ధం చేశారు. ఈ జనగణమన గీతాన్ని మనం జాతీయ గీతంగా స్వీకరించి, మన విజ్ఞతను నిరూపించుకున్నాం. ఆ రకంగా మన సువిశాల మాతృదేశాన్ని నిత్య వందనంగా చేసుకున్నాం.

అత్యంత ప్రాచీనమైన భారతావని సహస్రాబ్దాల ఉజ్జ్వల చరిత్రను గర్భీకరించుకుంది. ఆర్యులు గంగా, సింధు మైదాన కార్యక్రమానికి తరలి వచ్చిన తరువాత ఆర్యావర్తంగా మారి శతధా వికాస ప్రస్థానం సాగింది. మన వేద వాఙ్మయం సకల మానవాళికి విజ్ఞాన సంపద పంచింది. ఇక్కడ బౌద్ధ, జైనాది మతాలు ఉద్భవించి, ప్రపంచానికి నూతన తేజాన్ని ప్రసరింపజేశాయి. అనేక రాజవంశాలు ఈ సీమను పాలించాయి. ఆయా కాలాల్లో ఈ దేశం ఎన్నెన్నో దండయాత్రలకు లోనైంది. అయినా, అన్నిటికీ తట్టుకుని అచంచలంగా నిలిచింది. అనైక్యత వల్ల కలిగే ప్రమాదాలేలా ఉంటాయో చరిత్ర నుంచి ఈ దేశం గుణపాఠాలు నేర్చుకుంది. అనేక జాతులు వారికి, అనేక మతాల వారికి, అనేక భాషల వారికి ఇది నివాస స్థానమయింది.

ఎన్ని పరిణామాలు వచ్చినా ఆత్మసదృశ్యమైన భారతీయులకు ఎన్నడూ విఘాతం వాటిల్లలేదు. అంతేకాదు, ప్రతి పరిణామంలోనూ భారతీయ ముద్ర ప్రస్ఫుటంగా చోటుచేసుకుంది. శతాబ్దాల చరిత్రను సింహావలోకనం చేసుకుంటే ఈ యదార్థం స్పష్టమవుతుంది. మతం కావచ్చు, భాష కావచ్చు, సంప్రదాయం కావచ్చు, కళ కావచ్చు–మరేదైనా కావచ్చు. బహిరంగంగా భిన్నభిన్నంగా వున్నట్లు తోచినా విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే, అవి ఏకసూత్రబద్ధమైనవేననే సత్యం ఆవిష్కృతమౌతుంది. అందుకే భారతదేశం ప్రపంచ దేశాలకు భిన్నత్వంలో ఏకత్వ భావనకు ప్రతీకగా ఖ్యాతి వహించింది. ఈ మౌలిక సత్యాన్ని ప్రతి భారతీయుడు సరైన దృక్పథంతో అవగాహన చేసుకోవాలి. అప్పుడు భావాలన్నీ విశాలతరమౌతాయి. కేవలం వైవిధ్యాన్నీ, భిన్నత్వాన్నీ మాత్రమే దర్శించి, ఏకత్వాన్ని విస్మరించినప్పుడు విశాలదృష్టి కొరవడుతోంది. ఆలోచన సంకుచితమౌతుంది.

భిన్నత్వంలో ఏకత్వాన్ని ఉదాహరణగా దేశ భాషారంగం గురించి పరిశీలిద్దాం. మనది బహుభాషాదేశం. ఇంతకు ముందు ప్రస్తావించిన చారిత్రిక, సాంఘిక, సాంస్కృతిక కారణాల వల్ల ఇక్కడ నాలుగు ప్రధాన భాషా కుటుంబాలు చోటు చేసుకున్నాయి. ఇండో–ఆర్యన్, ద్రవిడ భాషలే కాకుండా ఇతర భాషా కుటుంబాలు కూడా మన దేశంలో వున్నాయి. భాషా శాస్త్రవేత్తలు తెలిపిన ప్రకారం మన దేశంలో 179 భాషలు, 544 మాండలికాలు వ్యాప్తిలో వున్నాయి. వీటిలో 15 ప్రాంతీయ భాషలను మాత్రమే మనం భారత రాజ్యాంగంలో చేర్చగలిగాం. 36 భాషల్ని ఆధునిక భారతీయ భాషలుగా పరిగణిస్తున్నాం. సంస్కృతం, పాళీ, అర్ధమాగధి, ప్రాకృతాలను ప్రాచీన భాషలుగా స్వీకరించాం. మన విద్యా వ్యవస్థలో అరబిక్, పర్షియన్, లాటిన్ మొదలైన 7 విదేశ ప్రాచీన భాషలకూ, ఇంగ్లీష్ కాకుండా జర్మన్, స్పానిష్, ఇటాలియన్, ఫ్రెంచి, రష్యన్, చైనీస్ వంటివి 8 ఆధునిక విదేశీ భాషలకు కూడా స్థానం కల్పించాం.

ఇంత వైవిధ్యం, భాషా బాహుళ్యం ఉన్నప్పటికీ దేశంలోని వివిధ ప్రాంతీయ భాషల్లో వెలువడే సాహిత్యంలో మౌలికమైన సారూప్యం గోచరిస్తుంది. అందుకే వివిధ భాషల్లో రాసినా భారతీయ సాహిత్యమంతా ఒక్కటే అనే భావాన్ని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ సూత్రప్రాయంగా చెప్పారు. ఈ సారూప్యాన్ని అర్థం చేసుకున్నప్పుడు సర్వ భాషాసాహిత్యాలు ఆత్మీయంగానే అగుపిస్తాయి. ఇలాంటి సదవగాహన భాషాసమైక్యతకు మూల భిత్తిక అవుతుంది. ఈ వైవిధ్యంతో భాషారంగాన్నీ, సాహిత్యరంగాన్నీ సుసంపన్నం చేసుకోడానికి శతాబ్దాల నుంచి మన పూర్వీకులు కృషి చేశారు. దేశమంతటా ఒకే భాష వుంటే మనకు ఇన్ని గ్రంథాలు, ఇంత విస్తృత సాహిత్యం, ఇందరు మహాకవులు వుండేవారు కారేమో! సంస్కృతంలో ఆదికవి వాల్మీకి రామాయణాన్ని రచించినా అనేక ప్రాంతీయ భాషల్లో దానికి దీటుగా నిలిచే రామాయణాలెన్నో అవతరించాయి. అనువాదాలు కూడా ఉన్నత సాహితీ ప్రాగల్భ్యాన్ని అందుకున్నాయి. తమిళంలో 'కంబ రామాయణం', హిందీలో తులసీదాస్ 'రామచరిత మానస్', తెలుగులో 'భాస్కర రామాయణం', మలయాళంలో 'ఎజుత్తచ్చన్ ఆధ్యాత్మ రామాయణం', మరాఠీలో ' ఏకనాథ్ రామాయణం' మొదలైనవి కేవలం భారతీయులే కాక విశ్వపౌరులు చదివి, ఆనందించే గ్రంథాలు.

ఇదే విధమైన పరిణామాన్నీ, అభ్యుదయ వికాసాలనూ, ప్రతి రంగానికీ అనువర్తించుకోవచ్చు. అప్పుడు భారతీయ భాషా సాహిత్యాలు, కళా సంస్కృతులు, ఆచార సంప్రదాయాలు మొదలైనవి బహుముఖంగా శోభిల్లుతున్న పూర్ణ స్వరూపం మన కళ్ళల్లో మెదులుతుంది. అది మాతృభారతి సమలంకృత స్వరూపానికి మణిముకురంగా నిలుస్తుంది.

ఇందుకు భిన్నంగా ఈ దృష్టిలో, ఆలోచనా రీతిలో వైపరీత్యం ఉన్నట్లయితే సమైక్యతా రూప చిత్రణ మేధకు అందదు. అడుగడుగునా అడ్డుగోడలు నిలుస్తాయి. ఆత్మీయ భావం కొరవడుతుంది. స్వార్థం ముందుకు వచ్చి ప్రతి దానికి పరిధులు ఏర్పర్చుకునే సంకుచిత మనస్తత్వం అలవడుతుంది. పొరుగు వారిని మన్నించి, ప్రేమించగల తత్త్వం మసక బారుతుంది. ఇది సమైక్య భావానికీ, దేశ సమగ్రతా చింతనకూ గొడ్డలిపెట్టు.

విశాల భావసరళి లోపించినప్పుడు వైషమ్యాలు పెరుగుతాయి. ప్రతికూల వైఖరి, అమిత్ర భావం ఇనుమడిస్తాయి. క్రమంగా ఘర్షణలు ఏర్పడతాయి. దౌర్జన్యాలు చెలరేగుతాయి. ఈ మాదిరి అవాంఛనీయ పరిస్థితులు ప్రపంచంలోని అనేక దేశాల్లో తలెత్తుతూనేవున్నాయి. హింసా ప్రవృత్తి విజృంభించి శాంతియుత ప్రజా జీవనాన్ని భంగపరుస్తున్నది. ప్రభుత్వ ఆస్తులు, ప్రజల ఆస్తులు, అంతకంటే విలువైన ప్రాణాలు ఆవిరవుతున్నాయి. ఏ దేశానికీ ఈ పరిస్థితి వాంఛనీయం కాదు. అందులోనూ, భారతదేశం లాంటి వర్ధమాన దేశం ఇలాంటి పరిస్థితుల వల్ల విపరీతంగా నష్టపోతుంది. ఆరోగ్యం, జనాభా, ఉపాధి మొదలైన రంగాల్లో ఏర్పడుతున్న సమస్యలను సంఘీభావంతో, సమిష్టి దృక్పథంతో ఎదుర్కోవలసిన ఈ తరుణంలో సమాజ ప్రగతిని కుంటు పరిస్తే, దేశం తట్టుకోలేదు. ఈ సత్యాన్ని గ్రహించి, చిత్తశుద్ధితో దేశాభ్యుదయం కోసం సంఘటితంగా కృషి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా వుంది.

ముఖ్యంగా యువకులూ, విద్యార్థులూ ఈ బృహత్తర కార్యక్రమంలో తమ వంతు పాత్రను త్రికరణ శుద్ధితో నిర్వహించవలసి వుంది. ఒక సందర్భంలో వివేకానందుడు "భారతదేశ ధూళి నాకు పరమ పవిత్రం. భారతదేశం నాకు పవిత్ర క్షేత్రం. ఈ దేశం ఉద్ధరణ చెంది తీరుతుంది. ఏ బాహ్య శక్తీ ఈ దేశాన్ని ఇంక నిరోధించలేదు" అని ఉద్ఘాటించారు. ఆ మహనీయుని ఆకాంక్షకు చెరిగిపోని ఆకృతి కలిగించే బాధ్యత పౌరులందరిదీ.

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలోనూ, జాతిని శక్తిమంతంగా పునర్నిర్మించడంలోనూ యువకులు ప్రధాన భూమికను వహించవలసిన సమయమిది. 18 సంవత్సరాలకే ఇప్పుడు ఓటు హక్కు చేకూరుతున్నది. దేశాధికారాన్ని నిర్ణయించే అవకాశం కూడా వారికుంది. దేశంలో సాంకేతిక విద్యావ్యాప్తికి ఆనాడే పండిత జవహర్‌లాల్ నెహ్రూ పునాదులు వేశారు. భారతదేశం శీఘ్రగతిని అభివృద్ధి చెంది, పురోగామి దేశాలతో సరితూగాలంటే దేశంలో వైజ్ఞానిక విద్య ఎక్కువగా వ్యాప్తి కావాలని ఆయన భావించారు. ఆయన 'విజ్ఞాన శాస్త్రం పట్ల నాకు అత్యంత విశ్వాసం వుంది. శాస్త్రీయ దృక్పథం ప్రపంచాన్ని పూర్తిగా మార్చివేయగలుగుతుంది' అని అన్నారు.

ఇప్పుడు విద్యా విధానం వినూత్న రూపం సంతరించుకుంటున్నది. రాజీవ్ గాంధీ సారథ్యాన రూపుదిద్దుకున్న నూతన జాతీయ విద్యా విధానం దీనికి భూమికగా వుంది. విద్యా వ్యవస్థ సర్వ సమగ్రంగా నిర్వహించవలసిన పాత్రను నిర్వహించడమే కాకుండా ఈ జాతీయ విద్యా విధానం విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శక సూత్రాలు నిర్దేశించింది. వాటిని ఈ స్వాతకోత్సవ సందర్భంలో ఒక్కసారి గుర్తు చేసుకోవడం సముచితమని భావిస్తున్నాను.

ఈ నూతన విద్యా విధానంలో శాస్త్ర, సాంకేతిక, వృత్తి విద్యలకూ, సార్వత్రిక, వయోజన విద్యలకూ, బాలికల విద్యలకూ, సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే విద్యకూ ప్రత్యేక ప్రాధాన్యం వుంటుంది. ఈ విధానం విద్యారంగంలో సమతను కాంక్షిస్తుంది. జాతీయ సమగ్రతను ఇది రక్షిస్తుంది. ఉమ్మడి పాఠ్య ప్రణాళిక ఈ విధానంలోని ఒక ప్రత్యేకత.

ఈ జాతీయ విద్యా విధానం విద్యా రంగంలో నూతన స్ఫూర్తిని పెంపొందించగలదని ఆశిస్తున్నాను.

ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ పురోగామిగా వుండడం ప్రశంసనీయం. కేంద్రం ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని స్థాపించక ముందే దేశంలో ప్రప్రథమంగా ఈ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, ఈ దిశలో మార్గదర్శకమైంది.

కొత్తగా స్థాపించిన తెలుగు విశ్వవిద్యాలయం బాలారిష్టాలను దాటి బోధన, పరిశోధన, ప్రచురణలతో పాటు ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యక్షుల నివేదిక ద్వారా తెలుసుకుని సంతోషిస్తున్నాను. ఇదొక విలక్షణమైన ఉన్నత విద్యా సంస్థ. భాషా సాహిత్యాలకూ, కళా సంస్కృతులకూ ఇందులో ప్రత్యేక ప్రాధాన్యం లభించడం ముదావహం. వ్యక్తిత్వ విలసనానికి సంస్కృతి, కళలు ఎంతో దోహదం చేస్తాయి. 'సంస్కృతి సమస్కందుల మధ్యా, ఉన్నతుల మధ్యా వ్యక్తికి సముచిత స్థానం సమకూరుస్తుంది. అతనిలో ఉదాత్తమైన స్పందనను కలిగిస్తుంది' అని ఎమర్సన్ మహాశయుడు

ఏనాడో అన్నాడు.

**ఈ విశ్వవిద్యాలయంలో తెలుగు మాధ్యమంలో బోధన జరుగుతున్నందుకు కూడా నా హర్షం ప్రకటిస్తున్నాను. ప్రాంతీయ భాషల్లో విద్యాబోధన, పరిపాలనా నిర్వహణ జరగాలని స్వరాజ్యోద్యమంలో ఒక భాగంగా విస్తృత కృషి జరిగిన సత్యం మీకు తెలిసిందే. మహాత్ముని నిర్మాణ కార్యక్రమంలో ప్రాంతీయ భాషల అభివృద్ధి ముఖ్యాంశంగా వుంది. మాతృభాషల గురించి చెబుతూ ఒక సందర్భంలో గాంధీజీ – 'నాకు ఇంగ్లీష్ భాష పట్ల వైర భావం ఎన్నడూ లేదు. అది అపారమైన జ్ఞాన నిధి అని నాకు తెలుసు. అయితే, మనం మన మాతృభాషలను విద్యా రంగంలో మాధ్యమాలుగా చేసేందుకు బృహత్తరమైన ప్రయత్నం చేయాలి' అని అన్నారు. ఆయన ఇంకా – ' చాలా మంది మన దేశ భాషల్లో పెద్ద పెద్ద భావాలను వ్యక్త పరచేందుకు తగిన పదజాలం లేదని సందేహిస్తూ వుంటారు. అయితే, అలాంటి పదజాలం లేకపోవడం ఆ భాషల లోపం కాదు. అది మన లోపమే. భాషల్ని వాడుకలోనికి తీసుకువచ్చి అభివృద్ధి పరచడం మన కర్తవ్యం' అని హెచ్చరించారు.**

**జవహార్ లాల్ నెహ్రూ ఒక సందర్భంలో 'ప్రజలు తమ మాతృభాషల ఆధారంగానే విద్యాపరంగానూ, సాంస్కృతిక పరంగానూ వికాసం చెందుతారనడం యదార్థం' అని ఉద్ఘాటించారు.**

**ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన తెలుగు అకాడమీ బోధనకు అవసరమయ్యే పదజాలాన్నీ, గ్రంథాలనూ రూపొందించడంలో అవిరళంగా కృషి చేస్తూ వుండడం మెచ్చదగింది. పరిపాలనా రంగంలో తెలుగును అభివృద్ధి పరిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడం గమనార్హం. దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ లేని 'అధికార భాషా సంఘం' ఆంధ్రప్రదేశ్ లో పనిచేస్తూ వున్న విషయం ఈ సందర్భంలో పేర్కొనవలసి వుంది.**

ఈ రాష్ట్రంలో ప్రభుత్వం త్రిభాషా సూత్రాన్ని పటిష్టంగా అమలు పరచడం సంతోషదాయకం.

తెలుగు విశ్వవిద్యాలయ అధ్యయనాంశంలో లలిత కళలకు ప్రత్యేక స్థానం వున్నట్లు వెల్లడవుతున్నది. నృత్యం, సంగీతం, జానపద కళలు మొదలైనవి భాషా పరిధులకు అతీతమైనవి. సార్వజనీనత, సార్వకాలికత వీటి ప్రత్యేకత. ఆనందాన్ని పంచడంతో పాటు ఇవి ప్రజల్ని సన్నిహితుల్ని చేస్తాయి. వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతాయి.

దేశాభ్యుదయంలో, జాతి ప్రగతిలో సాంస్కృతిక రంగం కీలక స్థానం వహిస్తుంది. జాతి సమగ్రతను పరిపుష్టం చేయడంలో కళలు వహించే పాత్ర బృహత్తరమైనది. సమైక్యతా భావాన్ని కేవలం రాజకీయానికే పరిమితం చేయకూడదు. అలాంటి సమైక్యతలో పరిపూర్ణత లోపించే అవకాశముంది. సాంస్కృతిక సమైక్యత వల్లనే నిజమైన భావ సమైక్యత సిద్ధిస్తుందనడంలో సందేహం లేదు. వివిధ భాషలు, వివిధ మతాలు, వివిధ సంప్రదాయాలు సమైక్యమైనపుడే సమధిక సుస్థిరత, సంపూర్ణ సమైక్యత నెలకొంటాయి. అందుకే ఈ దిశగా మన దృష్టిని సారించవలసి వుంది.

ఆంధ్రప్రదేశ్ కళలకు కాణాచి. కూచిపూడి నృత్య సంప్రదాయం తెలుగుజాతి నాట్య ప్రపంచానికి అందించిన ఎనలేని కానుక. కూచిపూడి నృత్యంలో తెలుగు విశ్వవిద్యాలయం ఎం.ఏ కోర్సు నిర్వహించడం సముచితంగా వుంది. తెలుగు జాతికి గర్వకారణమైన మరొక నాట్య శైలి పేరిణి శివతాండవం. ఇది వీరరస ప్రధానమైన నాట్య రీతి. జాయప సేనాని నృత్య రత్నావళి దీనికి వర్తించే శాస్త్ర గ్రంథం. ఇందులోని శ్లోకాలను ఆధారంగా చేసుకుని వరంగల్ సమీపంలోని రామప్ప ఆలయంలో వివిధ భంగిమల్లో అద్భుత శిల్పాలు చెక్కబడి వున్నాయి. ఈ నాట్య సంప్రదాయానికి తగిన ప్రచారం లభిస్తూ వుండడం మెచ్చతగింది.

లలిత కళల సర్వతోముఖ వికాసానికి ఈనాడు మరింత కృషి అవసరం. ప్రసార సాధనాలు శీఘ్రగతిని అభివృద్ధి చెందుతున్నాయి. అవి ప్రజలపైన బలీయ ప్రభావం చూపుతున్నాయి. ఈ సాధనాల ద్వారా ప్రజానీకానికి అందే కార్యక్రమాలు విజ్ఞానదాయకంగానూ, వినోదాత్మకంగానూ వుండాలి. ఇందుకు సుశిక్షితులైన యువతీయువకులు బద్ధ కంకణులు కావాలి. చలన చిత్రాలు, రంగస్థల కార్యక్రమాలు, ప్రదర్శన కళలు, ఆకాశవాణి, దూరదర్శన్ ప్రసారాలు – ఏవైనా సరే ప్రజల్లో ఏ మార్గాన్ని కూడా పెడమార్గం పట్టించేవిగా వుండకూడదు. ఈ విషయంలో విజ్ఞులు సర్వదా అప్రమత్తంగా వుండాలి. ఈ విశ్వవిద్యాలయం 'నటనాకళ' లో త్వరలో ఒక కోర్సును ప్రవేశపెట్టడం సముచితంగా వుంది. అన్ని రంగాల్లోనూ ఉత్తమ శిక్షణకు ఇది వేదిక కావాలి.

ఈనాటి స్నాతకోత్సవంలో పరిశోధకులు, విద్యార్థులు పట్టాలు స్వీకరించారు. ప్రతిభావంతులైన వారికి స్వర్ణ పతకాలు లభించాయి. ఆయా కోర్సుల్లో ఉత్తీర్ణులై భావి జీవితంలో ప్రవేశిస్తున్న ఈ శుభసందర్భంలో విద్యార్థుల్ని అభినందిస్తున్నాను. ఇందుకు ఎంతో శ్రమించి అధ్యాపక బృందాన్నీ, ఉపాధ్యక్షులనూ కూడా అభినందిస్తున్నాను.

ఈ విద్యార్థులు భవిష్యత్తును ఉజ్జ్వలంగా తీర్చిదిద్దుకోగలరనీ, దేశ సర్వ సమగ్రతకూ, అభ్యుదయానికీ దోహదం చేయగలరని విశ్వసిస్తున్నాను.

ఈనాటి స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్లు అందుకున్న ప్రముఖ పత్రికా సంపాదకులు డా. నండూరి రామమోహనరావు గారికీ, ప్రసిద్ధ సినీనటులు, భాషా సాహితీవేత్తలు, డా. కొంగర జగ్గయ్య గారికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను.

ఈ స్నాతకోత్సవంలో పాల్గొనే అవకాశం ఇచ్చినందుకు తెలుగు విశ్వవిద్యాలయం వారికి మరోసారి నా కృతజ్ఞతలు తెలుపుతూ, అందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను".

## కథల పోటీ

**ఇప్పుడైతే** సంకరజాతి జెర్సీ ఆవులు వచ్చి పాలు కావలసినన్ని అందుబాటుకు వచ్చాయి. ఒకానొకనాడు పాలిచ్చి ఆదుకొన్నవి ఎనుములే(బర్రెలు)! పల్లెల్లో ఆ ఎనుములకు ప్రజలకూ అవినాభావ సంబంధం. దానిని వివరిస్తూ కథలను ఆహ్వానించాం. ఇప్పటివరకూ కేవలం 5 మాత్రమే వచ్చాయి. మరో అయిదారు వస్తే బహుమతులు ప్రకటించి పుస్తకంగా తేవాలని. నిర్ణయించాం.

మొదటి బహుమతి: 3,000/– రెండో బహుమతి: 2,000/–
మూడో బహుమతి :1,000/–

**కథలు చేరాల్సిన చివరితేదీ: 30.08.2021.**

కథల్ని 9440073636 నంబరుకు వాట్స్‌యాప్ ద్వారా కానీ, sadlapallechidambarareddy @gmail.com కు మెయిల్ కానీ చేయవచ్చు.

**'తపన సాహిత్య వేదిక' టీచర్స్ కాలనీ. హిందూపురం 515211**

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలు ఆనవాళ్లు-9

# నా కందూరు - బూరుగుల యాత్ర

**ఈ**సారి తెలంగాణాలో ఒక చారిత్రక ప్రదేశాన్ని చుట్టిరావాలనిపించింది. తెలంగాణాలో ఎన్నో చారిత్రక ప్రదేశాలు! ఎక్కడికెళ్ళడం! తెలుగువారి తొలిరాజధాని కోటిలింగాల. శాతవాహనుల మలి రాజధాని కొండాపూర్. ఇక్ష్వాకుల కాలంలో నాగార్జునకొండకు సరితూగిన ఏలేశ్వరం, విష్ణుకుండినుల రాజధాని కీసరగుట్ట, బాదామి చాళుక్యుల సాంస్కృతిక రాజధాని అలంపురం, రాష్ట్రకూటుల రాచకార్యాల తర్ఫీదు కేంద్రాలు, కళ్యాణ చాళుక్యుల, ఉపరాజధానులు పట్టణచెరువు, గంగాపురం, సమకాలీనంగా వేములవాడ చాళుక్యుల రాజధానులు బోధన్, వేములవాడ, కందూరు, చోళుల కోడూరు, పానగల్లు, రేచర్లరెడ్ల పిల్లలమర్రి, కాకతీయుల రాజధానులు హనుమకొండ, వరంగల్లు, వారి సామంతులు గోనవంశపు రెడ్ల రాజధాని వర్ధమానపురం, పొలవాస పాలకుల పొలాస, చెఱుకురెడ్ల జలాల్‌పురం, మల్యాల వంశీయుల కొండపర్తి, విరియాల వారి కటుకూరు, రేచర్ల వెలమ (పద్మనాయకు)ల ఆమనగల్లు, రాచకొండ, దేవరకొండ... ఇలా కుతుబ్‌షాహీలు వచ్చేంతవరకూ, తెలంగాణాన్ని ఎంతోమంది రాజులు, చక్రవర్తులు, సామంతులు, మాండలికులు పాలించిన చారిత్రక స్థావరాలు కోకొల్లలు. అన్నీ కలిపి ఒక్కసారి నా చుట్టూ ముసురుకొన్నాయి. ఏ ఊరు వెళ్లడం, ఏ ఊరు వెళ్లకపోవడం నిర్ణయం ఊగిసలాడుతోంది. ఊళ్ళన్నీ దోబూచులాడుతున్నాయి.

శషభిషలమధ్య, తెలంగాణ తెలుగు చోళవంశానికి చెందిన కందూరు చోళుల పాలనాకేంద్రం కందూరు వైపు మనసు మొగ్గుచూపింది. ప్రముఖ చారిత్రక, శాసన పరిశోధకులు శ్రీ బి.యన్.శాస్త్రిగారి “కందూరు చోళుల శాసనాలు చరిత్ర, సంస్కృతి” అన్న పుస్తకం గుర్తొచ్చింది. కందూరు పోవటానికే నిశ్చయించుకొన్నాను.

కందూరుకే ఎందుకెళ్లానంటే...... కావేరీనదీతీరంలోని చోళవంశీకులు, తెలుగు నేలపై సామంతరాజులుగా, పాలించటాన వారిని తెలుగు చోడు(ళు)లనీ, పాలించిన రాజధానిపేరున పిలిచారు. అలాంటి సామంతరాజులు కందూరు నుంచి పాలించటాన వారిని కందూరు చోళులని పిలిచారు. నెల్లూరు నుంచి, కొణిదెణ నుంచి, రేనాడునుంచి, పొత్తపినుంచి, పాలించటాన వారిని ఆయా పేర్లతో పిలిచారు. కందూరు చోళులు ముందుగా కోడూరు నుంచీ తరువాత కందూరు నుంచి, కందూరు నాడు (నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల)ను క్రీ.శ.1033నుంచి క్రీ.శ.1248 వరకూ కళ్యాణ చాళుక్య, కాకతీయులకు సామంతులుగా పాలించారు. వీరి వంశ మూలపురుషుడు ఏరువభీముడు (క్రీ.శ.1025-1050). తరువాత వరుసగా తొండ (క్రీ.శ.1050-1075) రెండో భీమచోడ (క్రీ.శ.1075-1090) మల్ల (క్రీ.శ.1093-1100), ఉదయన (క్రీ.శ.1100-1104) మూడో భీమచోడుడు (క్రీ.శ1104-1125) మొదటిగోకర్ణచోడ (క్రీ.శ.1125-1128) శ్రీదేవితొండ (క్రీ.శ.1125-1129) రెండో ఉదయన (క్రీ.శ.1136-1176) నాలుగో భీమచోడ (క్రీ.శ.1176-1235) రెండో గోకర్ణ (క్రీ.శ.1176-1248)లు పాలించారు.

మహబూబ్‌నగర్ నుంచి రాయచూరు పోయేదారిలోగల కోడూరులో మొదటకొండపైన కోట కట్టుకొని పాలించారు. బస్సు, రైలులో పోయేవారికి ఇప్పటికీ ఆ కోట కనిపిస్తూ వెయ్యేళ్ల చరిత్రను చకచకా గుర్తు చేస్తుంది. కందూరులో కూడ ఒక కోట ఉంది. నేను 2001-03 మధ్య భూత్‌పూర్‌లో గోనబుద్ధారెడ్డి కూతురు కుప్పాంబిక కట్టించిన రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ఊడదీసి కట్టించినపుడు కందూరు కోటను చూశాను. చెరువు కట్టపైన ఇప్పటికీ చూడొచ్చు. బయలుదేరి షాద్‌నగర్ దాటేసరికి నల్లమల నేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు పట్నం కృష్ణంరాజు ఫోన్‌చేశాడు. నేను కందూరు పోతున్నానని చెప్పగానే తానూ వస్తానన్నాడు. ఆయన కొత్తూరు నుంచి రాగానే కందూరు పోవటానికి కారులో బయలుదేరాం. బాలానగర్‌కు పక్కనే ఉన్న బూరుగుల (హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూరుగుల రామకృష్ణారావు గారి ఊరు) గ్రామ శివారులో ఒక గుడి శిధిలావస్థలో ఉంది, చూద్దామన్నాడు. నాకు శిధిలాలంటే ఇష్టం, పదిలపరచటం మహాఇష్టం. ఎందుకంటే వాటిగురించి పత్రికలద్వారా తెలియజేస్తే ఎవరో ఒకదాత ముందుకొచ్చి, బాగుచేయించకపోతాడా అని ఒక ఆశ.

పది నిముషాల్లో బూరుగుల గుడి కెళ్ళాం. కారు దిగుతుంటేనే శిధిలాలను చూచి బాధేసింది. కేవలం గోడలు కప్పు పడిపోయి మండపంతో ఉన్న ఒక మొండి గుడి కనిపించింది. దగ్గరకెళ్లి చుట్టూ తిరిగి చూస్తే, అది ఒక త్రికూటాలయమని, మూడు వైపుల గర్భాలయ, అర్థమండపాలతో ముందున గుళ్లున్న ఆనవాళ్లు, మధ్యలో చదరంగా 16 స్థంభాల రంగమండపం, నాలుగు వైపులా నాలుగు ద్వారాలు, దక్షిణం వైపు ఒక ప్రవేశద్వారం, (మిగిలిన మూడు ఆలయాల అర్ధమండప ద్వారాలు) కనిపించాయి. పశ్చిమవైపున్న ఆలయం మాత్రం, అర్థ మండపంలో ఒక శివలింగం ప్రతిష్ఠించబడి, గర్భాలయ ద్వారంలో భైరవుని విగ్రహముంది. గర్భాలయం పునాది ఉందిగానీ పైన రాళ్ళులేవు. మిగతా రెండు ఆలయాలు గర్భాలయ, అర్ధమండపాలను ఎవరో ఎప్పుడో వలుచుకుపోయారు. మళ్లీ బాధేసింది. ఆలయ వాస్తు, ద్వారబంధాలు పైనగల శిల్పాలు మండపంలోని నంది, శివలింగం, భైరవ శిల్పాలు కాకతీయవాస్తు శైలికి అద్దం

పడుతున్నాయి. ఇంతలో ఆవూరి సర్పంచ్ కుమార్ వచ్చాడు. అతనికి ఆలయం 800 ఏళ్లనాటిదని, కాపాడుకొని, తరువాతి తరాలకు అందిస్తే బాగుంటుందన్న నాఅభిప్రాయానికి వంతబలికి మేమూ అదే ప్రయత్నంలో ఉన్నామన్నారు. బూర్గుల రామకృష్ణారావుగారి అన్న కూతురు ఆలయ పునరుద్ధరణకు పూనుకోగా, స్థానిక ఎం.ఎల్.ఏ. అంజయ్యగారు, చొరవతీసుకొని, దేవాదాయ శాఖకు ఉత్తరం రాయగా, ఆదాయంలేని ఏ ఆలయాన్నీ పునరిద్ధరించటం కుదరదనీ, తెలంగాణ వారసత్వ (పురావస్తు) శాఖను సంప్రదించమని ఉచిత సలహానిచ్చి, తప్పుకొంది దేవాదాయ శాఖ. పట్టు వదలని ఎం.ఎల్.ఏ. మళ్లీ పురావస్తు శాఖకు మరో లేఖ రాయగా, ఆ దేవాలయం మా రక్షిత కట్టడం కాదనీ, మేమేం చేయలేమని చేతులు దులుపుకుంది తెలంగాణ వారసత్వశాఖ. ఇలా రెండు శాఖల దోబూచులాటలో కొట్టుమిట్టాడుతున్న బూరుగుల కాకతీయ దేవాలయం, యధావిధిగా తన ఉనికిలో తాను మిన్నకుండిపోయింది. ఇంకేం చేస్తుంది మరి? మడిలేదు, మాన్యంలేదు, ఎవరికీ పట్టని అనాధలా అలాగే ఉండిపోయింది.

నల్లమల నేచర్ ఫౌండేషన్ కృష్ణంరాజు తాను చుట్టుపక్కల గల చిన్నచిన్న పరిశ్రమల వారిని ప్రాధేయపడగా పునరుద్ధరణ ఖర్చులో కొంత భరిస్తామన్నారన్న మాటవిని ఆ శిధిలాలయం మదిలో ఆనందం తొంగిచూచింది. సర్పంచి కుమార్ కల్పించుకొని, 'గ్రామస్థులంకూడా చందాలేసుకొంటాం, ఎలాగైనా ఈ ఆలయానికి గత వైభవం తీసుకొద్దాం' అని చెప్పటంతో నాక్కూడా కొంత ఊరట కలిగింది. ఎక్కువగా ఖర్చుకాదు, పడిపోయిన రాళ్లను యథాతథంగా వాడుకోవచ్చని వలుచుకుపోయిన మూడు గర్భాలయాలు, మండపం కప్పులకు మాత్రం కొత్త రాళ్ళు కావాలని చెప్పాను. ప్రభుత్వం చేయూత దక్కనందున, విరాళాల ద్వారా బాగుచేయిస్తే, తాను పూనుకుంటనన్నాడు సర్పంచి. దానికితోడుగా, కృష్ణంరాజుకూడ తన వంతు ప్రయత్నాలు చేస్తానన్నాడు. మళ్లీ మరో శిధిలాలయం పదిలమౌతున్నందుకు నాకెంతో ఆనందమనిపించింది. వెలవెలబోతున్న ఆలయం కళకళలాడుతుందన్న ఆశ నన్ను పరవశుణ్ణి చేసింది.

మళ్లీ కారెక్కాము. గంట సేపట్లో భూత్‌పూర్ చేరుకొన్నాం. నేను



పునరుద్ధరించిన ఆలయాన్ని కలియదిరిగి, అక్కడున్న కళ్యాణ చాళుక్యచక్రవర్తి ఆరో విక్రమాదిత్యుని క్రీ.శ.1121 నాటి శాసనాన్ని, కాకతీయ గణపతి దేవుని క్రీ.శ.1259 నాటి శాసనాన్ని, కాకతీయ రుద్రమదేవి (మల్యాలగుండని) క్రీ.శ.1272 నాటి శాసనాన్ని, కాకతీయ రుద్రమదేవి (క్రి.శ.1277 నాటి (మల్యాల గుండని భార్య కుప్పాంబిక) శాసనాలను ఒకసారి తడిమి చూచి 900ల ఏళ్ళనాటి చరిత్రను నెమరు వేసుకొన్నాను. మళ్లీ బయలుదేరి కందూరు పోదామనుకుంటుండగా, భూత్‌పూర్‌కు చెందిన పంచవటి ఆసుపత్రి అధినేత శ్రీకాంత్‌రెడ్డి కలిశారు. చాన్నాళ్ళ తరువాత కలిశాం. 'మీరు పోల్కంపల్లిలో కట్టిన ఆలయాన్ని చూద్దురుగాని రండి' అన్నారు. నేను, గోపాల్ కలిసి కట్టిన ఆ ఆలయాన్ని చూడాలనిపించింది. నేను ఆయన కారులో ఎక్కి, నేరుగా పోల్కంపల్లి కొండమీద గజపృష్ఠాకారంలో కాలంలో నిర్మించిన సు4ందరతర ఆలయాన్ని చూచి, ఇది నిజంగా నేను కట్టిన ఆలయమేనా అని ఆశ్చర్యపోయాను. ఇది పూర్తిగా కొత్త ఆలయం. ఆలయంలోపల శిల్పాలు, అలంకరణ భక్తులనిట్టే ఆకర్షిస్తున్నాయి. ఆలయం నిర్మించటం ఒక ఎత్తైతే, నిర్వహణకు నెలకు 50 వేలు ఖర్చుపెట్టి, భక్తులకు సౌకర్యాలు కల్పించటంలో నిజమైన ఆనందముందన్నారు శ్రీకాంత్‌రెడ్డి. వాళ్లనాన్న నరసింహారెడ్డి ఎం.ఎల్.సీ. నీతిమంతుడు. సేవా తత్పరుడు, దైవభక్తిగలవాడు. ఆయన గుణగణాలను పుణికిపుచ్చుకొన్న శ్రీకాంత్‌రెడ్డిలో కూడా ఆధ్యాత్మికత, దాతృత్వం అలానే వంటబట్టాయి. ఆయన అక్కడే ఉంటానని చెప్పగా, నేను, కృష్ణంరాజు బయలుదేరాం.

తిరిగి వెళ్తుండగా పోల్కంపల్లి చెరువు కట్టమీద వరసగా విగ్రహాలు కనిపించాయి, కారాపి దిగి, విగ్రహాలదగ్గరకు వెళ్ళాం. నాతోపాటు కృష్ణంరాజు, భూత్‌పూర్ దేవాలయ కమిటీ సభ్యులు, అశోక్‌గౌడ్ ఉన్నారు. వరుసగా ఉన్న ఒక విరిగిన విగ్రహం, వీరభద్రుడు, విరిగిన తల, ఒకదేవత, మరో రెండు తలలు, తలలేని, నిలబడి ఉన్న భైరవుడు, ఒక శివభక్తుడు, సూర్య విగ్రహాలు వెయ్యేళ్ళ చరిత్రను ఒడిసి పట్టుకొని, ఒద్దికగా నిలబడి ఉన్నాయి. ఒకటి రెండు రాష్ట్రకూట, ఒకటి కళ్యాణచాళుక్య, మరో రెండు కాకతీయుల కాలానికి చెందిన ఈ శిల్పాలు పోల్కంపల్లి గ్రామ చరిత్రకు సాక్ష్యంగా ఉన్నాయి.

ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకప్పుడు ముందుకొచ్చి విరిగిపోయి, వొరిగిపోయిన ఈ దేవతామూర్తుల్ని మానవతా దృక్పంధంతోనైనా, వాటిపైన కప్పు ఏర్పరచి, భద్రపరచకపోతారా అన్న ఆలోచనతో చెరువుకట్టదిగి, కారులో ఎక్కానోలేదో, ఎదురుగా మరో హృదయ విదారక దృశ్యం నా కంటపడింది. గ్రామ అభివృద్ధిలో భాగంగా, రోడ్డు వేస్తున్న కాంట్రాక్టరు, నాగులకట్ట అనేచోట, ఏకంగా నాలుగు నాగదేవతలు, ఒక నంది విగ్రహంపైన ఎక్సవేటర్‌తో మట్టినితెచ్చి, పరచి, చదును చేశాడు. చుట్టు పక్కలవాళ్లు చూస్తూనే ఉన్నారుగానీ, తరతరాలుగా పూజలందుకొంటున్న నాగదేవతలు మట్టిపొరల్లో కనుమరుగౌతున్నా, ఆ విగ్రహాలను అలా పూడ్చడమేమిటని అడిగిన పాపానపోలేదు. నేను,కృష్ణంరాజు, అశోక్‌గౌడ్ కిందికిదిగి

ఆ విగ్రహాలదగ్గరకెళ్ళి, చేతులతో కొంచెం మట్టిని తొలగించాం. చుట్టుపక్కల వాళ్లకు చెప్పి, వాటిని కాపాడుకోవాలని చెప్పాం. వాళ్ళూ అలాగేనని మౌనంగా తలూపారు. ఆ విగ్రహాలుకూడా మౌనంగానే జరిగిందంతా చూస్తూ, మానవస్వార్థం ముందు తమ మహిమలు తలొంచక తప్పలేదని దైవత్వాన్ని పోగొట్టుకొని, దీనత్వాన్ని సంతరించుకున్నాయి. కందూరు చోళులకాలానికి చెందిన నంది పీకలలోతుదాకా మట్టిలో కూరుకుపోయి, రంకెవేసే శక్తిని కోల్పోయింది. చేతుల్లో కత్తి, డాలు పట్టుకొన్న నాలుగు నాగదేవతా శిల్పాలు, ఒక చేతిలో పద్మం, మరో చేతిలో ఒక పండును పట్టుకొన్న మరో నాగదేవత, ఆయుర్వేద మందులు నూరుకునే సానరాయి, కల్వం, నిర్లక్ష్యానికి గురవటం పట్ల మేమంతా విస్తుపోయి విజ్ఞప్తి చేయటం మినహా ఏమీ చేయలేక మళ్లీ మా ప్రయాణం కొనసాగించాం.



అసలు చూడాలనుకొన్న కందూరుకు ఒక పావుగంటలో చేరుకొన్నాం. అశోక్‌గౌడ్ తన మిత్రుడైన కందూరు సర్పంచి శ్రీకాంత్‌కు ఫోన్‌చేసి, అక్కడికొస్తున్నట్లు తెలిపాడు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కలిసిన సర్పంచి, మాకు చాయ్ తాపించాడు. 'ఇక్కడ ఇనుపయుగపు రాక్షస బండలుండాలి గదా చూద్దామా' అన్నాను. వెంటనే సర్పంచి, ఆవూరుకు చెందిన మరో ఇద్దరు, మేం ముగ్గురం అందరం కలసి ఊరుబయట తూర్పుదిక్కున గల చెల్కభూమికి వెళ్ళాం. నాలుగైదు సమాధులు మాత్రమే ఉన్నాయి. అంతకుముందు అక్కడ వంద సమాధులుండేవనీ, వ్యవసాయ పనుల్లో భాగంగా వాటిని తొలగించారనీ చెప్పినపుడు నిశ్చేష్టుణ్ణైన నాకు, చరిత్ర చెరిగిపోతున్నందుకు బాధేసి, కనీసం వీటినైనా కాపాడుకోండని ప్రాధేయపడ్డాను. ఇంతలో మాతో వచ్చిన ఒకతను, సార్ ఇదిగో ఈ రాక్షసబండ చుట్టూఉన్న రాళ్లను తొలగిస్తూ ఉండగా, ఒకపెద్దరాయి, దానికింద ఎర్రటి, నలుపు ఎరుపు మట్టి పాత్రలు బయల్పడినాయని చెప్పి, అక్కడున్న కుండ పెంకుల్ని ఏరి చూపించాడు. నలుపు, నలుపు-ఎరుపు కుండపెంకులు మెరుస్తూ, ఆనాటి కుమ్మర్ల పనితనానికి మచ్చుతునకలుగా ఉన్నాయి. ఇలా వాటిని తొలగించటం తప్పని చెప్పి ఇవి క్రీ.పూ1000 సంవత్సరాలనాటి అప్పటి మానవుల సమాధులనీ, వారు ఇనుమును కనిపెట్టి, రకరకాల పనిముట్లు తయారుచేసుకొని, వ్యవసాయాన్ని ముమ్మరంగా చేసి, చక్కటి గ్రామీణ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని, వాటి చరిత్రను చెప్పాను. అలానా, అయితే వీటిని ఇలానే కాపాడుకొంటామని, సర్పంచి హామీ ఇవ్వటంతో వెనుదిరిగిన నన్ను, మరో గ్రామస్తుడు పిలిచి 'సార్ ఇక్కడికి రండి చుట్టూ రెండు వరుసల్లో నున్న పెద్దరాళ్ల సమాధి ఇది' అని చూపించాడు. సాధారణంగా ఇనుపయుగం మనుషులు చనిపోయినపుడు శవాల్ని గుంటలోపూడ్చి, చుట్టూ ఒక్కోసారి బండల్ని నిలిపి, దానిపైన మరో బండను కప్పి, మట్టితో నింపి, చుట్టూ గుండ్రంగా పెద్దపెద్ద గుండురాళ్ళను పాతి సమాధిని నిర్మిస్తారు. కానీ ఇక్కడ బయట వరుసకు ఒకమీటరు లోపల గుండ్రంగా నిలిపిన మరో గుండురాళ్ల వరస కనిపించింది. ఇది అరుదైన సంఘటన.

చూడాల్సినవి చూచిపోతుండగా, సర్పంచి శ్రీకాంత్ మమ్మల్ని ఒకచోట ఆపి, మురుగు కాల్వ తీస్తుంటే ఈ విగ్రహం బయటపడిందని ముట్టుకుంటే ఏమైతుందోనని ఇక్కడే వదిలేశామని చెప్పాడు. దగ్గరకెళ్ళి చూచిన నాకు కళ్లు జిగేలుమనిపించాయి. నాలుగు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పు, ఆరంగుళాల మందంతో నల్ల శానపు రాతితో అత్యంత రూపలావణ్యంగా అన్ని ఆభరణాలతో తీర్చిదిద్దిన చెన్నకేశవుని విగ్రహం అది. ప్రభామండల తోరణ పైభాగం పగిలిపోయింది. కళ్యాణీచాళుక్య సంప్రదాయంలో నున్న ఈ విగ్రహాన్ని కందూరు చోళరాజులు చెక్కించారు. క్రీ.శ.11వ శతాబ్దినాటి ఈ విగ్రహాన్ని దానికిందే ఉన్న శివలింగపానపట్టం, ఒకప్పుడు ధూప,దీప నైవేద్యాలతోపాటు సుగంధ పరిమళాలను ఆస్వాదించి, కాలగతిని మురుగు కాల్వ వెదజల్లే దుర్గంధ గుబాళింపును భరిస్తూ, కాలం వెళ్లబుచ్చుతున్నాయి. చారిత్రక ప్రాధాన్యతగల ఈ విగ్రహాన్ని పంచాయితీ కార్యాలయానికి తరలించి భద్రపరచమని సర్పంచిని వేడుకున్నాను. ఆయన





తలూపాడు. నిట్టూర్పు, నిర్లిప్తతల మధ్య ముందుకు సాగిన మాకు చెరువుకట్టపైన గల కోటగోడ శిధిలాలు చిన్నపాటి సముద్రాన్ని తలపించిన కందూరు చెరువుకు చెలియలి కట్టగా తోచింది. కొంచెం ముందుకు సాగిన మాకు, లలితాసనంలో, ఒకచేత దంతం,

మరోచేత మోదకం, పైరెండు చేతుల్లో పాశం, అంకుశాలను, నాగయజ్ఞోపవీతం, జటామకుటాన్ని ధరించిన వినాయకుని విగ్రహం కనిపించింది. ఒక బండరాతిని తొలచి మలచిన ఆ విగ్రహానికి నలుపురంగు, ఆభరణాలకు బంగారపు రంగు, వెనుక గంధపురంగులను వేసి గ్రామస్తులు తమ భక్తిశ్రద్ధల్ని చాటుకున్నారేతప్ప, ఒక చారిత్రక శిల్పానికి అపచారం చేస్తున్నామన్న స్పృహలేదేమిటా అని అనిపించి, గ్రామస్తులకు ఆ విగ్రహం క్రీ.శ.12వ శతాబ్దినాటిదని, కందూరును రాజధానిగా పాలించిన కందూరు చోళులకాలం నాటిదనీ, ఇకముందు రంగులేయొద్దని, అవగాహన కల్పించాను. సరేనన్నారు. ఎవరో ఒక పుణ్యాత్ముడు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూన్న ఆ వినాయకుని విగ్రహంపైన రెండు రేకులు కప్పాడు.

అలా ముందుకెళ్లగా శిథిలాలయ పునాదుల దగ్గర, ఆలీఢాసనంలో, అంజలిముద్రతోనున్న గరుత్మంతుని విగ్రహం, కొంచెముందు,రోడ్డు పక్కనే బల్లేలతో పోరాడుతున్న ఇద్దరు యోధుల శిల్పం, రామలింగేశ్వర ఆలయంవైపు వెళ్లేదారిలో, ఎడమవైపునున్న రెండు పెద్దబండలపైన, చిన్నపాటియుద్ధదృశ్యం, పోరాడుతున్న నేలకొరుగుతున్న వీరులు ఒకపక్కగా పోరాటంలో అసువులు బాసి, వీరస్వర్గాన్ని పొందిన వీరుని శిల్పం, మరోబండపైన దశభుజి మహిషాసురమర్దని శిల్పం, కందూరుచోళుల శిల్పకళకు అద్దంపడుతూ, కట్టిపడేస్తున్నాయి.

రామేశ్వరాలయం ముందుమెట్లకు అటూ ఇటూ వీరుల శిల్పాలున్నాయి. ఆలయంలోకి ప్రవేశించిన నాకు,



ఆలయంముందు ఒక శాసనం కనిపించింది. దానిపై సున్నం, సింధూరం రంగులతోనున్న అక్షరాల్ని అతికష్టంమీద చదివితే, స్థానిక పాలకుడైన మహామండలేశ్వర చోళకురువబెట్ట కందర్పుడు, రామేశ్వర దేవునికి ఇచ్చిన దాన వివరాలు తెలిసాయి. చెట్టుకిందగల మరో విగ్రహం రంగులు పులుముకొని రూపుకోల్పోయింది. ఆలయద్వార శాఖలకు, నందికి, ద్వారపాలకులకు రంగులే రంగులు. ఆలయ పరిసరాలను పరిశీలిస్తుండగా, ప్రముఖ సినీనటులు తనికెళ్ల భరణిగారి ఫోను. 'అయ్యా మీరు అక్కడేం చేస్తున్నారు. అక్కడి కోనేరును, ఒడ్డునున్న కదంబవృక్షాల్ని చూడండి. నేను కందూరుకు చాలాసార్లు వచ్చాను. మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుంది' అని అన్నారు. కోనేరును బాగు చేయిస్తున్నారు. తవ్విన మట్టిని పరిశీలిస్తే శాతవాహనుల కాలపు ఎరుపు, మెరిసే ఎరుపు, ఊదారంగు మట్టిపాత్రల ముక్కలు కోకొల్లలుగా కనిపించాయి. ఒకపక్క ఆకలి కేకలేస్తోంది. ఆలయ చరిత్ర మాత్రం కాళ్లను కట్టిపడేస్తుంది. అర్చకుల సన్మానం తరువాత, అశోక్‌గౌడ్ భూత్పూర్‌లో ఏర్పాటుచేసిన జొన్నరొట్టె, పుంటికూర, కొర్రఅన్నం, పెరుగు, ఆవకాయ నంజుకు తింటుంటే, రుచికి అర్థం తెలిసింది. ఆతిథ్యం విలువ తెలిసింది. ఆ ఆనందంలో కందూరు కేవలం క్రీ.శ 11-12 శతాబ్దాల్లో ఒక సామంతరాజ్య రాజధానిగానే కాక, క్రీ.శ1-2 శతాబ్దాలనాటి శాతవాహన కాలంలోనూ, అంతకుముందు, అంటే క్రీ.పూ 500నాటి ఇనుపయుగంలోనూ ఒక జనావాసంగా, దాదాపు 2500 సం॥చరిత్రకు నిలయంగా ఉందన్న విషయాలను నెమరు వేసుకుంటూ భూత్పూర్‌లో కూరగాయలు తీసుకొని హైదరాబాదుకు బయలుదేరాను. ఒకపక్క జోరున వర్షం. మరోపక్క ఒక చారిత్రక ప్రదేశాన్ని చూశానన్న హర్షం. ఇంకోపక్క చరిత్ర చెరిగిపోతున్నది, కరిగిపోతున్నదన్న ఆవేదన. ఎలాగైనా కాపాడాలని ప్రభుత్వానికీ, ప్రజలకు నా నివేదన. ●

## పుస్తక పరిచయం

# కొండవీడు కైఫియతు




చరిత్ర ప్రసిద్ధిగాంచిన కొండవీడు గుంటూరు జిల్లాలో ఉంది. రెడ్డిరాజుల కాలంలో కొండవీడు ప్రశస్తిగాంచింది. ప్రోలయవేమారెడ్డి కాలంలో కొండవీడుపై కోట కట్టడం జరిగింది. కైఫియత్ పదం అరబ్బీపదం. అనగా చరిత్ర, సమాచారము అని అర్థము. బ్రిటీష్ అధికారి కల్నల్ కాలిన్ మెకంజీ గ్రామాల చరిత్రలను వ్రాయించారు. కొండవీడు కైఫియత్‌లో రచయిత పేరు లేదు. ఆ వ్రాతను గమనిస్తే డొక్కశుద్ధిగల రచయిత వ్రాసి ఉండవచ్చు. ఈ కైఫీయతులు వంటివి మెకంజీ మన కందించిన చారిత్రక వారసత్వ సంపదగా పరిగణించాలి. క్రీశ. 1325-1424 వరకు ఆరుగురు రెడ్డి రాజులు కొండవీడు రాజధానిగా పాలించారు.
పాలనాక్రమంలో గోల్కొండ నవాబు కొండవీటిని 1788లో ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి అప్పగించినందుకు కంపెనీ వారు తమ కార్యస్థానాన్ని కొండవీడు నుండి గుంటూరుకు మార్చడంతో కొండవీడు ప్రాధాన్యం తగ్గిపోయింది. 92 పేజీల ఈ గ్రంథం ఫుట్‌నోట్స్‌లతో ఎంతో సమాచారాన్ని అందించారు.
కొండవీడుకోట అభివృద్ధి కమిటి కన్వీనర్ కవి శివారెడ్డి సమర్పణలో మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో వి.వి.ఐ.టి. విద్యాసంస్థ వారు ప్రచురించారు. పుటలు 92; పుస్తకం వెల రూ. 100/-

**ప్రతులకు:** సాహితీ ప్రచురణలు, విజయవాడ ఫోన్: 0866-2436642/43.

– డా॥వెన్నిసెట్టి సింగారావు,
939301 5584

స.వెం.రమేశ్

# రాయంగల క్రిష్ణ రామానుజ పెరుమాళ్ నాయకర్ రాజనారాయణన్(కీరా)



కనువెలుగు : 14-9-1923 కనుమరుగు : 17-5-2021

*'కులము గల్గువాడు గోత్రంబు గలవాడు*
*విద్యచేత విర్రవీగువాడు*
*పసిడిగల్గువాని బానిసకొడుకులు*
*విశ్వదాభిరామ వినుర వేమ'*

**నూ**రేళ్లకు కాసంత తక్కువ ఈడులో మొన్నానడుమ కీరా కనుమరుగు అయినారు. ఆయన గురించి తమిళంలో బోలెడు కట్టురలు(వ్యాసాలు) వచ్చినాయి. తెలుగులో కూడా రెండో మూడో వచ్చినాయి. కీరా గురించి ఏమీ తెలియని ఆవగింజంతయినా ఎరుక లేని వారు ఎత్తిపోతల పతకంతో రాసిన కట్టుర ఒక నాడాకిక(దినపత్రిక)లో వచ్చింది. ఎత్తిపోతలు తెలుగువాళ్లకు తెలిసినంతగా మరొక నుడివారికి తెలియదేమో! మరొక నాడాకికలో, కీరాను కలసి మాట్లాడి వచ్చినట్లు చెప్పుకొన్న మరొకరు, మరుపేరుతో రాసిన తప్పుల తడకల కట్టుర వెలువడింది. అమ్మనుడి నుండి ఒత్తిడి వచ్చిన నాటికి వీటిని నేను చదివున్నాను. నాలుగునాళ్లు తలపోసినాను. కీరా గురించి తెలుగులో నేను రాయకపోవడం తప్పు అవుతుంది అనిపించిపడి. ముప్పయేళ్లుగా కీరాను ఎరిగిన నేను, అయన గురించి చెప్పకపోవడం తప్పు అనిపించింది. తెలుగు రాతలు తెలిసిన నేలకు(తెలంగాణాంధ్రలకు), ఆయనను తొలిసారి నెళవు చేసిన నేను, ఎరిగించకపోవడం తప్పు అనిపించింది. రాతాని(పెన్) మూతను తీసినాను.

కీరాతో నా నెళవును చెప్పుకోవాలంటే ముప్పయ్యేళ్ల వెనక్కి నా మెడను తిప్పాలి. చెన్నపట్నంలో నా చదువు కొనసాగుతున్న నాళ్లవి. మామీద తమిళపెత్తనమేమిటని నేను చిటపటలాడుతున్న నాళ్లవి. తమిళం మీద ఆ చిటపటలు నా కుటుంబం నాకు ఇచ్చిపోయిన సొత్తు. ఆ చిటపటలను ఎగదోసి నూనెపోసి కారుచిచ్చుగా మార్చిన వారు కంకణాల పుష్పరాజు. అప్పుడు నాయీడు పాతికలోపు పుష్పరాజేమో ఏభైకి దగ్గర. మా ఇద్దరి గట్టిచెలిమికి కారణం తెలుగుమీద తమిళపెత్తనం. 1992లోనో 1993లోనో ఆయన ఒక కతను నా చేతపెట్టి చదువు అన్నాడు. కత పేరు వేట్టి(తెలుగులో పంచె). చిన్నకత. చెప్పుకో తగినంత గొప్ప కతేమీ కాదు. కానీ వెంటనే మళ్లీ చదవాలనిపించింది. మూడు నాలుగుసార్లు అప్పటికప్పుడే చదివినాను. ఆనిడి(స్వతంత్ర) పోరాటం జరుగుతున్న నాళ్లలో, ఒక పాలంకాపు తన చివరి పంచె చిరుగులను కప్పి పెట్టడానికి పడిన పాటును చెప్పిన కత అది. నన్ను అంతగా లాగింది ఆకతలోని కరుగు(వస్తువు) కాదు, అందులోని నుడి. అది తమిళకత, కానీ చదువుతుంటే తమిళాన్ని చదువుతున్నట్లు లేదు. తెలుగులో చదువుతున్నట్లే ఉంది. ఆ నుడిలో ఏదో తీయదనం, ఏదో మెత్తదనం, ఏదో నెత్తావి. అది తమిళ కతే. కానీ కాదు. అది తెన్నాటి(ఇప్పటి తమిళనాటి) తెలుగు కత. మరునాడు కదవు(తెలుగులో తలుపు) కతను ఇచ్చినాడు పుష్పరాజబ్బ. అదీ అంతే. ఈ రెండు కతలను రాసిన వారు కీరా. ఇంకొక పదినాళ్లకు గోపల్ల గ్రామం(తెలుగులో గోపల్లె) అనే కొత్తెన(నవల)ను ఇచ్చినాడు. అదీ కీరా రాసిందే. అంతే కీరా పిచ్చి పట్టేసింది నాకు.

నాకంటే పుష్పరాజుగారు పాతిక ముప్పయేళ్లు పెద్ద. అయినా ఆయన్ను 'మీరు' అనేవాడిని కాను. 'నువ్వు' అనే పిలిచేవాడిని. అంత చనువు నాకు. ఇద్దరమూ తెన్నాటి తెలుగులో మాట్లాడుకొనేవాళ్లం, పోట్లాడుకొనేవాళ్లం. 'గోపల్లగ్రామం' నాకు పిచ్చిగా నచ్చేసిందిని ఆయనతో అన్నాను. అంతే మా ఇద్దరి నడుమా పెనుగువ(వాదన) మొదలయింది. గోపల్లగ్రామం వలన తెన్నాటి తెలుగువారికి పెద్దకీడు జరిగిపోయిందని పెనగినారు ఆయన. 'రమేశా, నువ్వు ఆ నుడి తగులం(వ్యామోహం)లో చిక్కుకొనిపోయి, నిక్కం మరిచివు. మనల్ని అందరినీ తమిళులు వందేరి(వలసవాడు) అని, ఈ నేలను విడచిపోవాలని అంటున్నారు. ఆ వందేరి మాటకు ఊతమిచ్చేదే గోపల్ల గ్రామం' అని పుష్పరాజుగారు అంటుంటే నివ్వెరపోయాను.

ఒకనాడు నేనూ పుష్పరాజుగారు కలసి కీరాను చూడడానిని చెన్నపట్నం నుండి బయలుదేరినాం. అప్పుడాయన వాళ్ల

సొంతవూరయిన 'ఇడైచేవల్'లో ఉండినారు. మేము కోవిల్‌పట్టి అనే పేటలో పట్టేగి(రైలు) దిగి, ఆవూరికి పేరేగి(బస్)లో వెళ్లినాం. కీరాను చూసి అచ్చెరపోయినాను. అడ్డ పంచె, పైన చిన్న తుండుగుడ్డ. మా తాతలాగానే అనిపించినారు. పుష్పరాజు కంటే పాతిక ముప్పయ్యేళ్లు పెద్దవారు కీరా. వాళ్లిద్దరికీ అంతకుముందే నెళవు ఉందని నాకు తెలియదు. నెళవే కాదు, వాళ్లిద్దరూ మంచి నేస్తాలని తెలిసింది. నేను పుష్పరాజు గారిని 'నువ్వు' అంటున్నట్లే, ఆయన కీరాగారిని 'నువ్వు' అనే పిలుస్తున్నారు. కొన్ని గంటలపాటు వాళ్లిద్దరూ అట్లా మాట్లాడుకొంటూ ఉండిపోయినారు. నేను చెవులప్పగించి వింటూ ఉండిపోయినాను.

ఆ మాటల నిండా తెలుగుదనమే. తెన్నాటి తెలుగును గురించే సాగినాయి వారి మాటలు. ఆ మాటలు నడుమ తెలిసింది, ఇడైచేవల్‌ను తెలుగువాళ్లు నడికావిలి అంటారని, కోవిల్‌పట్టిని గుడిపల్లి అంటారని. కమ్మవాళ్ల నోళ్లలో మరుగున పడిపోయిన ఆ తెలుగు పేర్లు మాదిగపల్లెలో బతికే ఉన్నాయని కూడా తెలిసింది. ముగ్గురమూ కలసి మాదిపల్లె వైపు అడుగులు సాగించి, అక్కడి వారిని పలుకరించి వచ్చినాం.

ఆ తొలినెళవు తరువాత ఈ ముప్పయేళ్లలో తక్కువంటే ముప్పయిసార్లయినా కలిసుంటాను కీరాగారిని. కొన్నిసార్లు ఎవరినో ఒకరిని వెంటబెట్టుకొని, ఎన్నోసార్లు ఒంటరిగా. కీరాగారి గురించి అందరికీ తెలిసిందేమిటంటే, ఆయన తమిళంలో గొప్ప వ్రాతరి(రచయిత). నెలవునుడి(మాండలికం) తాత. చదివింది బాగా తక్కువ. తమిళానికి చేసిన సేవ గొప్పది. కతలు కొత్తెన(నవల)లు, కట్టురలు, పెద్దకతలు, పాండెమండలపు(మదుర, రామనాడు, తిన్నెవెల్లి తావు) నెలవుమాటల నుడిగంటు(నిగంటువు) వంటివి ఆయన చేతినుండి జాలువారినాయి. 'ఈడు వచ్చిన వాళ్లకు మట్టుకే' అనే పేరుతో ఆయన వందల పల్లెకతలను పోగుచేసినారు. పల్లెల్లో రచ్చబండల మీద పెద్దవాళ్లు చెప్పుకొంటూ ఉండే పల్లెటూరి బూతుకతలవి. బూతుకతలు అంటే ఆయనకు కనలు రేగేది. "తెల్లదొరలు సెక్స్ ఎడ్యుకేషన్ అంటే అవునవును అని తలలూపుతాం. ఆ పనిని పెద్దలు ఎప్పటినుండో చేస్తున్నారు" అనేవాడు ఆయన.

"బూతు, చెడ్డమాట, తప్పుడుకూత అనే మాటలు కాకుండా ఇంకేదయినా మంచిమాట దొరికితే బాగుండును" అన్నాడు ఒకసారి. "ఎందుకు లేదు నాయనా, హోసూరు తెలుగువాళ్లు, సంబోగం అనే సంస్క్రుతపు మాటను 'కొలిమి' అంటారు" అని మారాడినాను. ఆ మాటను విని ఎలమితో ఉబ్బితబ్బిబ్బు అయినాడు. "నాకు మొదలే తెలిసుంటే కొలిమికతలు అనే పేరును పెట్టుండుదునే" అన్నాడు.

ఆయన దగ్గరకు ఎవరు వెళ్లినా ఈ కతలను గురించి చెప్పేవాడు. తను రాసిన వాటికన్నా, పెద్దల నోళ్ల నుండి వినిన ఈ కతలను గురించే మైమరిచి చెప్పేవారు. అమెరికాలో ఉంటున్న జంపాలచౌదరి గారూ, వారి ఇల్లాలు అరుణగారూ ఇండియాకు వచ్చినపుడు కీరాను చూడాలంటే కమలాపురికి (పాండిచేరిని పాత తెలుగువాళ్లు ఇట్లాగే పిలిచేవాళ్లు) తీసుకెళ్లినాను. వాళ్లకు కూడా ఒక కొలిమికతను చెప్పినారు. అరుణక్క పడిపడి నవ్వినారు.

"ఇవన్నీ తెలుగు కతలు. మా పెద్దవాళ్ల రచ్చబండ కతలు. నేను తమిళంలోకి మార్చి రాసినాను. ఇదంతా మన తెలుగుసొత్తు" అంటారాయన.

తెలుగంటే మక్కువెక్కువ ఆయనకు. అయితే కొందరనుకొంటున్నట్లు తెన్నాడులోని అన్ని తావుల తెలుగు మాటలూ పలుకుబడులూ ఆయనకు తెలియవు. ఆయనకు తెలిసింది పాండె మండలపు నల్లరేగడి నేల పలుకుబడి ఒక్కటే. ఆ మండలంలోని ఎర్రనేలల తెలుగుసొబగుల మీద ఆయనకు పట్టు తక్కువ. తొండ, చోళ, కొంగు, మొరసు వంటి తెన్నాటి తెలుగులను ఆయన ఎరుగడు. పాండెమండలంలో నల్లరేగళ్లలో పంటకోతల తరిలో కళ్లంమిడసలు అనే అలమరి(సంచార) తెగవాళ్లు వచ్చి తెలుగులో పాటలుపాడి, గురుములను(దాన్యాన్ని) పెట్టించుకొనిపోతారనీ, వాళ్లు గుడ్లంకిడి అనేదానిని వాయిస్తారనీ కీరాకు తెలుసు. తన కతలలో దీనిని పొదక(రికార్డ్) చేసినాడు. అయితే కళ్లంమిడసలు, కుక్కను కైక అంటారనీ, రూకలను కచ్చికలంటారనీ, ఇటువంటి నూర్ల తెలుగుమాటలు వాళ్లనోళ్లలో ఉన్నాయనీ ఆయనకు తెలియదు. పాండెనాడులోని కమ్మవారు, హరివిల్లును వానవిల్లు అనడం తెలుసు కానీ, కంబళపువారు సింగారచింగు అంటారని ఎరుగరు.

నేను వెళ్లినపుడల్లా ఇటువంటి తెలుగుమాటలను, తెలుగు అలమరి తెగల ముచ్చట్లనూ చెప్పించుకొని విని తెగ మురిసిపోతుండేవాడు. గంటల గంటలు అట్లా మాట్లాడుకొంటూ ఉండేవాళ్లం. పుష్పరాజుగారు కనుమూసినాక, కీరా దగ్గరకు నా పోకలు తక్కువయినాయి. కీరాకు ఆయన కతలూ కొత్తెనలూ కట్టురలూ, ఆయన పోగుచేసిన కొలిమికతలూ అన్నీ తెలుగులోకి రావాలని పెద్ద కోరిక. ఆ పని చేయుమని నన్ను బాగా విసిగించేవాడు.

ఆ పనివల్లనే ఆయనకు నేను ఎడమవుతానని ఇద్దరిలో ఎవరమూ అనుకోలేదు. అవును, ఆయన 'గోపల్ల గ్రామం' తెలుగులోకి రావడం వలన, మా నడుమ ఎడం పెరిగింది. ఆ మందలను కూడా, ఇక్కడయినా ఇప్పుడయినా చెప్పడం నా మోపిక(బాధ్యత).

ఈ కట్టురను వేమన పాడిక(పద్యం)తో మొదలిడినాను. కీరా గురించి చెప్పడానికి వేమన తోడు ఎందుకంటారా? ఇక్కడ కావలసిపడుతుంది. ఏ రాచరికపు తరిలోనో వేమన చెప్పిన మాట అది. మంది ఏలుబడి సాగుతున్నదని మనం నమ్ముతున్న ఇప్పుడు కూడా అదే జరుగుతున్నది.

తెలుగు నానుడి(సాహిత్యం)తో కానీ, తెన్నాటి తెలుగు నుడికారంతో కానీ, తమిళంతో కానీ ఆవగింజంత అయినా ఎరుకువ లేని ఒక ఆమె, పిహెచ్‌డి పేరుతో మా నడుమ దూరింది. హోసూరులోని నంద్యాల నారాయణరెడ్డి చేత అప్పటికే కీరా 'వేట్టి' కతను 'పంచె' పేరుతో తెలుగు చేయించున్నాను. అదీ మరొక రెండు కతలూ అప్పటి నడుస్తున్న చరిత్రలో అచ్చయినాయి. నారాయణరెడ్డి 'గోపల్ల గ్రామం'ను తెలుగులోకి తెచ్చినారు. నవ్య ఆకికలో తొడరిక(సీరియల్) గా వచ్చిందది. ఆ గోపల్లెను, కృష్ణగిరి జిల్లా రచయితల సంగం(కృష్ణ.ర.సం.) అచ్చువేయాలని అనుకొనింది. నేను కూడా అందులో ఒక మేన(సభ్యుడి)ని. కీరాతో మాట్లాడినాం. ఎలిమిదాతో ఒప్పుకొన్నారు. ఆయన డబ్బులకు ఇబ్బందులు

పడుతుండడం నాకు బాగా తెలుసు. అందుకనే కృష్ణ ర.సం వాళ్లు డబ్బుల్ని పోగేసినాం. అచ్చు వేసే చెల్లు కాకుండా పదివేల రూపాయలు మిగిలినాయి. గడ్డిపోచే కావచ్చు, గాదపు పీచే కావచ్చు దానినే కీరాకు మేవడి(గౌరవం)తో ఇద్దామనుకొన్నాం. తిరుపతిలో తట్టచ్చు(డి.టి.పి) పనిని ముగించినాం. దిద్దుడు పనులను ముగించినాం. కీరాకు పిలుపిచ్చి వారివి సొగసైన పొడమ(ఫోటో)లను కొన్నిటిని తెప్పించినాం. ఆర్.ఎం. ఉమామహేశ్వరరావును ఎనికెన(కంప్యూటర్) ముందు కూర్చోబెట్టి కీరా పొడమతో అందమైన అట్టబొమ్మను వేయించినాం. ఇక అచ్చుమర ఎక్కడమే మిగిలింది. అప్పుడు మోగింది నా చేపలుకి(సెల్‌ఫోన్).

అటునుండి ఇళంబారతి గారు. కీరాకు మంచి నేస్తం. "కీరా నీతో చెప్పేదానికి మొగమాట పడుతున్నారు. నిన్ననే ఆమె వచ్చింది. గోపల్లెను ఆమే అచ్చు వేయిస్తుందంట. డబ్బులు కూడా మీరు ఇచ్చేదానికంటే ఎక్కువ ఇస్తుందంట. కీరా నిండా డబ్బు ఇక్కట్టులో ఉండాడని నీకు తెలుసు కదా. దానికని అవెనే వేయుమని చెప్పేసినాడు..."

కాసేపు ఏం మాట్లడాలో తెలియలేదు. మరునాడు కీరాతో మాట్లాడాలని కిట్టగించి(ప్రయత్నించి) నాను. కుదరలేదు. ఆయన దొరకలేదు. ఊరుకొన్నాను. కృష్ణరసం ముందు తలదించుకొని నిలబడి నాను. బాగా తలవంపులుగా అనిపించింది. గోపల్లె తెలుగులో రావడానికి నేను పడిన పాటు నాకూ నారాయణరెడ్డికీ ఉమామహేశ్వరరావుకూ మట్టుకే కాదు ఆమెకూ తెలుసు. తెలిసీ ఆమె ఈ తెగబాటుకు పూనుకొనింది. ఇంతా చేసి ఆమె ఆ పొత్తాన్ని తన డబ్బుతో అచ్చువేయలేదు. మేము అవను(సిద్ధం)గా చేసిపెట్టున్న తట్టచ్చునూ అట్టబొమ్మనూ పంపుమని ఇళంబారతి గారు అడిగితే పంపేసినాం. దానిని ఆయన, అమెకు అందించినారు. కీరా పొడమతో మేం చేయించిన అట్టబొమ్మను పక్కన పడేసినారు. ఒక తెలుగు బతుకును రాజస్తానీ బొమ్మతో అట్టను కైసేసినారు. విలువలున్న మనిసిగా పేరున్న ఒక రిటైర్డ్ ఐ.పి.ఎస్ చనవరి(అదికారి) రంగంలో కనబడినాడు. ఆయన తెట్టువ(సంస్త) పేరుతో గోపల్లె వెలువడింది.

పేర్లు చెప్పి దెప్పడం పాడి కాదు అని చెప్పడం లేదంతే. అమ్మనుడి చదువరులకు ఆమె ఎవరో ఎరుకపడగలదు. ఆమెకు తమిళం తెలియదు. తెన్నాటి తెలుగు గురించి తెలియదు. ఏ తెలుగు గురించీ తెలియదు. తెలుసు అని ముందుకు వస్తే ఆమెతో పెనుగువకు నేను అవనుగా ఉన్నాను. ఏమీ తెలియని ఆమె, ఇప్పుడు తమిళనాడు తెలుగుదనానికి నిలువెత్తు రూపం. తమిళనాడులో మొన్నటికి మొన్న స్టాలిన్ గద్దెనెక్క డానికి ఆమే కారణం! రేపో ఎల్లుండో ఆమే పూనుకొని తెన్నాట తెలుగును రెండవ ఏలుబడి నుడిగా చేయబోతున్నారు!! తెన్నాట మూల మూలా పల్లెపల్లే పేటపేటా కుదురు కుదురూ ఆమెకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. తెన్నాటి తెలుగు కళలగురించీ తెలుగు ఆటలుపాటలు, కులాలు, నమ్ముకొన్న కులాలు, అలమరి తెగలు, పండుగలు పబ్బాలు.... మొత్తం సాగుబాటు(కల్చర్) గురించి ఆమె అరసి(పరిశోదించి) చెబితే మా బోటి దీనులం విని తెలుసుకొన్నాం!

ఆమె గురించి ఇక్కడ ఎందుకింత సొద అంటే, ఆమె వల్లనే, కేవలం ఆమె వల్లనే, పసిబిడ్డవంటి కీరా, ఎనిమిదిపదుల ఈడులో, ఆయన మనుమడివంటి నా దగ్గర ఇబ్బంది పడవలసి వచ్చింది. ముప్పయ్యేళ్ల మా చెలిమికి చెల్లుచీటి ఇచ్చేసింది ఆమె.

సరే ఆ మందలను ఇక ముగిద్దాం. కీరా ఇంటిపేరును కొందరు రాయంకుల అని రాస్తున్నారు. అది తప్పు. వారి ఇంటిపేరు రాయంగల. కీరా కూడా మొదట్లో రాయంగల అనే చెప్పేవారు. కమ్మకులం మీద పెద్ద ఆరయిక చేసిన ఒక అయ్యంగారు కీరాతో అన్నారట. రాయంగల అనే ఇంటిపేరు కమ్మవారిలో లేదు. రాయ, రాయం అనేవి ఉన్నాయి. అదే రాయంకుల అయుంటుంది అని. ఆ అయ్యంగారు కూడా అమ్మనుడి చదువరులే. వారికొక విన్నపం ఏమిటంటే, గుంటూరు, ఒంగోలు, గుడివాడ, ఏలూరుల నడమనున్న వారే కమ్మవారు, మిగిలిన చోట్ల ఉన్నవారంతా వలస పోయినవారే అన్నది పొరపాటు. రాయలసీమలోని చాలా ఇళ్లపేర్లు కోస్తా తావునున్న కమ్మవారికి లేవు. బళ్లారి, చిత్రదుర్గం, తుముకూరు, అనంతపురం, కోలారు, బెంగళూరు, హోసూరు, కోళ్లగాలం, గోపిచెట్టిపాళెం, సాతూరు, గుడిపల్లి, తావులలో రాయంగల వారున్నారు. రాయంగల, పొనంగల, రాచకొండల, నంచల, దొడ్ల, ముంతపచ్చ. మూకుడుపచ్చ, మార్త, కుడితి వంటి ఇంటిపేర్లు నడిమి ఆంధ్ర తావున ఉండవు. కమ్మవాళ్లంతా వలసపోయిన వాళ్లే, బలిజవాళ్లంతా, మాదిగవాళ్లంతా, చివరకు తెలుగువాళ్లంతా వలసపోయినావాళ్లే అని ఇంకా ఎన్నాళ్లు చెప్పుకొందాం చెప్పండి.

రాయంగల క్రిష్ణ రామానుజ పెరుమాళ్ నాయకర్ రాజనారాయణన్ గారు. వారి పేరు కన్న వేలింతల ఎత్తుకు ఎదిగినవాడు. తెలుగంటే నెనరున్నవాడు. పాండెనాటి రేగడినేలల తెలుగు బతుకును, తన బతుకంతా కలవరించి పలవరించినవాడు. తెన్నాటి తెలుగు వెలుగును తమిళుల కళ్లు మిరిమిట్లు గొలిపేలా నిలిపినవాడు. వారి రచనలన్నీ తెలుగులోకి మారాలనీ తెలంగాణాంధ్ర తావుల తెలుగువాళ్లంతా చదవాలనీ బతికినన్నాళ్లూ తపన పడినారు ఆయన. గోపల్లె, గోపల్లె పురజనుల అనే వారు రెండు కొత్తెనలను వెలుగులోకి తెచ్చిన ఆ పున్నెపురాలే నడుము కట్టుకొంటే, ఏ ఐయ్యేయస్సో ఐపీయస్సో తోడుపడక పోదు.

అమ్మనుడి అరుగుమీద నుండి చెబుతున్నాను. కీరా ఆవి(ఆత్మ) ఉంటే వినసీ. " తాతా, విద్దె కలిగిన మీరు కూడా పసిడి కలిగిన వాళ్లకు తలవంచారే, పాడియేనా? మన్నించండి"

"బుద్ధదేవుడు, ఏసుక్రీస్తు మొదలగు మహాత్ములు వ్యావహారిక భాషలోనే ప్రజలకు ధర్మమును ఉపదేశించవలెనని శిష్యులకు విధించినారు. పండిత పామర సామాన్యమైన వ్యావహారిక భాష విద్యాబోధనకూ గ్రంథరచనకూ రాజ్యవ్యవహార నిర్వహణకూ సాధనముగా ఏ దేశమునుందు ఏర్పడినదో ఆ దేశమే ఔన్నత్యము పొందినదని చరిత్ర ఘోషిస్తున్నది. వ్యవహార భ్రష్టమైన భాషలను పండితులకు విడిచిపెట్టి, వ్యవహార భాషలద్వారా లోకవ్యవహారమంతా నిర్వహించవలెను." –గిడుగు వేంకటరామమూర్తి

మధురాంతకం నరేంద్ర
98485 98446

# మరో మరువకూడని మనిషి - రాజేంద్ర



గడచిపోయిన మే నెల 22వ తేదీన యం. రాజేంద్ర అనే పాత్రికేయుడు చనిపోయినప్పుడు ఆయనతో బాటు పనిచేసిన సంపాదకులు, చిత్రకారులు(కల్లూరు భాస్కరంగారు, నర్సింగారు, యెస్వీ రామారావుగారు, మరికొందరు) వెంటనే తమ ఆత్మీయ మిత్రునికి వివాళిగా వ్యాసాలు రాశారు. అప్పుడు చాలామంది యెవరీ రాజేంద్ర? అని తిరిగి చూశారు. చాలా మందికి ఆయన చిత్తూరు జిల్లావాసి అని కూడా తెలియదు. ఆయన గురించి మిత్రులు రాసిన వ్యాసాల్ని చదివినవాళ్ళు యింత పనిచేసిన వ్యక్తిని గురించి ఇంత వరకూ యేమీ తెలియకుండా వుండడం యెలా జరిగిందని ఆశ్చర్యపోయారు. తనకంటే తాను చేస్తున్నపని గొప్పదని భావిస్తూ, చేసిన పనికి కూడా తనకు కర్తృత్వాన్ని అసలు ఆపాదించుకోకుండా, వొక జీవితకాలం కర్మయోగిలా పనిచేయడం సాధ్యమేనని నిరూపించిన అపురూపమైన పత్రికా సంపాదకుడు రాజేంద్రగారు. ఆయిన వెనక చేసిన అద్భుతమైన పని ఆయనలాగే వినయంగా, నిశ్శబ్దంగా వుండిపోయింది.

1987 జూలై 1వ తేదీన చిత్తూరు జిల్లా అరగొండలో మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన రాజేంద్ర హైస్కూలు చదువు పూర్తియ్యా గాక మునుపే సాహిత్య ప్రపంచంలోకి వచ్చేశారు. 1954లోనే ఆయన కథ "అందుకొరకని రహస్యం" కథాంజలి అనే పత్రికలో వెలువడింది. ఆ కథ చదివినప్పుడు అది 17 సంవత్సరాల కుర్రాడు రాసిన కథ అని నమ్మడం చాలా కష్టం.

1969లో మా నాన్న గారు చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర అనే 50 పేజీల చిన్న పుస్తకం రాశారు. ఆ పుస్తకంలో రాజేంద్ర గారికి అప్పుడే ఒక పేజీ కేటాయించారు. అందులో ఆయన యిలా రాశారు:

"అరగొండలో వున్నప్పుడే చురకత్తిలాంటి కుర్రాడనిపించుకున్నాడు రాజేంద్ర. అల్లసాని పెద్దన అందలమెక్కు నాటికి కొంటె విద్యార్థిగా వున్న రాజరాజభూషణుడిలాగా సభాగారు పత్రికలకు రాస్తుంటే చూశాడు. ఈ పత్రికల విశేషమేమిటో తెలుసుకోవానుకున్నాడు. దొరికిన ప్రతి పత్రికా ఉత్సవ విగ్రహంలాగా కనిపించగా, నాటికి మూలవిరాట్టులవంటి పత్రికా కార్యాలయాలు మదరాసులో వున్నాయని తెలిసి, ఆ నగరాన్ని కోటి నదుల ధనుష్కోటిగా భావించాడు. మదరాసు తండియార్ పేటలోని 'మాతృసేవ'లో పనిచేసి పత్రికల బాగోగుల్ని గురించి క్షుణ్ణమైన పరిజ్ఞానం గడించాడు. వ్రాయడానికి అవసరమైన అర్హత పత్రికల గురించి తెలుసుకోవడం కాదనీ, సాహిత్యమన్నది లైబ్రరీలలో నిక్షిప్తమై వుందనీ తెలిశాక ఆ లైబ్రరీల అంతుగూడా తేల్చుకోదలచుకున్నాడు. లైబ్రేరియన్‌గా శిక్షణ కోసం విశాఖపట్నం వెళ్ళాడు. విశాఖ రచయితల సాహచర్యం రాజేంద్రను రచయితగా తీర్చిదిద్దింది. తిరిగివచ్చి గ్రంథాలయాల్లో పనిచేస్తూ తన ఓపిక అనుమతించినంతలో మంచి కథలు కొన్ని రాశాడు(గొడుగులాంటి మనిషి, పిల్లమెచ్చిన వాడు). చిరాకుపుట్టి ఆ రాయడం కూడా తగ్గించేశాడు. చిత్తూరులో వుండగా రాజేంద్ర చేసిన ఒక మంచి పని జిల్లా రచయితల సంఘాన్ని నడపడం, ఈ జిల్లా రచయితల సంఘానికి ప్రత్యేకించి అధ్యక్ష స్థానమంటూ ఒకటి, కార్యదర్శి అంటూ ఒకరూ, యింకా కార్యవర్గం మొదలైన బాదర బందీ లేవీ లేవు. దాని స్విచ్ రాజేంద్ర చేతిలోనే వుంది. అప్పుడు బుద్ధిపుట్టి ఆన్ చేశారు. యిప్పుడు వీల్లేక మిన్నకున్నారు.

"ఇచ్ఛాశక్తితో మనస్సును తన చెప్పుచేతల్లో ఉంచుకోగలిగినట్టే, రాజేంద్ర ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని గూడా ఇచ్చవచ్చిన చొప్పున మలచుకోగలుగుతున్నాడు." (చిత్తూరు జిల్లా సాహిత్య చరిత్ర - మధురాంతకం రాజారాం)

1954లో చిత్తూరులో 'కళాపరిషత్' అనే సంస్థ పుట్టడాన్ని ఒక చారిత్రక సన్నివేశంగా జిల్లా రచయితలప్పుడు గుర్తించారు. ఆ సంస్థకు పాటూరు రాజగోపాలనాయుడు గారు అధ్యక్షుడయ్యారు. అందులో రాజేంద్ర ముఖ్యమైన కార్యనిర్వాహక బాధ్యతను వహించాడు. రాజేంద్ర గారి ఆరు దశాబ్దాలకు మించిన సాహిత్య జీవితం అప్పుడే ప్రారంభమైంది.

లైబ్రేరియన్‌గా కొద్దికాలం మాత్రమే పనిచేసిన రాజేంద్రగారు త్వరగానే పత్రికారంగానికి వెళ్ళిపోయారు. ఆంధ్రజనత, ఆంధ్రప్రభ, ఈనాడు, ఆంధ్రభూమి దినపత్రికల్లో పనిచేశారు. అందువల్ల ఆయనకు సమకాలీన రాజకీయ పరిస్థితులపైన మంచి అవగాహన వుండేది. కేతు విశ్వనాథరెడ్డి గారు 'ఈభూమి' మాసపత్రికకు సంపాదకులుగా వున్నప్పుడు ఆ పత్రికలో ఆయన తన పేరుతోనే చాలా రాజకీయ వ్యాసాలు రాశారు.

సాహిత్య వారపత్రికల సంపాదకుడుగా గూడా రాజేంద్ర గారు విశిష్టమైన కృషిచేసి తనదైన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. రాష్ట్రంలోని రచయితల ప్రతిభల్ని ఆయన నిపుణతతో బేరీజు

**వ్యక్తిగా రాజేంద్రగారు మితభాషి. చేస్తున్న పనిపైన గౌరవమూ, చిత్తశుద్ధీవున్న గొప్ప మానవుడు. నీతులనూ, ఆదర్శాలనూ వల్లించకుండా నీతిగా ఆదర్శంగా యెలా జీవించాలో అలాజీవించినవాడు. నిరాడంబరత, ఆత్మస్థైర్యం ఆయన సహజగుణాలు. కర్మయోగిగా తన పనిని తాను నిష్కామకర్మగా చేసుకుపోయాడు.**

వేయగలిగేవారు. వార పత్రికలకు కావలసిన నాణ్యతవున్న రచనల్ని కనిపెట్టగలిగేవారు.

'ఇండియాటుడే' వాళ్ళు తెలుగులో పత్రికను ప్రారంభిస్తూ దానికి రాజేంద్రగారిని సంపాదకుడుగా తీసుకోవడం ఆధునిక సాహిత్య చరిత్రలో పెద్దమార్పుకు నాంది పలికింది. పూర్తిగా రాజకీయ విషయాలకే ప్రాముఖ్యతనిచ్చే ఇండియాటుడే పత్రికను గొప్ప సాహిత్య సాంస్కృతిక వారపత్రికగా ఆయన తీర్చిదిద్దారు. అనేక సాంస్కృతికాంశాలూ, యాత్రా కథనాలూ, పుస్తకవిమర్శలూ, వైజ్ఞానికరచనలతో ఆయన ఆ పత్రికను తెలుగువారి 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా' అంత గొప్పగా తీర్చిదిద్దారు.

ప్రతి సంవత్సరమూ వార్షిక ప్రత్యేక సంచికలు తీసుకొచ్చే సత్సంప్రదాయానికి రాజేంద్రగారు మరిన్ని వన్నెచెన్నెలు చేకూర్చి 'ఇండియాటుడే' వార్షిక సంచికలను ఆంధ్రపత్రిక ఉగాదిప్రత్యేక సంచికల స్థాయికి తీసుకొచ్చారు. ఇండియాటుడే వార్షిక సంచికలలో జరిగిన సాహిత్య చర్చలూ, విశేషకథనాలు అంతకుముందెన్నడూ జరగలేదు. ఆ తరువాత యెప్పుడూ జరగలేదు.

'కథానిక' ప్రక్రియకు ఇండియాటుడే గొప్ప ఆలంబనగా తయారయ్యింది. ప్రతి సంచికలో వచ్చిన కథ దేనికదే ప్రత్యేకంగా విశిష్టంగా వుండేది. 'ఇండియాటుడే'లో వచ్చిన కథానికలతో ఒక సంకలనం తీసుకొస్తే అది తెలుగుకథ అందుకున్న గొప్ప శిఖరాలనంతా చేర్చిన గొప్ప సంకలనమవుతుంది. తెలుగు పత్రికారంగ చరిత్రలో రాజేంద్రగారి సంపాదకత్వంలో వెలువడిన ఇండియాటుడేలా నిండుగా గొప్పగా రూపొందిన పత్రికలు మరో రెండుమూడయినా లేవు. ఆయన సంపాదకుడుగా వున్నప్పుడు ఆ పత్రిక సర్కులేషన్ అరవైవేలను దాటిందని తెలిసింది. రాజేంద్రగారి తర్వాత ఆయన మార్గంలోనే 'రాజశుక'గారు ఆ పత్రికను విజయవంతంగా నడిపారు.

'ఇండియాటుడే' పత్రిక ప్రాచుర్యం తగ్గడం దానిలో 'కథానిక' ప్రచురణను ఆపడంతోనే ప్రారంభమయ్యింది. క్రమంగా ఇండియాటుడే ఆగిపోవడాన్ని గమనించి తెలుగు సాహిత్యాన్ని చిన్నచూపుచూసే పత్రికలన్నీ గుణపాఠాన్ని నేర్చుకోవాలి.

1972 ప్రాంతంలో రాజేంద్రగారు స్వంతంగా 'పొలికేక' అనే వారపత్రికనూ, 'జ్యోత్స్న' అనే మాసపత్రికనూ నడిపారు. మూడునాలుగేళ్ళపాటూ ఆ పత్రికలు గొప్పగా వెలువడ్డాయి. అయితే వాణిజ్యదృక్పథమసలులేని రాజేంద్రగారు ఆ పత్రికలనాతర్వాత ఆపేసి పూర్తిగా సంపాదకుడిగానే మిగిలిపోయారు. దినపత్రికల సంపాదకుడిగా ఆయన ప్రాపంచికానుభవాన్ని గురించీ, రాజకీయ పరిస్థితుల అవగాహనను గురించీ ఆయన సహసంపాదకులంతా గుర్తు చేసుకుంటూ వుంటారు. కథానికా ప్రక్రియకు ఆయన చేసిన మేలును తెలుగు కథకులంతా గొప్పగా చెప్పుకుంటూ వుంటారు.

వ్యక్తిగా రాజేంద్రగారు మితభాషి. చేస్తున్న పనిపైన గౌరవమూ, చిత్తశుద్ధీవున్న గొప్ప మానవుడు. నీతులనూ, ఆదర్శాలనూ వల్లించకుండా నీతిగా ఆదర్శంగా యెలా జీవించాలో అలాజీవించినవాడు. నిరాడంబరత, ఆత్మస్థైర్యం ఆయన సహజగుణాలు. "దేనినీ మనసులో వుంచుకోగూడదు. క్షమించేస్తూ ముందుకు పోవాలి" అని ఆయన అనేవారట!

హైదరాబాదులో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' పాటరాసిన శంకరంబాడి సుందరాచారి గారికి జరిగిన సన్మానం సంగతి అందరికీ తెలుసు. 'ఆ పాటరాసిందినేనే!నన్ను లోపలికి వెళ్ళనివ్వండి'' అని మొరబెట్టుకున్న బక్కపలచటి మనిషిని యెవరూ పట్టించుకోలేదు. చిత్తూరుజిల్లా వాసి అయిన రాజేంద్రగారే ముందుగా ఆయనను గుర్తుపట్టి, ఆయనతో తనకున్న వ్యక్తిగత పరిచయాన్ని జ్ఞాపకం చేసుకుని ముఖ్యమంత్రికి తానే ఆ సమాచారాన్ని చేరవేశాననీ, ఆ తరువాతే శంకరంబాడి సుందరాచారిగారికి సముచితమైన సన్మానం జరిగిందనీ వో పాత్రికేయ మిత్రుడు యిటీవలే రాశారు.

రాజేంద్రగారితో దశాబ్దాలపాటూ పరిచయమున్న మిత్రులకు కూడా ఆయన కులమేమిటో తెలియదు. యెప్పుడో ఆయన వూరినుంచీ ఆయన అన్నగారు చేసిన ఫోన్‌ను ముందుగా అందుకున్న ఆయన మిత్రుడొకరు ఆయనకు ఆనందం కలుగుతుందేమోనని "రాజేంద్రరెడ్డిగారూ! మీ అన్నగారు ఫోన్‌చేశారు" అన్నారట! ఆమాట వింటూనే తుఫానులా విరుచుకపడిన రాజేంద్రగారు "కులంపేరు వాడుతారా? యిదేం దుర్మార్గం?" అని చీవాట్లేశారట! ఆయన తన 'ఆధార్' కార్డులోనూ కులానికి ప్రాధాన్యత నివ్వకుండా తండ్రి పేరులోని కులవాచకాన్ని కావాలని లేకుండా చేసి 'గోవిందయ్య' అని రాయించారట! 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా!' అని వేమన మాటను గుర్తుకుతెచ్చే విషయమిది.

క్షమాగుణం, మనోనిబ్బరం అనే గొప్ప బైరాగుల లక్షణాలు రాజేంద్రగారిలో సహజాతాలు. 'వేదభూమి' అని పిలిచే చిత్తూరు జిల్లాకు చెందిన తొండనాడులో వొకప్పుడు ప్రాపంచిక విషయాన్ని పట్టించుకోకుండా తిరిగే బైరాగులు విరివిగా కనిపించేవాళ్ళు. రాజేంద్ర గారు పత్రికారంగంలోనూ తామరాకుపైన నీటిబొట్టులా జీవించాడు. కర్మయోగిగా తన పనిని తాను నిష్కామకర్మగా చేసుకుపోయాడు. లౌకిక సంపదలనూ, పేరు ప్రఖ్యాతులనూ పట్టించుకోకుండా తన పనిని తాను చిత్తశుద్ధితో చేసి, పని పూర్తవగానే మౌనంగా తప్పుకున్నాడు.

**ఆయన చేసిన పనులపైన ఆయన పేరు కనిపించకపోయినా, వాటి ప్రభావాలు మాత్రం ప్రపంచపు సౌమనస్య సంగీతంతో మృదుమధురంగా శృతి కలుపుతూ కలసిపోయాయి.**

**విద్యాబోధన, పరిపాలన - ప్రజల భాషలో జరిపిన దేశాలే అభివృద్ధిమార్గంలో త్వరగా ముందుకు సాగుతాయి**

**శ్రద్ధాంజలి**

# కణుగుల వేంకటరావుగారు కనుమరుగు



**ఉ**త్తమ చదువరి, విమర్శకుడు, సాహితీ ప్రియుడు, సమాజ హితాన్ని కోరి నిజాయితీగా నిబద్ధతతో జీవించిన వ్యక్తి, ఆదర్శపౌరుడు, 'నడుస్తున్న చరిత్ర', 'అమ్మనుడి' పత్రికల శ్రేయోభిలాషి, కణుగుల వేంకటరావుగారు తొంబదేళ్ల వయస్సులో కనుమరుగయ్యారు. ఆయన గురించి సన్నిహిత మిత్రుడు డా॥ అల్లంశెట్టి చంద్రశేఖరరావుగారు క్లుప్తంగా ఇలా తెలియజేశారు:

–సం.

**క**ణుగుల వేంకటరావు గారు 1931 నవంబరు 7వ తేదీన శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం తోటవాడ గ్రామంలో జన్మించారు. విజయనగరంలో బి.కాం. డిగ్రీ చదివారు. అప్పుడే అతనికి ఎందరో సాహితీవేత్తలతో పరిచయాలు కలిగాయి. తెలుగుసాహిత్యం పై అభిమానం పెరిగింది. సాహిత్యసమావేశాలలో పాల్గొనేవారు.

సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్‌గా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో పనిచేసి 1991లో పదవీ విరమణ అనంతరం శ్రీకాకుళంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు. పుస్తక సేకరణ, పుస్తక పఠనం అతని దైనందిన జీవితంలో ఒక భాగం. ఈ అలవాటు అతనికి విద్యార్థి దశ నుండి వుంది.

శ్రీకాకుళంలో ఎక్కడ సాహిత్య సమావేశం జరిగినా వెళ్ళేవారు. సవర భాషా సంఘం శ్రీకాకుళంలోని గిరిజన విద్యార్థి వసతి గృహాలలో నిర్వహిస్తున్న గిడుగు రామమూర్తి జయంతి, వర్ధంతి ఉత్సవాలలో సంఘ కార్యదర్శి డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావుతో కలిసి పాల్గొనేవారు. సవరలు తమ మాతృభాషలో రాసుకోవాలని బోధించేవారు. సవరలను అక్షరాస్యులను చేయడం కోసం రామమూర్తిగారు చేసిన కృషిని వివరించారు. అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న సమావేశాలలో వేంకటరావు గారు మాతృభాషాదినోత్సవం గురించి ఒక వ్యాసం రాసి వినిపించారు.

వేంకటరావుగారు 2002 నుండి 2004 వరకు రెండు సంవత్సరాలు చెన్నైలో వుండవలసి వచ్చింది. ఆ కాలంలో ప్రతీదినం అడయారు లైబ్రరీకి వెళ్ళి పాత పత్రికలలోని ముఖ్యమైన విషయాలను రాసుకొనేవారు. జిరాక్సు కాపీలను తీసుకొనేవారు. చాలా జిరాక్సు కాపీలను శ్రీకాకుళంలోని కథా నిలయానికి అందించారు. అప్పుడే గిడుగు సీతాపతిగారు సవర పాటల పై రాసిన వ్యాసాల కాపీలను సవర భాషా సంఘ కార్యదర్శికి బహూకరించారు. సీతాపతిగారు సవర పాటలకు చేసిన అనువాదం మూలంతో సహా 'సవర బులిటిన్' లో ప్రచురించడం జరిగింది.

2005లో వేంకటరావుగారు సవర భాషా సంఘ అధ్యక్షులయారు. గిడుగు రామమూర్తిగారు సోర మాన్యుయల్, సోర–ఇంగ్లీష్–డిక్షణరీలకు రాసిన ముందు మాటలకు అనువాద బాధ్యతను చేపట్టారు. అనువాదం కోసం భాషాశాస్త్రానికి సంబంధించిన విషయాలు తెలుసుకొన్నారు. సాంకేతిక పదాలకు అనువాదాలు సేకరించారు. అంతర్జాతీయ ధ్వనిలిపిని నేర్చుకొన్నారు. ఈ అనువాదాన్ని 'గిడుగు రామ్మూర్తిగారి ముందు మాటలు' అన్న పేరుతో సవర భాషాసంఘం 2007లో ప్రచురించింది. 2012 లో గిడుగు రామమూర్తిగారి 150వ జయంతి సందర్భంగా ప్రారంభ సమావేశం గిడుగువారు పనిచేసిన కళాశాలలో జరిపిస్తే బాగుంటుందని కళాశాల ప్రిన్సిపాల్ గారిని సవరభాషా సంఘంవారు అభ్యర్థించగా వారు పర్లాకిమిడిలో కృష్ణచంద్ర గజపతి కళాశాలలో ఆగస్టు 29, 30, రెండు రోజులు యు.జి.సి. నేషనల్ సెమినార్ నిర్వహించారు. అందులో Parlakhemundi and Gidugu Ramamurhy అన్న విషయం పై వేంకటరావుగారు పత్ర సమర్పణ చేశారు. కవేరా కలం – కాలం అన్న సంకలనంలో ఇవన్నీ వున్నాయి. వేంకటరావుగారి రచనా సంకలనం 2017లో వెలువడింది.

వేంకటరావుగారు మంచి సాహిత్యాభిమాని. కేవలం సాహిత్యాభిమాని అనుకొంటే పొరపాటే. కాళీపట్నం రామారావు మాస్టరుగారిచేతికందని కథలు గూడ సేకరించి కథా నిలయానికి బహూకరించారు. కథా నిలయం అభివృద్ధికి 20 వేల రూపాయిలు విరాళంగా ఇచ్చారు.

వేంకటరావుగారు ఉత్తమ విమర్శకులు. వారు పుస్తక సమీక్షలు చేసేటప్పుడు పుస్తకాన్ని కూలంకషంగా చదివి నిర్మొగమాటంగా, సాధికారికంగా విమర్శించేవారు. వేంకటరావుగారి ప్రత్యేకత ఏమిటంటే అసాధారణమైన జ్ఞాపకశక్తి. పత్రికలలోని వ్యాసాలను చదివేటప్పుడు ఏకాగ్రతతో శ్రద్ధగా చదివేవారు. ఎక్కడైనా రచయిత తప్పు రాస్తే దానిని వెంటనే రాసుకొని తనదగ్గర ఉన్న పుస్తకాలు వెదికి గాని లేదా పాత విషయాలు మననం చేసుకొని గాని ఆ తప్పును ఆ వ్యాస రచయితకు లేదా ఆ పత్రికా సంపాదకునికి లేఖ రాస్తూ తెలియజేయడం అతని అలవాటు. తప్పును సాధికారికంగా నిరూపిస్తూ సరైన పాఠం అందించేవారు. 17-6-2021 తేదీ గురువారం ఉదయం సొంత ఇంటిలో వేడి వేడి కాఫీ తాగి లోకానికి వీడ్కోలు చెప్పేశారు. ....... ఆ ఆదర్శమూర్తికి మా శ్రద్ధాంజలి.

– డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు. 99496 05141

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# కథను శ్వాసించిన 'కారా' మేస్టారు



ఆయన ఒక సాధారణ ఉపాధ్యాయుడు. కానీ అసాధారణమైన పనులు చేశాడు. ఆయన రాసిన కథల సంఖ్య తక్కువే. కానీ తెలుగు కథకే దిక్సూచిగా పేరు పొందాడు. 97 ఏళ్ల పాటు సంపూర్ణంగా జీవించిన కాళీపట్నం రామారావు మేస్టారు ఈ ఏడాది జూన్ 4న వెళ్లిపోయారు. ఆయన గురుతుగా శ్రీకాకుళంలో కథానిలయం తెలుగు సాహిత్యప్రపంచానికి గొప్ప కానుకగా మిగిలిపోయింది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలానికి చెందిన మురపాకలో 1924లో నవంబరు 9న ఆయన జన్మించాడు. ఎస్ఎస్ఎల్‌సి దాకా శ్రీకాకుళంలో చదువుకున్న ఆయన భీమిలీలో ఉపాధ్యాయ శిక్షణ పొందాడు. తొలుత చిన్నా చితకా పనులేవే చేసినా 1948 నుంచి 1972 దాకా ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 19 ఏళ్ల వయసు నుంచే ఆయన రచనా వ్యాసంగం మొదలైంది. తీర్పు, ఆర్తి, భయం, చావు, హింస, నో రూం, శాంతి, జీవధార, వీరడు మహావీరుడు వంటి కథలు రాసినా 'యజ్ఞం' కథారచయితగానే ఎక్కువగా అయన అందరికీ పరిచయమయ్యారు. 1966లో రాసిన ఈ కథ తెలుగు కథా సాహిత్య చరిత్రలోనే ఒక సంచలనంగా పేరు పొందింది. రంగనాయకమ్మ ఈ కథ మీద తుపానులా విరుచుకుపడ్డప్పుడు పెద్ద దుమారమే రేగింది. వేలాది పేజీల చర్చ 'యజ్ఞం' అనే ఒక కథ మీద జరగడం అరుదైన విశేషం. ఈ పెద్ద కథ మీద చర్చలే రెండు పుస్తకాలుగా వెలువడ్డాయి. భూస్వామ్యం, దళారీ వ్యవస్థ, దోపిడీలను పటంగట్టి చూపించిన ఈ కథలో ముగింపు మీదే భిన్నాభిప్రాయాలు వచ్చాయి. అనేక భారతీయ భాషలతో పాటూ ఇంగ్లీషు, రష్యా భాషల్లోకి కూడా ఈ కథ అనువాదం అయ్యింది. 1995లో యజ్ఞంకి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. నిజానికి అంతకు కొన్నేళ్ల ముందు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీ అవార్డును ప్రకటించినా విప్లవ రచయితగా ప్రభుత్వ విధానాల పట్ల నిరసన ప్రకటిస్తూ దానిని తిరస్కరించారు. ఒక బృహత్తర ఆలోచనతో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డును స్వీకరించిన ఆయన ఆ పారితోషికంతో శ్రీకాకుళంలో కథానిలయం నిర్మాణం ప్రారంభించారు. గురజాడ 'దిద్దుబాటు' కథ వెలువడిన ఫిబ్రవరి 22న 1997లో కథానిలయం మొదలైంది. పుట్టిన నాటి నుంచీ ప్రతి తెలుగు కథనూ ఇక్కడ భద్రపరచాలన్నది కారా మేస్టారి లక్ష్యం. ఇందుకోసం భుజానికి ఒక జోలె తగిలించుకుని ఆయన ఊళ్లు తిరిగేవారు. రచయితలను కలిసి వారి కథలు సేకరించేవారు. ఏ ఊరికి వెళ్లినా గోతాల నిండా పాత కాయితాలు మోసుకు తెచ్చేవారు. ఉపాధ్యాయుడిగా ఆయన పదవీవిరమణ తీసుకున్నాక కథానిలయమే ఆయన ప్రధాన వ్యాపకంగా మారిపోయింది. సేకరించిన కథలను పొందికగా అమర్చడం, కేటలాగులు తయారు చేయడం, దొరకని కథల కోసం వెతుకులాడడం... రచనా వ్యాసంగం కన్నా ఈ పనిలోనే కారా మేస్టారు పూర్తిగా మునిగిపోయారు. లక్షకు పైగా కథలు కథానిలయంలో పోగయ్యాయి. దాదాపు వెయ్యి పత్రికల వివరాలు ఇక్కడ లభిస్తాయి. మూడు వేలకు పైగా కథా సంపుటాలు కథానిలయంలో ఉన్నాయి. వెయ్యి మంది రచయితల వివరాలు లభిస్తాయి. తెలుగుకథకు ఒక ఖజానాగా కథానిలయం మారిపోయింది. పుస్తకాలు పెరిగేకొద్దీ అలమారాల అవసరం పెరిగింది. భవనం విస్తరించాల్సి వచ్చింది. వందలాది మంది అభిమానుల సహాయ సహకారాలతో ఒక యజ్ఞంలా కారామేస్టారు కథానిలయం నిర్వహించారు. ఒక సాహిత్య ప్రక్రియ కోసమే ఇంత పెద్ద గ్రంథాలయం ఏర్పడడం ప్రపంచంలోనే అరుదైన అద్భుతం. కథానిలయంను ఆధునిక అవసరాలకు అనుగుణంగా డిజిటలీకరణ చేశారు. కథానిలయం డాట్ కామ్ అని కొడితే చాలు కథానిలయంలోని సమాచారం ఎవరైనా చూడవచ్చు. హక్కుల వివాదం లేని వేలాది కథలు పీడీఎఫ్‌లుగా ఇక్కడ లభిస్తాయి. తెలుగు కథల మీద పరిశోధనకు ఇదొక పెద్ద నిధి. తెలుగుకథనే శ్వాసించి జీవించిన కాళీపట్నం రామారావు నెలకొల్పిన కథానిలయాన్ని మరింత పరిపుష్టం చేయడం ఒక్కటే ఆయనకు సాహిత్య ప్రపంచం అర్పించే నిజమైన నివాళి.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
August 2021 Vol :7, Issue 3

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు...

# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532 స్థాపితం : 2001

## పూర్తి కంప్యూటరైజ్డ్ చేయబడిన బ్యాంకింగ్ సంస్థ

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, **తెనాలి** - 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08644 - 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) **అంగలకుదురు** ఫోన్ : 08644 - 233299
2) **కొల్లూరు** ఫోన్ : 08644 - 243788
3) **బాపట్ల** ఫోన్ : 08643 - 224051
4) **కొల్లిపర** ఫోన్ : 08644 - 245399
5) **రేపల్లె** ఫోన్ : 08648 - 222388
6) **మంగళగిరి** ఫోన్ : 08645 - 231255
7) **చెరుకుపల్లి** ఫోన్ : 08648 - 294422

### ఖాతాదారులకు మా సేవలు

| | |
|---|---|
| సేవింగ్స్ ఖాతాలపై | 5.0% |
| 30 రోజుల నుండి 45 రోజుల వరకు | 5.0% |
| 46 రోజుల నుండి 90 రోజుల వరకు | 6.0% |
| 91 రోజుల నుండి 180 రోజుల వరకు | 6.5% |
| 181 రోజుల నుండి 1 సంవత్సరము వరకు | 7.0% |
| 1 సంవత్సరము పై కాలము నుండి 24 నెలల వరకు | 7.5% |

**అప్పులు**

బంగారు వస్తువుల హామీపై
ప్రతిరోజూ గ్రాముకు రూ. 3,500/-లు
చొప్పున 11.5% తక్కువ వడ్డీకి అప్పులివ్వబడును
ఇళ్ళు ఇళ్ళ స్థలాలు, ఇతర స్థిరాస్తుల హామీపైన
మరియు పర్సనల్ లోన్స్ 16%
వడ్డీకి ఇవ్వబడును

**డిపాజిట్స్ పై సీనియర్ సిటీజన్స్‌కు ఒక శాతం అదనపు వడ్డీ**

**నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు**
**చిన్న మొత్తాల పొదుపు పథకం - డైలీ డిపాజిట్**

**లాకర్స్ సదుపాయం కలదు**

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, చరవాణి : 93478 96473



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ॥శే॥ దావులూరి సోమశేఖరరావు

### పాలక మండలి

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ కఠారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ అంబటి పోతురాజు, డైరెక్టర్
శ్రీ దావులూరి చక్రధర్ చౌదరి, డైరెక్టర్
శ్రీ వి.వి.వి. శివప్రసాదరావు, డైరెక్టర్



అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

**ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.**
**డిపాజిట్స్ చేయండి - అధిక లాభం, విలువైన సేవలు పొందండి.**

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244